www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 75

ప్రభుత్వ ఒత్తిడి వల్లే!

నిర్దిష్ట వ్యవధిలోగా బ్యారేజీల నిర్మాణం పూర్తి చేయాలని సర్కారు ఒత్తిడి చేసింది
ప్రభుత్వం చెప్పినట్లే బ్యారేజీలు కట్టాం.. అందుకే ప్రతికూల ఫలితాలు వచ్చాయి
కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదించిన నిర్మాణ సంస్థలు
'హైడ్రాలజీ, డిజైన్స్' ఇంజనీర్లనూ విచారించిన కమిషన్.. అఫిడవిట్లకు ఆదేశం
అఫిడవిట్లు అందాకే సంస్థలపై ఒత్తిడి చేసిన బాధ్యులకు నోటీసులు: జస్టిస్ ఘోష్
నేడు నిపుణుల కమిటీతో కమిషన్ భేటీ 3

కరెంటు కవిఎషన్‌కు అజయ్‌మిశ్రా వివరణ

ఇక మిగిలింది కేసీఆర్ ఒక్కరే! 15

గురువారం | 13-6-2024 | పేజీలు: 16
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.34 తదుపరి అష్టమి; నక్షత్రం: పుబ్బ తె. 5.08 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.11.10-12.58; దుర్ముహూర్తం: ఉ.10.04-10.57, మ.3.17-4.09; అమృతఘడియలు: రా.9.57-11.44; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నవ్యాంధ్రలో నవశకం

అతిరథ మహారథుల సమక్షం...
అభిమానుల ఆనంద సందోహం...
అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం
ఆంధ్రప్రదేశ్‌లో నూతన శకం ఆరంభం!


బాబును ఆత్మీయంగా హత్తుకొని అభినందిస్తున్న ప్రధాని మోదీ

అంగరంగ వైభవంగా కొలువు తీరిన 'కూటమి'

ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
మంత్రిగా జనసేనాధిపతి పవన్ కల్యాణ్ ప్రమాణం
లోకేశ్, అచ్చెన్నాయుడు సహా 24 మంది మంత్రులు
వేదికపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
చంద్రబాబు, పవన్‌కు మోదీ ప్రత్యేక అభినందనలు
ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి, రజనీకాంత్, బాలయ్య
భారీగా తరలి వచ్చిన ప్రజలు, అభిమానులు
..'అను నేను' అనగానే హోరెత్తిన హర్షధ్వానాలు

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహా అనేక మంది ప్రముఖుల నడుమ కొత్త సర్కారు కొలువు తీరింది. గన్నవరం సమీపంలోని ఐటీ పార్క్ వద్ద ముఖ్యమంత్రి, మంత్రులచేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణ స్వీకార ముహూర్తం! కానీ... ఆరు నిమిషాలు ఆలస్యంగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని మోదీ, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులతో కలిసి చంద్రబాబు వేదిక పైకి వచ్చారు. నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్

మిగతా 14వ పేజీలో... 14



మీ తమ్ముడు గట్టివాడు!

పవన్ కల్యాణ్ గురించి చిరంజీవితో ప్రధాని మోదీ
మురిసిపోయిన అన్నయ్య.. వేదికపై బాలయ్య సందడి
పవన్ ప్రమాణ స్వీకారం చూసి చిరంజీవి సంతోషం

కొత్త తరానికి అందలం

సీనియర్లకూ ప్రాధాన్యం.. సామాజిక సమతౌల్యం!
మంత్రివర్గం కూర్పులో చంద్రబాబు నేర్పు 15
17 మందికి తొలిసారి మంత్రివర్గంలో చోటు
భావి నాయకత్వం పెంపొందించే దిశగా అడుగులు!
24 మంది మంత్రుల్లో సగం బలహీనవర్గాల వారే
సామాజిక సమీకరణలతో కొందరు సీనియర్లకు నిరాశ
యనమల, అయ్యన్నకు దక్కని పదవులు


కువైట్‌లోని మంగఫ్ మునిసిపాలిటీ పరిధిలో ఎన్‌బీటీసీ గ్రూప్ భవనంలో చెలరేగిన మంటలు

కువైట్‌లో భారీ అగ్ని ప్రమాదం

50 మంది భారతీయుల దుర్మరణం

మరో 35 మందికి గాయాలు.. వారిలో ఏడుగురి పరిస్థితి విషమం
మృతులంతా మలయాళీ, తమిళులే.. అందరూ ఎన్‌బీటీసీ కార్మికులే
అంతస్తుల భవనంలో తెల్లవారుజామున వ్యాపించిన మంటలు
గ్యాస్ లీకేజీతోనే అగ్నిప్రమాదం
నిద్రలోనే అనంత లోకాలకు 35 మంది
చికిత్స పొందుతూ 15 మంది మృతి
మునిసిపాలిటీ అధికారుల సస్పెన్షన్
ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
మృతుల కుటుంబాలకు 2 లక్షలు
కువైట్‌కు కేంద్ర మంత్రి కేవీ సింగ్
తెలుగు వారంతా క్షేమం

కువైట్ సిటీ/న్యూఢిల్లీ/తిరువనంతపురం, జూన్ 12: పొట్టకూటి కోసం దేశం కాని దేశం వెళ్లి.. భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకునేందుకు రేయింబవళ్లు కష్టపడి పనిచేసే ఆ కార్మికుల ఊపిరి ఆగిపోయింది. కాయ కష్టం చేసి, ఆదమరిచి సేదతీరుతున్న వారిలో 35 మంది భారీ అగ్నిప్రమాదంతో నిద్రలోనే తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. పొగతో ఉక్కిరిబిక్కిరై కొందరు.. పైఅంతస్తుల నుంచి కిందకు దూకి తప్పించుకునే ప్రయత్నంలో

మిగతా 12వ పేజీలో...



మద్యం దుష్ప్రభావాలకు చెక్ పెట్టే జెల్

రక్తంలోకి ప్రవేశించిన మద్యం హానికరంగా మారకుండా అడ్డుకట్ట
ఎలుకల రక్తంలో ఈ జెల్‌తో 40-56% మేర తగ్గిన మద్యం స్థాయిలు
ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞుల ఘనత 12

పాక్ ఉగ్రవాదికి క్షమాభిక్ష తిరస్కరణ

2000లో ఎర్రకోటపై దాడి కేసులో ఆరిఫ్‌కు మరణశిక్ష
రివ్యూ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
తాజాగా క్షమాభిక్ష పిటిషన్‌ను తోసిపుచ్చిన రాష్ట్రపతి



ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!
తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు 9
రాష్ట్రంలో కొత్త కళాశాలలపై కొనసాగుతున్న సందిగ్ధత
ఇప్పటిదాకా తనిఖీలకు రాని ఎన్‌ఎంసీ
ఈ ఏడాది ఆయా కళాశాలల్లో ప్రవేశాలు అనుమానమే

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

- అక్టోబరు 21 నుంచి 27 దాకా పరీక్షల నిర్వహణ
- మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ!
- అక్టోబరు 21వ తేదీన జనరల్ ఇంగ్లిష్ పరీక్ష
- అన్ని పరీక్షలూ ఒకే మాధ్యమంలో రాయాలి
- అభ్యర్థులకు కమిషన్ అధికారుల సూచనలు
- త్వరలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్ పరీక్షలను అక్టోబరు 21 నుంచి 27 దాకా.. వరుసగా ఏడు రోజుల పాటు నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అధికారులు నిర్ణయించారు. రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల దాకా పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తున్నారు. అయితే... అభ్యర్థులు అన్ని పరీక్షలనూ ఏదో ఒక

మిగతా 9వ పేజీలో...

నేటి నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ 9



టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న సీఎం రేవంత్, ఉన్నతాధికారులు

టెట్ ఫలితాల విడుదల

పేపర్-1లో 67%.. పేపర్-2లో 34.18% అర్హత
ఫలితాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్
అర్హత సాధించని అభ్యర్థులకు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2024) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. పేపర్-1లో 67.13%, పేపర్-2లో 34.18% మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో మే 20 నుంచి జూన్ 2వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో టెట్‌ను నిర్వహించారు. పేపర్-1 పరీక్షలను ఏడు సెషన్లలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ, బెంగాలి వంటి మొత్తం 8 భాషల్లో నిర్వహించారు. పేపర్-2 పరీక్షలను 13 సెషన్లలో మొత్తం 7 భాషల్లో నిర్వహించారు. టెట్-2024కు సుమారు 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షకు 85,996 మంది

మిగతా 11వ పేజీలో...

నేడు లాసెట్ ఫలితాల విడుదల 9

మద్యం కొత్త బ్రాండ్లకు బ్రేక్



5 కంపెనీలకు అనుమతుల నిలిపివేత.. సీఎం రేవంత్ నిర్ణయం
త్వరలో కొత్త మద్యం విధానంపై కీలక భేటీ

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లకు బ్రేక్ పడింది. ఐదు కంపెనీలకు ఇటీవలే ఇచ్చిన అనుమతులను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ నిలిపివేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నిర్ణయం తీసుకున్నారు. సోమ్ డిస్టిలరీస్‌తో పాటు కర్ణాటకకు చెందిన టోయిట్, మధ్యప్రదేశ్‌కు చెందిన మౌంట్ ఎవరెస్ట్, హైదరాబాద్‌కు చెందిన ఎక్సాటికాతోపాటు మరో కంపెనీకి కూడా రాష్ట్రంలో బీర్ల సరఫరాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ వేసవిలో తీవ్రమైన బీర్ల కొరత ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతీ ఏటా వేసవిలో డిమాండ్ అధికంగా ఉంటుందని తెలిసీ.. దానికి అనుగుణంగా ఈసారి సరఫరా జరగలేదు. కొత్త మద్యం బ్రాండ్లను తెచ్చేందుకే కృత్రిమ కొరత సృష్టించారన్న ఆరోపణలు వచ్చాయి. మరోవైపు అనుమతులు పొందిన కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో నాసిరకం మద్యం సరఫరా చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఐదు మద్యం కంపెనీలకు ఇచ్చిన అనుమతులను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అనుమతులను నిలిపివేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ తెలిపింది. అయితే మద్యం అమ్మకాల ద్వారా ఎక్సైజ్ శాఖ నుంచి భారీగా ఆదాయాన్ని ఆశిస్తున్న ప్రభుత్వం.. నూతన మద్యం విధానాన్ని ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై కీలక సమావేశం ముఖ్యమంత్రి నేతృత్వంలో త్వరలో నిర్వహించనున్నట్టు తెలిసింది.

పాఠ్యపుస్తకాల పంపిణీలో గందరగోళం

'ముందుమాట'లో మాజీ సీఎం కేసీఆర్, గత మంత్రులు, అధికారుల పేర్లు
విద్యాశాఖ అధికారులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీహరి ఆగ్రహం
పలుచోట్ల ఆ పేజీ తొలగించి పంపిణీ.. 'బడిబాట'లో పాల్గొన్న మంత్రులు

సంగారెడ్డిఅర్బన్/వైరా/అమరచింత/రాయికోడ్/ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాఠశాలల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాల పంపిణీలో పలుచోట్ల గందరగోళం చోటు చేసుకుంది. విద్యాశాఖ అధికారులు పంపిణీ చేసిన తెలుగు పాఠ్యపుస్తకాల్లోని 'ముందుమాట'లో మాజీ సీఎం కేసీఆర్, గత మంత్రులు, ఉన్నతాధికారుల పేర్లు ఉండటమే ఇందుకు కారణం.. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు

మిగతా 11వ పేజీలో...


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

86 స్కూల్ బస్సుల సీజ్

రవాణా శాఖ తనిఖీల్లో ఫిట్‌నెస్, పర్మిట్లు లేని వాహనాల గుర్తింపు
తనిఖీలకు ప్రత్యేక బృందాలు.. డ్రైవర్ల అనుభవం, అర్హత పరిశీలన 11

రుణమాఫీపై ప్రణాళిక!

విధివిధానాలపై వారంలో క్యాబినెట్ భేటీ
కటాఫ్ తేదీ, అర్హుల గుర్తింపుపై అందులోనే నిర్ణయం
పేద రైతులకు ఊరట కలిగేలా చేయాలని నిశ్చయం
ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాల పరిశీలన
'పీఎం-కిసాన్' తరహాలో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, మరికొన్ని వర్గాలను మినహాయించాలా? వద్దా?
మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ అమలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగా కేంద్రం అమలుచేస్తున్న ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి సహా ఇతర రైతు సంక్షేమ పథకాలకు అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో చేసిన అధికారులు చేసిన అధ్యయనాలను కూడా పరిగణనలోకి తీసుకుని.. పేద, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ప్రధానంగా



మిగతా 15వ పేజీలో...



ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో పెరుగుతున్న ఆదాయం
ఏప్రిల్‌లో 60 కోట్లు.. మేలో 62.7 కోట్లు
టోల్ చార్జీల పెంపుతో ఇంకా పెరిగే చాన్స్
గత ఏడాది అతి తక్కువకే 9
30 ఏళ్ల పాటు లీజుకిచ్చిన హెచ్ఎండీఏ
దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనాలు

జీవిత బీమా పాలసీలపై రుణాలు ఇవ్వాల్సిందే

పెన్షన్ పాలసీల నుంచి పాక్షికంగా 13
పెట్టుబడులు వెనక్కి.. ఐఆర్‌డీఏఐ సర్క్యులర్

చిన్నారిని కొరికి, నేలకేసి కొట్టి..

- వివాహేతర బంధానికి అడ్డొస్తోందని ప్రియురాలి కూతురిని చంపిన వ్యక్తి
- సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఘటన

చివ్వెంల, జూన్ 12: ఆ బిడ్డకు నిండా రెండేళ్లు కూడా లేవు! హాయిగా నిద్రపోతోంది. ఆమె తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి, ఆ చిన్నారిని ఇష్టమొచ్చినట్లు కొరికి.. నేలకేసి కొట్టి చంపాడు. వివాహేతర సంబంధానికి ఆ బిడ్డ అడ్డొస్తోందనే ఉన్మాదంతో అతడు ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలోని రెంజల్ మండల పరిధిలోని సాటాపూర్‌కు చెందిన మోత్కా విజయ, సాయిలు దంపతుల కుమార్తె రమ్య అలియాస్ నవ్యశ్రీకి అదే మండలంలోని గుండారానికి చెందిన కటకట లక్ష్మణ్‌తో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి కుమార్తెలు అరుణ్య (4), మహాన్వి (22నెలలు) ఉన్నారు. అదే మండలంలోని తన అత్తగారి ఊరైన గుండారం గ్రామానికి చెందిన బొల్లంక అరవిందరెడ్డితో నవ్యశ్రీకి ఏడు నెలల క్రితం వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నవ్యశ్రీని పెళ్లి చేసుకుంటానని, ఇద్దరు కుమార్తెల బాధ్యతను తానే చూసుకుంటానని నవ్యశ్రీని అరవిందరెడ్డి నమ్మించాడు. ఆమెను, ఇద్దరు పిల్లలను తీసుకొని 20 రోజుల క్రితం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఐలాపురం గ్రామానికి తీసుకువచ్చి ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ నెల 11న మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో మహాన్వి నిద్రిస్తుండగా, తల్లి నవ్యశ్రీ పెద్ద కుమార్తె ఆరుణ్యను తీసుకొని కిరాణ దుకాణం వద్ద సరుకులు తీసుకురావడానికి వెళ్లింది. ఈ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న మహన్విని అరవిందరెడ్డి పలుచోట్ల కొరికి, నేలకేసి కొట్టాడు. ఈ ఘటనలో ఆమె మృతిచెందగానే అరవిందరెడ్డి అక్కడి నుంచి పరారయ్యాడు. షాపు నుంచి ఇంటికొచ్చిన నవ్యశ్రీకి చిన్న కుమార్తె విగతజీవిగా పడి ఉండటంతో సటాపుపూర్‌లోని తన మేనత్త కటికల నాగమణికి చెప్పింది. బుధవారం ఉదయం నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు.

‘గొర్రెల’ కేసులో తెరపైకి కొత్త పేర్లు!

నోటీసుల జారీకి ఏసీబీ రంగం సిద్ధం

ముగిసిన రాంచందర్, కల్యాణ్ కస్టడీ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన రూ.700 కోట్ల కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాంచందర్ నాయక్, కల్యాణ్‌ల 3 రోజుల ఏసీబీ కస్టడీ బుధవారం ముగిసింది. చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులను ఉదయం కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచి తిరిగి జైలుకు తరలించారు. గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసిన సమయంలో రాంచందర్ నాయక్ తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓగా కీలక బాధ్యతల్లో ఉండగా, కల్యాణ్ అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి వద్ద ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించారు. మూడు రోజుల కస్టడీలో ఏసీబీ అధికారులు వీరిద్దరినీ వేర్వేరుగా విచారించి వందకుపైగా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సమాధానం ఇవ్వకుండా తప్పించుకోవటానికి నిందితులు ప్రయత్నించినప్పటికీ.. అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలు, పత్రాల్ని ముందు పెట్టి ప్రశ్నించటంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు నోరు విప్పినట్లు సమాచారం. కేసుతో సంబంధం ఉన్న మరికొందరి పేర్లు వెల్లడించారని, దీంతో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కొందరు ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఈ కేసులో కొత్తగా వెలుగులోకి వచ్చాయని తెలిసింది. ఈ నేపథ్యంలో మరికొందరికి నోటీసులు జారీ చేసి విచారించేందుకు దర్యాప్తు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లు కీలకం

గొర్రెల పథకం అమలులో నకిలీ బిల్లులు, ఇన్వాయిస్‌లు సృష్టించి రైతుల పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి వందల కోట్లు దారి మళ్లించినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటి వరకు పట్టుబడ్డ వారిని విచారించిన సమయంలో ఎవరి ఆదేశాల మేరకు పనిచేయాల్సి వచ్చింది, డబ్బుల్లో ఎవరి వాటా ఎంత అనే వివరాలు రాబట్టారు. ఈ కేసులో కంప్యూటర్ ఆపరేటర్లు కీలక సాక్ష్యాధారాలు అందించే అవకాశం ఉందని, వారిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతోనే బైకులు, ఆటోలు, అంబులెన్స్‌ల ఫొటోలు అప్‌లోడ్ చేసి, బిల్లులు ఎంట్రీ చేశారు. ఆ వివరాల మేరకు బిల్లులు చెల్లింపు జరిగింది. ఈ నేపథ్యంలో ఎవరు చెబితే ఆ వివరాల్ని కంప్యూటర్లలో పొందుపర్చారనే సమాచారాన్ని స్వయంగా ఆపరేటర్ల నుంచి తీసుకుంటే కేసులో పురోగతి ఉంటుందని అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు, గొర్రెలు విక్రయించిన వారి పేరిట వివిధ బ్యాంకుల్లో ప్రభుత్వం నుంచి డిపాజిట్ అయిన నగదు వివరాలను కూడా ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు వివిధ బ్యాంకులకు లేఖలు రాస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ ఒత్తిడి వల్లే!

- నిర్దిష్ట వ్యవధిలోగా బ్యారేజీల నిర్మాణం..
- పూర్తి చేయాలని సర్కారు ఒత్తిడి చేసింది
- ప్రభుత్వం చెప్పినట్లే బ్యారేజీలు కట్టాం
- అందుకే ప్రతికూల ఫలితాలు వచ్చాయి
- కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్‌కు.. నివేదించిన బ్యారేజీల నిర్మాణ సంస్థలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణాన్ని నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని గత ప్రభుత్వం తమపై ఒత్తిడి చేసిందని నిర్మాణ సంస్థలు తెలిపాయి. ఆ ఒత్తిడితో నిర్మించడం వల్లే ప్రతికూల ఫలితాలు వచ్చాయని పేర్కొన్నాయి. జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ బుధవారం బ్యారేజీల నిర్మాణ సంస్థలను విచారించగా.. ఈ మేరకు తమ వివరణ ఇచ్చాయి. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంస్థలన్నీ ఒకే అభిప్రాయాన్ని కమిషన్ ముందు వ్యక్తం చేశాయి. పనులు శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఒత్తిడి పెంచిందని చెప్పాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ప్రభుత్వం అందించిన డిజైన్ల ప్రకారమే గడువులోగా పనులు పూర్తిచేసి బ్యారేజీలను అప్పగించామని తెలిపాయి. దీంతో వాస్తవాలు, కమిషన్‌కు నివేదించిన అంశాలన్నింటినీ అఫిడవిట్ల రూపంలో ఈ నెల 25లోగా అందించాలని ఆయా సంస్థలను జస్టిస్ ఘోష్ ఆదేశించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్‌టీ తరఫున ఆ సంస్థ వైస్ చైర్మన్లు ఎంవీ రామకృష్ణరాజు, సురేశ్‌కుమార్ విచారణకు హాజరయ్యారు. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్స్-విజేత జాయింట్ వెంచర్ తరఫున హైడ్రో ప్రాజెక్టుల విభాగాధిపతి కె.మల్లికార్జునరావు, జీఎం శేఖర్‌దాస్, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ నుంచి డైరెక్టర్ ఏడూరి రమేశ్, ప్రాజెక్టు మేనేజర్ కె.ఈశ్వర్‌రావు పాల్గొని కమిషన్‌కు తమ వాదనలు వినిపించారు.

లెక్క ప్రకారమే డిజైన్లు రూపొందించారా.?

బ్యారేజీల నిర్మాణంలో కీలకమైన డిజైన్లకు ఆమోదం తెలిపిన నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో)లో పనిచేసిన/చేస్తున్న చీఫ్ ఇంజనీర్లు టి.శ్రీనివాస్, వి.మోహన్‌కుమార్‌తో సహా మొత్తం 13 మంది ఇంజనీర్లను కూడా జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం విచారించారు. ఏయే అంశాలను ప్రామాణికం చేసుకొని డిజైన్లు రూపొందించారు? వాటిని రూపొందించింది మీరేనా? ఇతరులు ఇచ్చిన డిజైన్లకు మీరు ఆమోదం తెలిపారా? ఆమోదించే క్రమంలో ఏమైనా ఒత్తిడి ఉందా? నిర్మాణం జరిగే క్రమంలో డిజైన్లలో మధ్యలో మార్పులేమైనా చోటుచేసుకున్నాయా? షీట్ ఫైల్స్‌కు బదులుగా సీకెంట్ ఫైల్స్ వాడటం వల్లే బ్యారేజీలు విఫలమయ్యాయా? వంటి అంశాలపై ఆరా తీశారు. ఇక బ్యారేజీల వద్ద నీటి లభ్యతను తేల్చిన హైడ్రాలజీ విభాగంలోని చీఫ్ ఇంజనీర్‌తో పాటు మరో ఐదుగురు ఇంజనీర్లను కూడా కమిషన్ విచారించింది. అనంతరం కమిషన్ కార్యాలయంలో జస్టిస్ ఘోష్ విలేకరులతో మాట్లాడారు. నిర్మాణ సంస్థలన్నీ నిర్దిష్ట వ్యవధిలోగా పనులు పూర్తిచేయాల్సిందిగా తమకు ఒత్తిళ్లు వచ్చినట్లు చెప్పాయని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ సంస్థలు అఫిడవిట్లు దాఖలు చేశాక.. ఆ ఒత్తిళ్లకు గురిచేసిన వారికి కూడా నోటీసులిచ్చి విచారణకు పిలుస్తామన్నారు.

కొందరు అధికారులు రాష్ట్రంలో లేరు..

బ్యారేజీల నిర్మాణంతో ముడిపడి ఉన్న కొంతమంది అధికారులు రాష్ట్రంలో లేరని జస్టిస్ ఘోష్ తెలిపారు. రాష్ట్రానికి వచ్చాక వారిని కూడా విచారణకు పిలుస్తామని అన్నారు. మరోవైపు విజిలెన్స్ నివేదికలు అందాయని, ఆ నివేదిక ఇచ్చిన అధికారులతో కూడా సమావేశమవుతానని చెప్పారు. ఇక కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ సభ్యులతో జస్టిస్ ఘోష్ గురువారం సమావేశం కానున్నారు. నిపుణుల కమిటీలో ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎన్.రమణమూర్తి తదితరులున్నారు. వీరు ఇప్పటికే కమిషన్ ఆదేశాలతో బ్యారేజీలను కూడా పరిశీలించి, తగిన నివేదికను కమిషన్‌కు అందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉగ్రపంజా!

జమ్మూకశ్మీర్‌లో శాంతిస్థాపన జరిగిందని, ఉగ్రవాదాన్ని తరిమికొట్టి ప్రజలకు భద్రతను ప్రసాదించామని నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన ప్రచారమంతా ఉత్తదేనని కాంగ్రెస్ బుధవారం విమర్శించింది. మూడు రోజుల్లో మూడు ఉగ్రవాద ఘటనలు జరిగినా ప్రధాని మాట్లాడటం లేదు ఎందుకని ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. రియాసీ, కథువా, దోడాల్లో జరిగిన ఉగ్ర దాడులు పరిస్థితిలో ఏ మార్పూ రాలేదనడానికి నిదర్శనమని, రెండేళ్ళుగా రజౌరీ, పూంచ్‌లు సరిహద్దు ఉగ్రవాదానికి స్థావరాలుగా మారి, నలభై మంది సైనికులు బలైనారని, ఇప్పుడు పొరుగున ఉన్న రియాసీ జిల్లాలోకి కూడా ఉగ్రవాదం విస్తరించి ఏకంగా యాత్రికులమీదనే దాడి జరిగిందని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. పదేళ్ళుగా మోదీ చెబుతున్నదంతా అసత్యమేనని కాంగ్రెస్ చేస్తున్న ఈ రాజకీయ విమర్శలను అటుంచితే, ఆదివారం నాటి రియాసీ ఘటన భద్రతాదళాలకు ఒక తీవ్రమైన హెచ్చరిక.

వైష్ణోదేవి బస్సు యాత్రికులమీద ఉగ్రవాదులు అత్యంత అధునాతనమైన తుపాకులతో కాల్పులు జరిపి డ్రైవర్‌ను చంపివేయడంతో, బస్సు అదుపుతప్పి లోయలో పడి 10మంది మరణించారు, ముప్పైమంది గాయపడ్డారు. స్థానిక ఉగ్రవాదులు కాదు, సరిహద్దుదాటివచ్చినవారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని నిఘావర్గాలు అన్నాయి. స్థానిక ఉగ్రవాదులు యాత్రికులను లక్ష్యంగా చేసుకొని ఇటువంటి దారుణాలకు పాల్పడటం అత్యంత అరుదు. పర్యాటకాన్ని, తీర్థ యాత్రలను దెబ్బతీసే ఇటువంటి ఘాతుకాలకు పాల్పడిన పక్షంలో, ఉపాధి దెబ్బతిని ప్రజలు తిరగబడతారని ఇక్కడి మిలిటెంట్లకు తెలుసు. కానీ, పొరుగుదేశంనుంచి చొరబడినవారికి ఇవేమీ పట్టవు. పాలకులకు సవాలు విసరడం, ప్రజలను భయోత్పాతంలో ముంచడం, శాంతిని భగ్నం చేసి తమ ఉనికిని చాటుకోవడం వారి లక్ష్యాలు. కనీసం ఎనభైమంది విదేశీ ఉగ్రవాదులు ఇక్కడ కార్యకలపాలు నిర్వహిస్తున్నారన్న అంచనాలు నిజమైనపక్షంలో, భద్రతాదళాలకు అది అత్యంత తీవ్రమైన సవాల్. ఆధునిక ఆయుధాలతో ఈ ఉగ్రవాదులు సృష్టించగలిగే విధ్వంసం ఊహకు అందనిది.

జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత ఉగ్రవాద ఘటనలు ఆరవై శాతానికి పైగా తగ్గిపోయాయంటూ మొన్న జనవరిలో హోంమంత్రి అమిత్ షా లెక్క విప్పిచెప్పారు. రాళ్ళురువ్వడం నుంచి కాల్పులవరకూ వివిధ అంశాల్లో వచ్చిన మార్పును హోంశాఖ కూడా వివరించింది. టెర్రరిజం తగ్గి టూరిజం పెరిగినందుకు ప్రధానమంత్రి తన ఎన్నికల సభలో సంతోషం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి మాట్లాడినప్పుడల్లా బీజేపీ అధినాయకులకు నెహ్రూ చేసిన తప్పిదాలు గుర్తొస్తూనే ఉంటాయి. దశాబ్దాల పాపాలను ప్రక్షాళించి ఆ రాష్ట్రాన్ని ఉద్ధరించామనీ, ప్రత్యేకప్రతిపత్తి రద్దు ద్వారా దారికి తెచ్చామని మొన్నటి ఎన్నికల వేళ వారు చాలా చెప్పుకున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో ఈ కేంద్రపాలిత ప్రాంతం చూపిన ఉత్సాహం కూడా కొత్త ఆశలు కలిగించింది. అంతాబాగున్నదని అనుకుంటున్న తరుణంలో, రియాసీ దారుణం కొత్త ఆందోళనలకు వీలుకల్పిస్తున్నది. అధీనరేఖకు కాస్తంత దూరంగా ఉండే ఈ ప్రాంతంలో, రజౌరీ, పూంచ్‌లతో పోల్చితే ఉగ్రవాదదాడులు తక్కువే. ఇక్కడే ఇంతటి భీకరమైన దాడి జరగడం విచిత్రం.

మోదీ ఏలుబడిలో, జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకూ 2,262ఉగ్రదాడులు జరిగాయని, 363మంది పౌరులు, 596మంది సైనికులు మరణించారని కాంగ్రెస్ అంటోంది. 19 భారీ ఉగ్రదాడుల్లో జరిగిన నష్టాన్నీ గుర్తుచేస్తోంది. మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంలో రియాసీ ఘటన జరగడం వెనుక ఐఎస్ఐ పాత్ర లేదని అనుకోలేం. జమ్మూకశ్మీర్‌లో తాను అనుకున్నది చేసుకుపోగలిగే అవకాశం భారత ప్రభుత్వానికి లేకుండా చేయడం ఈ దాడి ఉద్దేశం. లష్కరే తోయిబా ప్రకటన ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. గతకాలపు వాతావరణాన్ని తాము మళ్ళీ పునరుద్ధరించామని, ఇది ఆరంభం మాత్రమేనని ఆ ప్రకటన అంటున్నది. పాకిస్థాన్ సైన్యం, ఐఎస్ఐ తమకు తాముగా వ్యవహరిస్తున్నాయో, షరీఫ్ సోదరులకు చెప్పిచేస్తున్నాయో కానీ, రియాసీ వంటి ఘటనలు ఇకపై జరగకుండా ఉండాలంటే భారతదేశం భద్రతకు సంబంధించి వ్యూహాలు మార్చుకోవాలి, కొత్త జాగ్రత్తలు తీసుకోవాలి. వీటితోపాటు, సాధ్యమైనంత వేగంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పడితే ఉగ్రవాదానికి తోడ్పాటును అందించే పరిస్థితులను నిరోధించడం వీలవుతుంది.

కాంగ్రెస్ విజయాలు, వైఫల్యాలు

భారత జాతీయ కాంగ్రెస్ అధికారానికి రాలేదు గానీ దాని ప్రస్థానం ఒక మేలు మలుపు తిరిగింది. 18వ సార్వత్రక ఎన్నికలలో అంతిమంగా దానికి లభించిన మొత్తం సీట్లు 99 మాత్రమే. ప్రత్యర్థి పక్షం భారతీయ జనతా పార్టీకి లభించిన 240 సీట్లతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యా బలం గొప్పదేమీ కాదు. అవును, జాతీయ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అతి తక్కువ సీట్లు (100 లోపు) లభించడం ఇది మూడోసారి. 2014, 2019 సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ వరుసగా 44, 52 సీట్లు మాత్రమే సాధించింది. ఘోరమైన విషయమేమిటంటే గత లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన 52 సీట్లలో 32 కేవలం మూడు రాష్ట్రాల – కేరళ, పంజాబ్, తమిళనాడు– నుంచి మాత్రమే లభించాయి. గమనార్హమైన విషయమేమిటంటే ఈ మూడు రాష్ట్రాలలోను బీజేపీ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా లేదు. తమిళనాడులో అయితే డీఎంకెకు జూనియర్ భాగస్వామిగా కాంగ్రెస్ పోటీ చేసింది.



▪ యోగేంద్ర యాదవ్



ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో 400కు పైగా సీట్లు సాధించాలనే లక్ష్యాన్ని బీజేపీ నిర్దేశించుకున్నది. దేశ వ్యాప్తంగా బలమైన ఉనికితో తనకు దీటైన జాతీయ ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్‌ను పూర్తిగా కుదేలుపరచడమే బీజేపీ ధ్యేయం. బీజేపీ ప్రచారానికి తగ్గట్టుగానే ఒక దశలో ఈ సారి కాంగ్రెస్‌కు దక్కే సీట్లు సంఖ్య 40 కంటే తక్కువగా ఉండవచ్చని, ఎన్నికల అనంతరం ఆ జాతీయ పార్టీ దక్షిణ భారతీయ జాతీయ కాంగ్రెస్‌గా మిగిలిపోవచ్చనే అభిప్రాయం బాగా వ్యక్తమయింది. అయితే కాంగ్రెస్ ప్రతికూల పరిస్థితులు అన్నిటినీ అధిగమించి తన సీట్ల సంఖ్యను ఇంచుమించు రెట్టింపు చేసుకున్నది. అంతిమంగా, పునరుత్థానమవుతున్న పార్టీగా వెలుగొందింది. ఏమైనా 2024 సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్‌ది ఆశ్చర్యకరమైన విజయగాథ. ఎల్లెడలా విజయాలు సాధించింది. హర్యానా నుంచి బిహార్ దాకా హిందీ రాష్ట్రాలలో ఆ పార్టీ సంఖ్యా బలం 5 నుంచి 23కి పెరిగింది. మహారాష్ట్రలో పోటీ చేసిన సీట్లను దాదాపుగా గెలుచుకున్నది– అన్ని నియోజకవర్గాలలోను భారీ మెజారిటీ సాధించింది. పంజాబ్‌లో బీజేపీకి ఒక్క సీటును కూడా దక్కనివ్వక పోవడంలో కాంగ్రెస్ సఫలమయింది. జాతుల ఘర్షణతో అతలాకుతలమైన మణిపూర్‌లోని రెండు సమస్యాత్మక నియోజకవర్గాలనూ కైవసం చేసుకున్నది. నాగాలాండ్‌లోను, మేఘాలయ గారోహిల్స్‌లోను పోటీ చేయడం ద్వారా ఈశాన్య భారత రాష్ట్రాలలో తన ఉనికిని మళ్లీ సుస్థిరపరచుకున్నది. ప్రత్యర్థి పార్టీలకు గట్టి పోటీనిచ్చి తన సత్తాను చాటుకున్నది. సీట్ల సంఖ్యను పెంచుకోవడంతో పాటు ఓట్ల వాటాను సైతం కాంగ్రెస్ పెంపొందించుకున్నది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఓట్ల వాటా 1.7 శాతం మేరకు పెరిగింది. ఇది అద్భుతమైన విజయం కాకపోవచ్చు గానీ ఆరోగ్యకరమైన పెరుగుదల అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భారత్ జోడో యాత్రతో ప్రారంభమైన కాంగ్రెస్ నవ ప్రస్థానం ఆ పార్టీ పట్ల బలంగా ఉన్న మిథ్యా భావనలు లేదా తప్పుడు అభిప్రాయాలను పటాపంచలు చేసింది. వాటిని వివరంగా చూద్దాం. (1) ఒక రాష్ట్రంలో మూడో స్థానానికి నెట్టివేయబడిన తరువాత కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల లోనూ అక్కడ పుంజుకోలేదన్నది మొదటి తప్పుడు అభిప్రాయం. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయంతో అది పూర్తిగా తొలగిపోయింది. 2019 సార్వత్రక ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ సీట్ల సంఖ్యలో మూడో స్థానానికి పడిపోయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయాలను ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో నిలుపుకున్నది. (2) లోక్‌సభ ఎన్నికలలో ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలో బీజేపీతో ముఖాముఖీ పోటీలో కాంగ్రెస్ నిలవలేదన్న తప్పుడు అభిప్రాయం ఒకటి ప్రబలంగా ఉన్నది. గత సార్వత్రక ఎన్నికలలో 190 నియోజకవర్గాలలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్నది. అప్పుడు వాటిలో కేవలం 15 సీట్లను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో ప్రధాన జాతీయ పార్టీలు రెండూ 215 నియోజకవర్గాల్లో ముఖాముఖీ తలపడ్డాయి. అయితే కాంగ్రెస్ ఈ సారి వాటిలో 62 నియోజకవర్గాలను కైవసం చేసుకున్నది. బీజేపీ గెలిచిన సీట్లలో ఆ పార్టీకి మెజారిటీని గణనీయంగా తగ్గించడంలో కూడా కాంగ్రెస్ సఫలమయింది. (3) ఒక ప్రాంతీయ రాజకీయ పక్షం లేదా ఒక కుల లేదా మత ఆధార రాజకీయ శక్తికి కోల్పోయిన స్థానాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ పునః సాధించుకోలేదు. ఇది కూడా ఒక తప్పుడు అభిప్రాయమే గత రెండు దశాబ్దాలుగా అస్సాంలో తనకు పలు విధాల నష్టం కలిగిస్తూ అన్ని విధాల ప్రయోజనం పొందుతున్న బద్రుద్దీన్ అజ్మల్ నాయకత్వంలోని ఏఐయుడిఎఫ్‌ను ఈ సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ పూర్తిగా ఓడించింది. అలాగే హర్యానాలో జేజేపీపై కూడా విజయం సాధించింది. (4) ఆపరేషన్ కమల్‌ను కాంగ్రెస్ తట్టుకోలేదన్నది కూడా పూర్తిగా మిథ్యా భావనే. హిమాచల్‌ప్రదేశ్ ఓటర్లు ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ వైపు మొగ్గారు. అయితే లోక్‌సభతో పాటు శాసనసభ ఉప ఎన్నికలలో బీజేపీకి ఫిరాయించిన శాసన సభ్యులు అందరినీ తిరస్కరించారు.



18వ లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌ది ఆశ్చర్యకరమైన విజయగాథ. బీజేపీకి లభించిన 240 సీట్లతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యా బలం గొప్పదేమీ కాదు. సార్వత్రక ఎన్నికలనే అన్‌లిమిటెడ్ ఓవర్స్ టెస్ట్ మ్యాచ్‌లో సంపూర్ణ విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతో కష్టపడవలసి ఉన్నది. ఉగ్ర వేసవి రోజున, పాడైన పిచ్‌పై, బాడీ లైన్ బౌలర్స్, నిష్పాక్షికంగా వ్యవహరించని అంపైర్లు, ప్రతికూల వ్యాఖ్యాతలను తట్టుకుని 99 పరుగులు తీయడం అల్ప విజయమా?

(5) కాంగ్రెస్ తన మిత్రపక్షాలకు పెద్ద భారమవుతుంది అన్నది మరొక తప్పుడు అభిప్రాయం. ఇది ఒకప్పుడు నిజం కావచ్చు గానీ, ఇటీవలి ఎన్నికలలో అది తప్పు అని రుజువయింది. కేవలం తమిళనాడు, మహారాష్ట్రలో మాత్రమే కాదు యూపీ, బిహార్, ఢిల్లీ, జమ్ము కశ్మీర్‌లో కూడా కాంగ్రెస్, ఇండియా కూటమిలోని తన భాగస్వామ్య పక్షాల విజయానికి విశేషంగా తోడ్పడింది. (6) ఉత్తరప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం అనంతరం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. రాష్ట్ర ఎన్నికలలో కేవలం 2 శాతం ఓట్లను మాత్రమే పొందిన కాంగ్రెస్ ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో గణనీయమైన సంఖ్యలో సీట్లు, ఓట్లు సాధించుకోవడం అద్భుత విజయమేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. (7) ప్రజా ఉద్యమాలతో మమేకం కాదన్నది కాంగ్రెస్‌పై ఉన్న మరొక తప్పుడు అభిప్రాయం. దశాబ్దాల పాటు అధికార పార్టీ లేదా ఆధిపత్య రాజకీయ శక్తిగా ఉన్న కాంగ్రెస్ ఎట్టకేలకు పాలక పక్షాల, ఆధిపత్య శక్తుల వ్యతిరేక రాజకీయాలతో తనను తాను సంధానం చేసుకోవడాన్ని నేర్చుకున్నది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ యూపీలో రైతుల ఆందోళనలు, ముస్లిం పౌరులు నిర్వహించిన పౌరసత్వ చట్టాల వ్యతిరేక ఉద్యమాలకు మద్దతునివ్వం ద్వారా కాంగ్రెస్ బాగా లబ్ధి పొందింది.

భారత జాతీయ కాంగ్రెస్ మళ్లీ ప్రజల ఆదరణను, మద్దతును పొందుతున్నది. అయితే ఇది ఆరంభం మాత్రమే. ఈ శుభ పరిణామం పట్ల సంతృప్తి చెంది, నిష్క్రియాత్మకంగా ఉండడం ఎట్టి పరిస్థితులలోను తగదు. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ చెప్పుకోదగిన విజయాలు సాధించినప్పటికీ వైఫల్యాలూ అనేకమున్నాయి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పరాజిత బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గాలను ఆకట్టుకోవడంలో విఫలమయింది. ఒడిషాలో బిజూ జనతాదళ్–బీజేపీ జుగల్ బందీకి ప్రత్యామ్నాయమయేందుకు లభించిన సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకున్నది. కర్ణాటకలో తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చినప్పటికీ అందుకు తగ్గట్టుగా ప్రజల మద్దతును సాధించుకోవడంలో విఫలమయింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. బెంగాల్‌లో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహంతో ప్రజల నుంచి రాజకీయ సుహృద్భావాన్ని పోగొట్టుకున్నది; సంభావ్య రాజకీయ భాగస్వామిని దూరం చేసుకున్నది. ఫలితంగా బీజేపీకి ఆరు సీట్లను పోగొట్టుకున్నది. ఇక ఢిల్లీలో ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. సార్వత్రక ఎన్నికలనే అన్‌లిమిటెడ్ ఓవర్స్ టెస్ట్ మ్యాచ్‌లో సంపూర్ణ విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతో కష్టపడవలసి ఉన్నది. ఉగ్ర వేసవి రోజున, పాడైన పిచ్‌పై, బాడీ లైన్ బౌలర్స్, నిష్పాక్షికంగా వ్యవహరించని అంపైర్లు, ప్రతికూల వ్యాఖ్యాతలను తట్టుకుని 99 పరుగులు తీయడం ఒక అల్ప విజయం ఎంత మాత్రం కాదు సుమా!

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది మూడవది)

ఓటమిని దాచి నటన చేయగలమా?

పొంగిపోము, కుంగిపోము అని రాజకీయ నాయకులు చెబుతుంటారు కానీ, అంత స్థిత ప్రజ్ఞులు ఇప్పుడు ఎవరున్నారు? పైకి ఎలా కనిపించినా లోలోపల వాళ్ల మనస్సులు గాల్లో తేలిపోవడమో, పాతాళానికి జారిపోవడమో చేస్తుంటాయి. బుద్ధినే కాదు, మనఃస్థితిని కూడా ప్రదర్శించేది ముఖమే. జయాపజయాల సందర్భాలలో ఎంత దాచుకున్నా, సంతోష విచారాలు ముఖాల్లో తొంగిచూస్తాయి. ప్రజా జీవితం ఒక ప్రదర్శనగా కూడా మారిపోయింది కాబట్టి, గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకోవడం, ముఖకవళికలను, ఆంగిక భాషను నియంత్రించడం కొందరికి నైపుణ్యంగా మారిపోయింది. కానీ, వారికి కూడా వశపడని సందర్భాలు కొన్ని ఉంటాయి.



ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మనకు పరిచితమైన రాజకీయ వ్యాకరణానికి లొంగేవి కావు. అంతా అధివాస్తవికత, మొత్తంగా విరోధాభాస. కొంచెం నీరు. కొంచెం నిప్పు. వారి విజయం విజయంలాగా లేదు. వీరి ఓటమి ఓటమిలాగానూ లేదు. గెలిచినవాడు కోల్పోయినట్టు విచారపడుతున్నాడు. ఓడినవాడు విజేతలాగా సంబరపడుతున్నాడు. సన్నివేశానికి అభినయానికీ మైత్రి కుదరడం లేదు. పోనీ, కొయ్యముఖం పెట్టి తప్పించుకుందామా అంటే, ముఖనటన కుదరని సంక్లిష్ట మనోభావం.

ఈ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతాపార్టీకి ఏమంత సంతోషాన్ని ఇచ్చి ఉండవు. మెజారిటీని మించి మరింత, మరింత బలాన్ని ఇవ్వమని ఓటర్లను అభ్యర్థిస్తే, వారు మెజారిటీకి ముప్పై రెండు దిగువన నిలబెట్టారు. కూటమిగా తమకు అధికారం ఖాయమే అయినా, ఈ విజయంలో తగినంత అపజయం కూడా ఉన్నది. తేజస్సు జారిపోయి, పరాధీనపు అధికారం దక్కింది కదా అని బాధపడుతున్నది. ఇక కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీల ఇండియా కూటమికి బీజేపీకి సొంతంగా వచ్చినన్ని సీట్లు కూడా రాలేదు. కానీ, బీజేపీని చావుదెబ్బ తీశామన్నట్టు అది ఆనందిస్తున్నది. ప్రియాంక గానీ పోటీచేసి ఉంటేనా, మోదీ కూడా చిత్తుగా ఓడేవాడు కదా అని పశ్చాత్తాపపడేంతగా కాంగ్రెస్‌లో విజయోత్సాహం కనిపిస్తున్నది. ఫలితాల అంతర్యం బీజేపీని తగ్గించడమే కావచ్చును కానీ చిత్తుగా ఓడించడం కాదు, ఇండియా కూటమిని పెంచడమే కావచ్చును కానీ, పూర్తిగా గెలిపించడం కాదు. ఫలితాల సాంకేతిక సత్యంతో పొంతనలేని ముఖచిత్రాలను ఈ రెండు పార్టీల శ్రేణులలో చూడవచ్చు.

నరేంద్రమోదీ ముఖం గంభీరంగా ఉంటుంది. చూపు పదునుగా ఉంటుంది. ఎప్పుడైనా నవ్వినా అది ఆత్మీయంగా కాక, యథాలాపంగా ఉంటుంది. అత్యధిక జనాదరణ కలిగిన ఒక నాయకుడు, కఠినమైన వ్యవహారసరళి, కఠోరమైన రాజకీయ సంకల్పాలు కలిగి ఉంటే ఎట్లా ఉంటారో దానికి తగ్గట్టు ఆయన ముఖకవళికలు గత పదేళ్లుగా మనకు అలవాటు అయ్యాయి. ఒక రకమైన దర్పంతో ఆయన యాభైయ్యారు అంగుళాల ఛాతీ ఉప్పొంగి కనిపించేది. ఫలితాలు వచ్చాక ఆయన ఎట్లా ఉన్నారు? ఫలితాలు రాకముందు, తొలిరౌండ్లలో వారణాసి కౌంటింగ్‌లో వెనుకబడినప్పుడు ఆయన ముఖం ఎట్లా ఉండి ఉంటుంది? కెమెరా ఎదుట లేనప్పుడు ఆయన మనోభావాలే ఆయన ముఖంలో పలికి ఉంటాయి. జూన్ నాలుగోతేదీ సాయంత్రం బీజేపీ కేంద్ర కార్యాలయానికి వచ్చినప్పుడు, ఆయన పార్టీ నాయకుడిగా, ఫలితాలపై శ్రేణులకు సంతృప్తినో, ఓదార్పునో అందించవలసిన కర్తవ్యంలో ఉన్నారు. ప్రత్యక్ష ప్రసారంలో ఆయనను చూసినవారంతా ఆయన కవళికలను శ్రద్ధగా గమనించారు. తప్పనిసరిగా ఆయన తనను తాను కూడగట్టుకున్నారు. నవ్వుతున్నారు కానీ, అది యథాలాపంగా నిర్లిప్తంగా లేక, ఏదో అప్రియ భావాన్ని ప్రకటిస్తోంది.

రాజకీయ ఆరోపణల సంగతి పక్కనబెడితే, కనీసం నాలుగైదు సీట్లను కాంగ్రెస్ నష్టపోయిన మాట వాస్తవం. రేవంత్ రెడ్డి రూపొందించిన నినాదాలు దేశమంతా కాంగ్రెస్‌కు పనికివచ్చాయి. మరి తెలంగాణలో ఎందుకు ప్రభావం వేయలేకపోయాయి? దేశమంతా తమకు దొరికిన విజయాలకు రాహుల్ గాంధీ ఎంతో ఆనందంగా ఉన్నారు. కానీ, ఆయనకు తెలంగాణలో చెలామణీ లేకపోయిందా? బీజేపీ పని అయిపోయిందని ప్రకటనలు చేస్తున్నప్పుడు, తాము అధికారంలో ఉన్న ఒక రాష్ట్రంలో బీజేపీ తన భవిష్యత్ విజయానికి విత్తనం వేసిందని రాహుల్‌గాంధీ గ్రహించారా?

తమకు దక్కింది ఆశించిన విజయమో కాదో ఆయన చెప్పలేదు. ఎన్నికల ప్రచారమంతటా ఆయన తన పేరును మాత్రమే జపించారు. ఆ నాటి సందేశం తరువాత ఇక ఆయన ఎన్డీయే ప్రతినిధిగా మారిపోయారు. రెండో ప్రభుత్వానికి కొనసాగింపే మూడో ప్రభుత్వం అన్నారు. గెలుపోటములు వస్తుంటాయి పోతుంటాయి అన్నారు కానీ, ఆ వ్యాఖ్యను ప్రస్తుత సందర్భంతో అన్వయించలేదు. అప్పటి నుంచి ఆయన చాలా కలివిడిగా కనిపించాలని చూస్తున్నారు. ఆలింగనాలు కరచాలనాలు పెంచారు. హాయిగా నవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఛాతీని కాక హృదయాన్ని ముందుకు తోస్తున్నారు. నిజానికి చాలా కష్టమైన ప్రక్రియ ఇది. నలుగురిని కలుపుకుని పోవలసిన అగత్యంలో, ఒక దృఢమైన నాయకుడికి కలిగే కష్టం ఇది. తన అపజయానికి తాను మొహం చాటేసి, సాంకేతికమయిన విజయాన్ని నెత్తిన పెట్టుకోవలసిన పరిస్థితి.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

ఓటమికి పెద్ద బాధపడకుండా, గెలుపును పెద్దగా వేడుక చేసుకోకుండా ఉండవలసిన పరిస్థితిని తెలంగాణలో కూడా చూడవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో బీజేపీకి పెద్ద లాభం చేకూర్చాయి. కాంగ్రెస్‌కు బాగా నష్టం చేశాయి. బీఆర్ఎస్ సంగతి చెప్పుకోవలసిన పని లేదు. కానీ, జాతీయ స్థాయి పరిణామాల హడావిడిలో, పొరుగు తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ఘనవిజయ సంరంభంలో, తెలంగాణ జయాపజయాలు పెద్దగా చర్చల్లోకి రాలేదు. కార్పెట్ కిందికి తోసేద్దామని ఓడిపోయినవాళ్లు అనుకుంటే సరే కానీ, నాలుగు సీట్లను రెట్టింపు చేసుకుని ఎనిమిది సీట్లు గెలిచిన బీజేపీ కూడా గెలుపు స్థాయికి తగ్గట్టు సంబరాలు చేసుకోలేదు. ఎనిమిది స్థానాల్లో గెలిచి, మరో ఏడు స్థానాల్లో రెండో స్థానంలో నిలవడం అంటే, ఆ పార్టీకి ఎంతటి పెద్ద గెంతు?

బహుశా, జాతీయస్థాయిలో పెద్ద గెలుపు దక్కలేదన్న నిరుత్సాహం తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో కూడా పనిచేసి ఉంటుంది. అదే సమయంలో, ఇప్పుడు దక్కిన ఓట్ల శాతం కానీ, సీట్లు కానీ ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వచ్చాయని, వాటిని స్థిరపరచుకోవడానికి ఇంకా చాలా కష్టపడవలసి ఉంటుందని గ్రహించడం కూడా వారి ఆనందాన్ని నిగ్రహించి ఉండవచ్చు. మరి కాంగ్రెస్ పార్టీ ఎందుకు తన ఓటమిని మభ్యపరచాలని చూస్తున్నది? జాతీయస్థాయిలో ఓటమిలో వెలిగిన విజయంలో తలమునకలైనందునా? 2019లో గెలుచుకున్న 3 స్థానాలతో పోలిస్తే ఐదు అదనంగా గెలుచుకున్నామని, బీఆర్ఎస్ తన ఓట్లను బీజేపీకి బదలాయించినందు వల్లనే ఆ స్థానాలలో ఓడిపోయామని కాంగ్రెస్ ఎందుకు వివరణలు ఇస్తున్నది? కూడబలుక్కున్నట్టు వారూ వీరూ తమ గెలుపు ఓటములను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు నిద్రపుచ్చుతున్నారు?

నిజానికి, కాంగ్రెస్ ఓట్లు 2019 సాధారణ ఎన్నికలతో కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికలతో కానీ పోలిస్తే పెరిగాయి తప్ప తరగలేదు. కాకపోతే, పెరగవలసినంత పెరగలేదు. బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో సంపాదించుకున్న 37.35 శాతం ఓట్లు, ఇప్పటి లోక్‌సభ ఎన్నికల నాటికి 16.68 శాతానికి ఆవిరయ్యాయి. అసెంబ్లీ ఓటమి తరువాత బీఆర్ఎస్‌కు ప్రాసంగికత లేదని దాదాపు 20 శాతం ఓటర్లు భావించి ఉండవచ్చు. బీజేపీకి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓట్ల శాతంలో పెరుగుదల సుమారు 20 శాతమే. సులువుగా లెక్కవేసుకోవడానికి వీలుగా, లోక్‌సభ ఎన్నికలలో ఆ 20 శాతమే బీజేపీకి అదనంగా వెళ్లాయని అనుకుందాం. ఎందుకు వెళ్లాయన్నది కదా ప్రశ్న? కాంగ్రెస్‌ను కాదని వాళ్లు బీజేపీని ఎందుకు ఎంచుకున్నారు? 2018 అసెంబ్లీ ఎన్నికలకు, 2019 లోక్‌సభ ఎన్నికలకు మధ్య కూడా బీజేపీ ఓట్లు 10 శాతం పెరిగాయి. పార్లమెంటు ఎన్నికలలో పెరగడానికి మోదీ ఆకర్షణ ఒక కారణం కావచ్చు. అసెంబ్లీ ఎన్నికలలో కూడా క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు 15 నియోజకవర్గాల్లో ప్రథమ లేదా ద్వితీయ స్థానంలో ఉన్న బీజేపీ, వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర అధికారానికి గురిపెట్టినట్టే కదా? ఇందులో వారి నిర్మాణ బలం, కృషి పాలు ఎంత? కాంగ్రెస్ వైఫల్యం ఎంత? పోనీ, వైఫల్యం కాదు అనుకుందాం.. కాంగ్రెస్‌కు పెరిగిన ప్రమాదం ఎంత? ఈ ప్రశ్నలను చర్చ నుంచి తప్పించలేము.

బీఆర్ఎస్ చెబితే తమ ఓట్లను బదలాయించే విధేయతలో ఆ పార్టీ ఓటర్లు లేరు. బదలాయింపు అన్నది రాజకీయమైన ఆరోపణ. కీలకమయిన స్థానాలలో కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను నిలబెట్టి, బీజేపీకి సహకరించిందని బీఆర్ఎస్ కూడా ఆరోపించింది. కొందరు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇతరులు కూడా రకరకాల అనుమానాలు వ్యక్తం చేశారు. ఫలితాలు ఇట్లా వచ్చాక, తాము శంకించింది నిజమైందని వారు భుజాలు చరుచుకుంటున్నారు. రాజకీయ ఆరోపణల సంగతి పక్కనబెడితే, కనీసం నాలుగైదు సీట్లను కాంగ్రెస్ నష్టపోయిన మాట వాస్తవం. రేవంత్ రెడ్డి రూపొందించిన నినాదాలు దేశమంతా కాంగ్రెస్‌కు పనికి వచ్చాయి. మరి తెలంగాణలో ఎందుకు ప్రభావం వేయలేకపోయాయి? దేశమంతా తమకు దొరికిన విజయాలకు రాహుల్‌గాంధీ ఎంతో ఆనందంగా ఉన్నారు. కానీ, ఆయనకు తెలంగాణలో చెలామణీ లేకపోయిందా? బీజేపీ పని అయిపోయిందని ప్రకటనలు చేస్తున్నప్పుడు, తాము అధికారంలో ఉన్న ఒక రాష్ట్రంలో బీజేపీ తన భవిష్యత్ విజయానికి విత్తనం వేసిందని రాహుల్‌గాంధీ గ్రహించారా?

ఇప్పుడు 15 నియోజకవర్గాల్లో ప్రథమ లేదా ద్వితీయ స్థానంలో ఉన్న బీజేపీ, వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర అధికారానికి గురిపెట్టినట్టే కదా? ఇందులో వారి నిర్మాణ బలం, కృషి పాలు ఎంత? కాంగ్రెస్ వైఫల్యం ఎంత? పోనీ, వైఫల్యం కాదు అనుకుందాం... కాంగ్రెస్‌కు పెరిగిన ప్రమాదం ఎంత? ఈ ప్రశ్నలను చర్చ నుంచి తప్పించలేము.

అన్ని పార్టీలలోను, తన స్థితిగతులను బట్టి సహజమైన వ్యక్తీకరణలను ఇస్తున్నది ఇప్పుడు ఒక్క బీఆర్ఎస్సే కనిపిస్తున్నది. కిందపడ్డా తనదే పైచేయి అన్న ధోరణి అందరిలోనూ ఉండేదే. అసెంబ్లీ అపజయం తరువాత, లోక్‌సభ ఎన్నికల సన్నాహాలలో భాగంగా, ఆ పార్టీ నేతలు కొంత గాంభీర్యాన్ని ప్రకటించకతప్పలేదు. ఇప్పుడిక సున్నా విజయాలతో, చేతిలోని శాసనసభ్యులు కూడా ఎంతవరకు నిలబడతారో తెలియని స్థితిలో ఆ పార్టీ స్తబ్ధుగా మారిపోతున్నది. బుకాయింపులకు దబాయింపులకు అసలే ఆస్కారం లేని స్థితి. ఉనికిని చాటుకునే చిటపటలు మాత్రం కొన్ని వినిపిస్తున్నాయి. బహుశా, ఇది ఆ పార్టీకి ఆత్మవిమర్శో అంతర్ధానమో తేల్చుకోవలసిన సమయం.

బీజేపీ సుపరిపాలనను అర్థం చేసుకున్న తెలంగాణ!

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయం నిస్సందేహంగా అపూర్వమైనదనే చెప్పాలి. గెలుపోటములతో సంబంధం లేకుండా బీజేపీ నిరంతరం ప్రజాభివృద్ధి కార్యక్రమాలే మా పార్టీని ప్రజలు ఇంతలా ఆదరించేలా చేశాయి. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు... ఇలా బీజేపీ చేస్తున్నది ఏమిటో ప్రజలకు అర్థమైంది. అందుకే మాకు మరింత బలాన్ని అందించేలా ప్రజలు తీర్పు చెప్పారు. సార్వత్రక లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో గెలుపొందగా నల్గొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, జహీరాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లలో రెండో స్థానంలో నిలిచింది. ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, బీజేపీ పాలనని ఆదరించారని చెప్పేందుకు ఇంతకన్న పెద్ద నిదర్శనం ఏముంటుంది.

తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో 2014లో భారతీయ జనతా పార్టీ 10.5శాతం ఓట్లు సాధించి కేవలం ఒక్క సీటును మాత్రమే గెలిచింది. అదే 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ తన పట్టు మరింత పెంచుకుని 19.8 శాతం ఓట్లతో 4 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. తాజాగా జరిగిన సార్వత్రక లోక్‌సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లను సాధించి 8 స్థానాల్లో గెలిచింది. అలాగే 2018 తరువాత జరిగిన దుబ్బాక, హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ప్రజలు బీజేపీని ఆదరించారు.

రాష్ట్ర ఆవిర్భావం తరువాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ ప్రజల్లోకి వేగంగా చొచ్చుకుని పోతూనే ఉన్నది. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలను, దేశ ప్రగతి కోసం ఆయన వేస్తున్న అడుగులను తెలంగాణ సమాజం హర్షిస్తోంది, అభినందిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, డిజిటల్ ఎకనామీకి ప్రోత్సాహం, కరోనా తరువాత పేద చిరువ్యాపారులకు వడ్డీ లేని ఆర్థిక సదుపాయం, అవినీతి రహిత పాలన... ఇవన్నీ కలిసిన సుపరిపాలన తెలంగాణ సమాజాన్ని బీజేపీ వైపునకు ఆకర్షించింది. అందుకు తాజా ఎన్నికల ఫలితాలే నిదర్శనం.

ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలను, దేశ ప్రగతి కోసం ఆయన వేస్తున్న అడుగులను తెలంగాణ సమాజం హర్షిస్తోంది, అభినందిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, డిజిటల్ ఎకనామీకి ప్రోత్సాహం, కరోనా తరువాత పేద చిరువ్యాపారులకు వడ్డీ లేని ఆర్థిక సదుపాయం, అవినీతిరహిత పాలన... ఇవన్నీ కలిసిన సుపరిపాలన తెలంగాణ సమాజాన్ని ఆకర్షించింది. అందుకు తాజా ఎన్నికల ఫలితాలే నిదర్శనం.



వికసిత భారత్ పేరుతో మోదీ తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా 2014 నుంచి ఇప్పటి వరకూ జాతీయ రహదారుల నిర్మాణం కోసం రూ.1.08 లక్షల కోట్లను తెలంగాణలో మోదీ ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎలివేటెడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఆరు వరుసల రహదారి విస్తరణలు చేస్తూ పోతోంది. రైల్వే లైన్ల ఆధునీకరణ, కొత్తలైన్ల నిర్మాణం, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, డబ్లింగ్ పనులు, విద్యుదీకరణ వంటి పనుల కోసం వేల కోట్ల రూపాయలను మోదీ ప్రభుత్వం ఖర్చు చేసింది. ఖాజీపేటలో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ – పీరియాడిక్ ఓవర్ హాలింగ్ వర్క్ షాప్‌ను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చింది. దీని వల్ల సుమారు 3 వేల మంది కార్మికులకు ఉద్యోగ ఉపాధి లభిస్తోంది. సికింద్రాబాద్‌లో ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు కూడా జరిగింది.

2014 నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వరకూ రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.2.3 లక్షల కోట్లను, వివిధ పథకాల కింద రూ.10లక్షల కోట్లను అందించింది. అవుటర్ రింగ్ రోడ్ చుట్టూ నిర్మించతలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్ కోసం రూ.26వేల కోట్లను మోదీ ప్రభుత్వం కేటాయించింది. రీజనల్ రింగ్ రోడ్ పూర్తయితే అది రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా మారుతుంది. లెక్కలేనన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వస్తాయి.

యూపీఏ పదేళ్ల పాలనలో ఏడాదికి 17కిమీ రైల్వేలైన్ నిర్మాణం రాష్ట్రంలో జరిగింది. అదే మోదీ సుపరిపాలనలో రూ.31,221 కోట్లతో 1645 కిమీ రైల్వే లైన్ల నిర్మాణం జరిగింది. రామగుండంలో 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, హైదరాబాద్ మెట్రోకి రూ.1204 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది.

రాష్ట్రంలో వరి సేకరణకు కేంద్రం అక్షరాల రూ.1.24 లక్షల కోట్లను వెచ్చించింది. దీనివల్ల రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు, ఒక్క ఎరువుల మీదనే రాష్ట్ర రైతాంగానికి రూ.27 వేల కోట్ల సబ్సిడీ లభించింది. ఒక్కో యూరియా బస్తా మీద రైతుకు రూ.2,236 సబ్సిడీని కేంద్రం ఇస్తోంది. రాష్ట్రంలోని 39 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఏటా రూ.6,000 ఇచ్చింది. రామగుండం ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ద్వారా 12.7 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది. ఇది రాష్ట్ర రైతాంగానికి ఎంతో మేలు చేసింది. బీబీనగర్ ఎయిమ్స్, ఈఎస్ఐ ఆసుపత్రుల ఆధునీకరణ కూడా మోదీ ప్రభుత్వం చేసిందే.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మోదీ సర్కార్ వచ్చే ఏడాది నాటికి శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా తీర్చిదిద్దుతుంది. అందులో భాగంగా రూ.715 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. చర్లపల్లి రైల్వేస్టేషన్ను రూ.221 కోట్లతో శాటిలైట్ టెర్మినల్‌గా కేంద్రం నిర్మిస్తోంది. రూ. 242 కోట్లతో లింగంపల్లి – ఘట్‌కేసర్ మధ్య ఎంఎంటీఎస్ త్వరలోనే ప్రారంభించనున్నాము.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచల సీతారామచంద్ర స్వామిని పూర్తిగా విస్మరించింది. మాస్టర్ ప్లాన్ పేరుతో కేసీఆర్ రాముడిని సైతం మోసం చేశారు. అయితే మోదీ సర్కార్ మాత్రం ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెంటేషన్ అండ్ స్పిర్చువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) కింద రూ.41.38 కోట్లను విడుదల చేసింది. దీంతో భద్రాచలం, పర్ణశాలల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి.

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ వరద కాలువ, జె.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్, రాజీవ్ బీమా, పెద్దవాగు, కొమురంభీం, పాలెం వాగు, గొల్లవాగు, రంగ సముద్రం, రల్లివాగు, మత్తడివాగు నిర్మాణం కోసం కేంద్రం రూ.2200 కోట్లను విడుదల చేసింది. సూర్యాపేట ఖమ్మం వరకూ నాలుగు వరుసల రహదారిని రూ.2,379.24 కోట్లతో నిర్మించింది. రాష్ట్రంలో 2014 వరకూ 86వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఉంటే, ఈ పదేళ్లలో దానికి 7 లక్షల 35 వేల కిలోమీటర్లకు పెంచడం జరిగింది. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధి రూ.105.34 కోట్లను కేంద్రమే ఇచ్చింది. ఈ నిధులతోనే స్ట్రీట్ లైటింగ్, డివైడర్లు, ఫౌంటెన్లను ఏర్పాటయ్యాయి.

రాష్ట్రంలోని మొత్తం 12,769 గ్రామ పంచాయితీలకు 14, 15వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం రూ.12,500కోట్లను అందించింది. మున్సిపాలిటీలకు 7,071 కోట్లను అందించింది. తాగునీరు, పారిశుద్ధ్యం కింద రూ. 7,200కోట్లను అందించింది. జాతీయ ఉపాధి హామీ పనుల కింద రూ.21,559.23 కోట్లను ఇచ్చింది. వైకుంఠ వాటికలు, రైతు కేంద్రాలు, డ్రైనేజీలు, ఎవెన్యూ కమ్యూనిటీ ప్లాంటేషన్, గ్రామ పంచాయితీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలు సహా మొత్తం అభివృద్ధి అంతా ఈ నిధులతోనే జరిగింది. స్వచ్ఛ భారత్ కింద రాష్ట్రానికి రూ.3,744 కోట్లను మోదీ సర్కార్ అందించింది. అందులో భాగంగా 31 లక్షల 2 వేల మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది.

అంతేకాక జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నల్లా నీరు అందించేందుకు రూ.1588.01కోట్లను ఇచ్చింది. ప్రధాన మంత్రి సౌభాగ్య యోజన కింద రాష్ట్రంలో కొత్తగా 6 లక్షల 15 వేల కొత్త విద్యుత్ కనెక్షన్లను ఇచ్చింది. రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదారులకు 28 లక్షల ఎల్ఈడీ బల్బులను, వీధి దీపాల కోసం 12 లక్షల ఎల్ఈడీ బల్బులను అందించింది. ఆయుష్మాన్ భారత్ కింద రాష్ట్రంలో 29 లక్షల 2 వేల కుటుంబాలున్నాయి. వీరికి కేంద్రం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకూ వైద్య సహాయాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకూ ఈ సేవలను రాష్ట్రంలో 9 లక్షల 83 వేల కుటుంబాలు వినియోగించుకున్నాయి.

తెలంగాణ ప్రజలు అత్యంత వివేకంతో, వివేచనతో భారతీయ జనతా పార్టీకి మద్దతుగా నిలిచారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీని ప్రజలు గుర్తించారు. నరేంద్ర మోదీ నాయత్వంపై అచంచల విశ్వాసాన్ని ప్రజలు ప్రకటించారు.

▪ దేవకి వాసుదేవరావు

లవ్లీ రెయిన్‌కోట్స్

వర్షాకాలం వేసుకునే రెయిన్ కోట్స్ ఆకర్షణీయమైన రంగుల్లో, అందమైన మోడళ్లలో తయారవుతున్నాయి. వేసుకునే దుస్తులకు తగ్గట్టు రకరకాల మోడల్స్‌లో దొరుకుతున్న రెయిన్ కోట్స్ మీద ఓ లుక్కేద్దామా?



పాంచో రెయిన్‌కోట్: ఈ రెయిన్‌కోట్ ప్లాస్టిక్‌తో తయారవుతుంది. తేలికగా ఉండే ఈ రెయిన్‌కోట్‌ను సునాయాసంగా మడత పెట్టేసి, వెంట తీసుకెళ్లిపోవచ్చు.

పాకెట్ రెయిన్‌కోట్: రెయిన్‌కోట్ కోసం ప్రత్యేకమైన సంచిని కేటాయించ లేనివాళ్లు, ఉపయోగించని సమయాల్లో దాన్ని భద్రంగా దాచాలనుకునేవాళ్లకు అనువైన రెయిన్ కోట్ ఇది. లైట్ వెయిట్, రీయూజబుల్ మెటీరియల్‌తో తయారయ్యే ఈ రెయిన్‌కోట్‌ను చిన్నపాటి పౌచ్‌లో, లేదా జేబులో దాచేయవచ్చు.

వాటర్ ప్రూఫ్ రెయిన్‌కోట్: వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్, వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్ కంటే మంచివి. వాటర్ రిపెల్లెంట్ రెయిన్ కోట్స్ తయారీలో నీటిని అంటుకోనివ్వకుండా చేసే రసాయనాలను ఉపయోగిస్తారు. కాబట్టి వాటర్ ప్రూఫ్ తరహా రెయిన్‌కోట్స్‌నే ఎంచుకోవాలి.

సాధారణంగా రెయిన్ కోట్స్ పాలియెస్టర్, రెయాన్ మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. నైలాన్‌తో పోలిస్తే పాలియెస్టర్ మెటీరియల్ తడిని సమర్థంగా ఆపుతుంది. అలాగే రెయిన్‌కోట్స్ డిజైన్ ఆధారంగా వాటికి వేర్వేరు పేర్లు కూడా ఉన్నాయి.




క్రీ.శ 1200వ శతాబ్దంలో అమేజాన్ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా రెయిన్‌కోట్స్‌ను ఉపయోగించిన చారిత్రక ఆధారాలున్నాయి. పాలను పోలిన జిగట పదార్థంతో (రబ్బర్ చెట్ల జిగురు) అప్పట్లో రెయిన్‌కోట్లను తయారుచేసేవారు. యూరోపియన్లు, అన్వేషకులు, అమెరికాస్‌కు ప్రయాణించినప్పుడు, వాన నీళ్లకు తడిచిపోకుండా కాపాడే ఈ రెయిన్‌కోట్లను వాళ్లు కనుగొన్నారు. అమేజాన్ ప్రాంత ప్రజలు రబ్బరు పాలతో రెయిన్‌కోట్లను తయారుచేసుకున్న విధానాన్ని, యూరోపియన్లు, 1700 శతాబ్దంలో కనిపెట్టగలిగారు. అలా అప్పటి నుంచి మెరుగైన రెయిన్‌కోట్ల తయారీ పరిశోధనలు మొదలయ్యాయి. 1824లో, స్కాట్‌ల్యాండ్ కెమిస్ట్, మొట్టమొదటి ఆధునిక రెయిన్‌కోట్‌ను తయారుచేశాడు. దాని తయారీకి ఉపయోగించిన టార్పాలిన్ వస్త్రాన్ని, ఇండియన్ రబ్బర్ క్లాత్ అని అతను సంబోధించేవాడు. అలా అప్పటి నుంచి రెయిన్‌కోట్లు ఎన్నో మార్పులకు గురవుతూ, ఫ్యాషన్ ప్రపంచంలో సైతం ఉనికిని చాటుకోగలిగే స్థాయికి ఎదిగాయి.

విన్నర్

మట్టి కోర్టులో తిరుగులేని తార

రికార్డులు బద్దలు కొట్టడం ఆమెకు కొత్త కాదు.
పంథొమ్మిదేళ్ల వయసులోనే 'రొలాండ్ గారోస్'ను ముద్దాడింది.
దిగ్గజాలు తలపడే గ్రాండ్‌స్లామ్‌ల్లో విజయాలూ తక్కువేం లేవు.
నాలుగేళ్లలో ఐదు టైటిళ్లు సాధించింది.
ఇప్పుడు... వరుసగా మూడోసారి 'ఫ్రెంచ్ ఓపెన్' నెగ్గి...
మట్టి కోర్టులో మహారాణిగా పూలాభిషేకం అందుకొంటోంది.
పోలెండ్ టెన్నిస్ సంచలనం... ప్రపంచ నెంబర్ వన్...
23 ఏళ్ల ఇగా స్వియాటెక్ జైత్రయాత్ర ఇది...



రాకెట్ పట్టి... టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టే ఎవరైనా కనే ఒకే ఒక్క కల... గ్రాండ్‌స్లామ్ టైటిల్. మహామహులు తలపడే ఈ మహాసంగ్రామంలో ప్రతి గెలుపు వెనుకా స్ఫూర్తి నింపే జీవిత కథలు ఎన్నో ఉంటాయి. అలుపెరుగని కృషి, పట్టుదల ఉంటాయి. అలాంటి ఒక కథే ఇగా స్వియాటెక్‌ది. పోలెండ్ దేశం వార్సాలో పుట్టింది. ఆమె తండ్రి టోమజ్ కూడా క్రీడాకారుడే. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో జాతీయ రోయింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తల్లి డొరోటా వైద్యురాలు. అక్క అగట డెంటిస్ట్. తన ఇద్దరు కూతుళ్లను క్రీడాకారులుగా చూడాలనేది టోమజ్ ఆకాంక్ష. దానికి తగినట్టుగానే అగట స్విమ్మింగ్ మొదలుపెట్టింది. కొన్ని కారణాలవల్ల కొన్నాళ్లకు టెన్నిస్‌ను ఎంచుకుంది. అక్కను చూసి స్వియాటెక్ టెన్నిస్ రాకెట్ పట్టుకుంది. ఎందుకంటే అక్కను ఓడించాలని. అయితే ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్ వరకు పోటీపడిన అగట... గాయాల కారణంగా పదిహేనేళ్ల వయసులో ఆట నుంచి తప్పుకుంది. కానీ స్వియాటెక్ మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టిన రాకెట్ వదల్లేదు. దృఢ సంకల్పంతో ముందుకు సాగింది. పదమూడేళ్లకే ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీకి వెళ్లి... కఠోర సాధన ప్రారంభించింది.

గెలుపు బాట...

2015 నుంచి ఐటీఎఫ్ జూనియర్ స్థాయిలో పోటీపడిన స్వియాటెక్... ఆ ఏడాది నాలుగు టైటిళ్లు గెలుచుకుంది. ఆ మరుసటి సంవత్సరం జూనియర్ గ్రాండ్‌స్లామ్‌లోకి అడుగుపెట్టి... 'ఫ్రెంచ్ ఓపెన్' డబుల్స్, సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ వరకు వెళ్లింది. 2018లో కాటీ మెక్‌నలీతో కలిసి 'ఫ్రెంచ్ ఓపెన్' బాలికల డబుల్స్ టైటిల్ సాధించిన స్వియాటెక్... అదే ఏడాది 'వింబుల్డన్' గర్ల్స్ సింగిల్స్ విజేతగా నిలిచింది. అప్పటికి ఆమె కెరీర్‌లో అతిపెద్ద విజయం అది. ఇక నాటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో 'డబ్ల్యూటీఏ' (ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్) టూర్‌లో పాల్గొంది. పద్దెనిమిదేళ్ల వయసులో... గ్రాండ్‌స్లామ్స్‌లోకి ప్రవేశించింది. 'ఆస్ట్రేలియన్ ఓపెన్', 'ఫ్రెంచ్ ఓపెన్'లలో పోటీపడింది.

సంచలనాలకు చిరునామా...

సంచలనాలకు చిరునామా... స్వియాటెక్ కెరీర్. 2016 నుంచి 2018 వరకు రెండేళ్ల కాలంలో ఆడిన ఏడు ఐటీఎఫ్ సర్క్యూట్ ఫైనల్స్‌లో ఓటమి ఎరుగని క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒక టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె కొట్టిన క్రాస్ కోర్ట్ ఫోర్‌హ్యాండ్ డ్రాప్ షాట్... 'డబ్ల్యూటీఏ షాట్ ఆఫ్ ద ఇయర్' (2019)గా ఎంపికైంది. తొలిసారి 'టాప్ 100'లో చోటు సంపాదించింది. అయితే ఆ తరువాత జరిగిన 'వింబుల్డన్', 'యూఎస్ ఓపెన్', 'కెనడియన్ ఓపెన్'లలో వరుస ఓటములు ఎదురయ్యాయి. కానీ ఆమె నిరాశ చెందలేదు. రెట్టించిన ఉత్సాహంతో... మరింత కఠోర సాధనతో... తిరిగి పుంజుకుంది. తనకంటే మెరుగైన సీడ్స్‌ను మట్టి కరిపిస్తూ... ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో 'టాప్ 50'లోకి దూసుకుపోయింది. అదే సమయంలో కాలి గాయం ఆమెను కొన్నాళ్లు ఆటకు దూరం చేసింది.



హ్యాట్రిక్ కొట్టి...

పాదానికి శస్త్రచికిత్స తరువాత స్వియాటెక్ మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టింది. 54వ ర్యాంకర్‌గా 2020 'ఫ్రెంచ్ ఓపెన్' బరిలోకి దిగిన ఆమె... సంచలన విజయాలు నమోదు చేసింది. 2019 రన్నరప్, ప్రపంచ 19వ ర్యాంకర్ మార్కెటా వోండ్రౌసోవాను తొలి రౌండ్‌లో ఇంటికి పంపించిన స్వియాటెక్... నాలుగో రౌండ్‌లో టాప్‌సీడ్, టైటిల్ ఫేవరెట్ సిమోనా హలెప్‌కు షాకిచ్చింది. తద్వారా సిమోనా 17 వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. అంతిమ పోరులో ప్రపంచ ఆరో ర్యాంకర్ సోఫియా కెనిన్‌ను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచిన పోలెండ్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అంతేకాదు... 'ఫ్రెంచ్ ఓపెన్' సింగిల్స్ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డును తిరగరాసింది. 2022 ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకం. ఆ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్) ఆమె ఖాతాలో చేరాయి. మరుసటి సంవత్సరం కూడా 'ఫ్రెంచ్ ఓపెన్' సొంతం చేసుకున్న స్వియాటెక్... ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకుంది. గతవారం ముగిసిన టోర్నీ ఫైనల్‌లో 6-2, 6-1తో పన్నెండో సీడ్ పాలినీని చిత్తు చేసి, మట్టి కోటలో హ్యాట్రిక్ టైటిల్స్ సాధించింది. 'రొలాండ్ గారోస్'లో హెనిన్, మోనికా సెలెస్ తరువాత వరుసగా మూడు టైటిల్స్ గెలిచిన మూడో క్రీడాకారిణి స్వియాటెక్.

అంచనాలు పెరుగుతున్నాయి...

ఇప్పటి వరకు మొత్తం 22 సింగిల్స్ టైటిల్స్ సాధించిన స్వియాటెక్‌పై అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 'గత ఏడాది దాదాపు ఆడిన అన్ని టోర్నీలు గెలవడంతో... ప్రతిసారీ అదే స్థాయిలో ఆడగలనని ప్రతిఒక్కరూ ఊహిస్తున్నారు. అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రొఫెషనల్ క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రతిభ గలవారే. అయితే ఎవరైతే ఒత్తిడి పరిస్థితులను తట్టుకొని మానసికంగా దృఢంగా ఉండగలరో వారే చాంపియన్లు అవుతారు' అంటున్న స్వియాటెక్ ఎక్కడికి వెళ్లినా ఒక స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను వెంట తీసుకువెళుతుంది. మానసిక ఆరోగ్యానికి ఆమె అంతగా ప్రాధాన్యతనిస్తుంది. 'కెరీర్ ఆరంభం రోజులతో పోలిస్తే నా జీవితం సమూలంగా మారిపోయింది. అయినా ఇవాల్టికీ నేను అదే మనిషిని. నాలో ఎలాంటి మార్పూ రాలేదు. కారణం... మానసిక పరివర్తన. చిన్నప్పటి నుంచి నాతో సైకాలజిస్ట్ ఉంటున్నారు. తను నా క్లిష్ట పరిస్థితులు, అలాగే గెలుపు క్షణాలు దగ్గర నుంచి గమనిస్తుంటుంది. నాకేంకావాలో చెబుతుంది' అంటున్న ఈ పోలెండ్ స్టార్... అపజయాన్నే కాదు, విజయాన్ని ఎదుర్కోవడం కూడా అంత సులువు కాదని చెబుతోంది. ఎంత ఎదిగినా... ఇంటికి ఎన్ని గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు తీసుకెళ్లినా... స్వియాటెక్‌లో ఇసుమంతైనా గర్వం కనిపించదు. అదే ఆమె ప్రత్యేకత.

పుస్తకాలు అద్భుత నేస్తాలు...

నేను టెన్నిస్ కోర్టులో హోరాహోరీగా పోరాడతాను. దూకుడుగా ఆడతాను. ప్రతి పాయింట్‌నూ, దానికి ప్రేక్షకులు కొట్టే చప్పట్లను ఆస్వాదిస్తాను. కానీ కోర్టు బయటకు వెళితే నేను పూర్తి భిన్నమైన వ్యక్తిని. ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడతాను. రణగొణ ధ్వనులు, జనసమర్థమైన ప్రదేశాలు నచ్చవు. ఒంటరిగా కూర్చొని 'నేషనల్ జియోగ్రాఫిక్ చానల్' చూస్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ఇవాళ ప్రతిఒక్కరూ సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడిపి, విలువైన సమయం వృథా చేస్తున్నారు. పుస్తక పఠనం మరిచిపోయారు. సామాజిక మాధ్యమాలే కాదు... ఖాళీ సమయంలో పుస్తకాలు కూడా అద్భుత నేస్తాలు.

ఆటకు ముందు సంగీతం...

మ్యాచ్‌కు ముందు ఇంపైన సంగీతం ఆస్వాదించడం స్వియాటెక్‌కు అలవాటు మాత్రమే కాదు... సెంటిమెంట్ కూడా. "గన్స్ ఎన్ రోజెస్, లెడ్ జెప్పెలిన్, జానిస్ జోప్లిన్, లెన్నీ క్రావిట్జ్ సంగీతం తరచూ వింటుంటాను. మొదట్లో మ్యాచ్‌లకు ముందు 'వెల్కమ్ టూ జంగిల్' పాప్ సాంగ్స్ వినేదాన్ని. ఎప్పుడూ ఒకే సంగీతం కాకుండా... ఎప్పటికప్పుడు మారుస్తుంటాను. లేకపోతే అది ఒక మూఢనమ్మకంలా మారిపోతుంది" అంటుంది స్వియాటెక్.

రాకెట్ ధీరలు!

ఒక రాకెట్‌ను తయారుచేయటం ఎంత క్లిష్టమైన ప్రక్రియో మనందరికీ తెలుసు. అలాంటి రాకెట్‌ను అత్యాధునిక 3డీ మోడల్‌లో తయారుచేయాలంటే? దానికి ఇంకా అత్యాధునిక పరిజ్ఞానం, నాసాలాంటి అంతర్జాతీయ సంస్థలతో పోటీపడగల సామర్థ్యం కావాలి. తాజాగా శ్రీహరికోట నుంచి అగ్నికూల్ కాస్మోస్ అనే ఒక రాకెట్‌ను ప్రయోగించారు. దీనిలోని ఇంజిన్‌ను త్రీడీ మోడల్‌లో తయారుచేశారు. ప్రపంచంలో ఈ తరహా ఇంజిన్‌ను విజయవంతంగా ప్రయోగించటం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావటంలో - శరణ్య పెరియస్వామి, ఉమామహేశ్వరి అనే ఇద్దరు యువ శాస్త్రవేత్తలు కీలకమైన భూమిక పోషించారు.

ప్రపంచంలోని అంతరిక్ష సంస్థల్లో మన ఇస్రోకు ఒక ప్రత్యేకత ఉంది. ఇతర అంతరిక్ష సంస్థలతో పోలిస్తే - మన దగ్గర పనిచేసే మహిళల సంఖ్య చాలా ఎక్కువ. సూర్యుడి దగ్గరకు వెళ్లటం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్‌లో నైగర్ షాజీ అనే మహిళా శాస్త్రవేత్త కీలక భూమిక పోషించారు. ఇక చంద్రయాన్ మిషన్స్ విషయానికి వస్తే రీతు శ్రీవాస్తవ, ఎం. వనిత, కల్పన - ఇలా అనేక మంది మహిళా శాస్త్రవేత్తలు తమ సత్తా చూపించారు. అయితే వీరందరూ ప్రభుత్వ ఆధీనంలోని ఇస్రోలో పని చేసినవారు. అయితే తొలి సారి ప్రైవేట్ రంగానికి చెందిన అంతరిక్ష పరిశోధనలలో శరణ్య, ఉమామహేశ్వరిలు తమదైన ముద్ర వేయటం విశేషమనే చెప్పాలి.



శ్రమ ఎంతో..

చెన్నైకు చెందిన శరణ్య తన ఇంజినీరింగ్‌ను ఓషన్ టెక్నాలజీలో పూర్తి చేసింది. సముద్రగర్భంలోని అనేక రహస్యాలను వెలికితీయటానికి అవసరమైన టెక్నాలజీలను రూపొందించటం.. అవి సమర్థంగా పనిచేసేలా చూడటం ఆమె ప్రత్యేకత. అయితే ఆమెకు చదువు పూర్తికాగానే అంతరిక్ష రంగం ఆసక్తిగా అనిపించింది. దీనితో ఆమె అగ్నికుల్ కంపెనీలో సిస్టమ్స్ ఇంజినీర్‌గా చేరింది. " మాది ఒక స్టార్టప్. బడ్జెట్‌లు ఎక్కువ ఉండవు. మానవ వనరులు కూడా పరిమితంగానే ఉంటాయి. అందువల్ల అనుకున్న సమయంలోనే పని పూర్తి చేయాలి. ఒక్క మాటలో చెప్పాలంటే- గాలిలో ఒక తాడును కట్టి దానిపై నడుస్తున్నట్లు ఉండేది. ఒక చిన్న తేడా వచ్చినా- అది కంపెనీపై ప్రభావం చూపుతుందనే భయం ఉండేది" అంటారు శరణ్య. తన జీవితంలో ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్- రాకెట్‌ను చెన్నై నుంచి శ్రీహరికోటకు చేర్చటం.. దానిని ప్రయోగించటం అంటారామె! "శ్రీహరికోటలోని లాంచ్ పాడ్ దూరంగా ఉంటుంది. అక్కడ ఫోన్లు పనిచేయవు. కొన్ని లాప్‌టాప్‌లు మాత్రమే పనిచేసేవి. రాకెట్‌ను లాంచ్ చేయటానికి నాలుగు సార్లు ప్రయత్నాలు మొదలుపెట్టి.. సాంకేతిక పరమైన ఇబ్బందులు వచ్చి ఆపేశాం. దీని వల్ల విపరీతమైన ఒత్తిడి ఉండేది. చివరకు ఐదో సారి విజయవంతమయ్యాం" అని తన అనుభవాలను శరణ్య చెప్పారు. రాకెట్ లాంచ్ పూర్తి అయిన తర్వాత అది పైపైకి వెళ్తుంటే కలిగిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేమంటారు. "త్రీడీ మోడల్‌లో తయారు చేసిన ఇంజిన్ మాది. పైగా ఈ తరహ ఇంజిన్‌ను ప్రయోగించటం ఇదే తొలిసారి. దాంతో మాకు చాలా టెన్షన్‌గా ఉండేది. రాకెట్ పైకి వెళ్లిన తర్వాత కెమెరా ఫీడ్ కొద్దిగానే వస్తుంది. ఆ తర్వాత టెలిమెట్రీ ఫీడ్ మాత్రమే లభిస్తుంది. దాంట్లో చూస్తుంటే- రాకెట్ ఎంత పైకి వెళ్లిందనే విషయం అర్థమవుతుంది. రాకెట్ పైకి వెళ్తున్న కొలది మాలో ఆనందం పెరిగింది" అంటారు శరణ్య. రాకెట్ పైకి వెళ్తున్నప్పుడు చూడటం తన జీవితంలో మరపురాని ఘట్టం అంటారు ఈ ప్రయోగంలో కీలక పాత్ర పోషించిన మరో శాస్త్రవేత్త ఉమామహేశ్వరి. "రాకెట్‌కు అవసరమైన ఇంజిన్‌ను తయారుచేయటం ఒక ఎత్తు. దాని పని తీరు ఎలా ఉంటుందా అని చూడటం మరో ఎత్తు. ఆ ఇంజిన్ ఒక రాకెట్‌ను అంతరిక్షంలోకి తీసుకువెళ్తుంటే కలిగే సంతృప్తిని మాటల్లో వర్ణించలేను" అంటారామే! అంతరిక్ష రంగంలో పనిచేసే మహిళల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని.. భవిష్యత్తులో మరింత మంది మహిళలు ప్రవేశిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు ఉమా మహేశ్వరి. "ఒకప్పుడు మహిళలు కొన్ని రంగాలలోకి ప్రవేశించేవారు. కానీ పరిస్థితులు మారుతున్నాయి. కేవలం పురుషులకు మాత్రమే ప్రవేశం అనుకున్న రంగాల్లో కూడా మహిళలు ప్రవేశించటమే కాకుండా తమదైన ముద్ర వేస్తున్నారు. భవిష్యత్తులో ఈ అవకాశాలు మరింత పెరుగుతాయి" అంటారు.

అగ్నిబాణ్ అనే రాకెట్‌ను అగ్నికుల్ కాస్మోస్ అనే ప్రైవేట్ సంస్థ తయారుచేసింది. ఈ రాకెట్‌లో వాడిన ఇంజిన్‌ను త్రీడీ మోడల్‌లో తయారుచేసింది. ఈ రాకెట్‌ని భూమికి 700 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టగలిగారు.



వ్యాధి నిరోధక శక్తినిచ్చే...

- విటమిన్లు, మినరల్స్ సపోటాలో పుష్కలం. ఓ రెండు సపోటాలు తింటే జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. దీనివల్ల పొట్ట సమస్యలు దరిచేరవు.
- ఈ పండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు పొటాషియం ఉండటం వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. గుండె సంబంధిత ఇబ్బందులు రాకుండా కాపాడుతుంది.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎ- విటమిన్ వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయిన వెంటనే కొత్త కణాలు వస్తాయి.
- వంద గ్రాముల సపోటాలను తింటే అందులో 83 కేలరీలు అందుతాయి. ఇందువల్ల కడుపు నిండినట్లు ఉంటుంది. అనారోగ్యానికి గురిచేసే ఇతర ఆహారాన్ని తినాలనుకోరు. అందుకే బరువు తగ్గాలనుకునేవాళ్లకు సపోటా సపోర్టుగా పని చేస్తుంది. వారి మెనూలో సపోటాను చేర్చుకోవాల్సిందే.
- కాల్షియం, ఫాస్ఫరస్ వల్ల ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంతేనా జుట్టు ఆరోగ్యానికి మంచిది.
- ఇందులో చక్కెరశాతం ఉండటం వల్ల త్వరగా శక్తి వస్తుంది. ఈ చక్కెర శరీరానికి ఎలాంటి హాని చేయదు. ఇకపోతే ఎ, సి విటమిన్స్ వల్ల తెల్లరక్తకణాల వృద్ధికి దోహదపడతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- సపోటాలు తినటం వల్ల నిద్ర పడుతుంది. మెదడు మీద ప్రభావం చూపడటం వల్లనే నిద్రవస్తుంది. దీనివల్ల ఒత్తిడి తగ్గిపోతుంది.
- డయాబెటిక్ బారిన పడినవాళ్లు ఈ సపోటాను ఎంచక్కా తినొచ్చు.



తెలుగులో ఇలాంటి సినిమా రాలేదు



"నేను 'హరోం హర' లాంటి సినిమా చేయాలని సూపర్‌స్టార్ కృష్ణ గారు కోరుకున్నారు. ఆయన కోరుకున్న విధంగా ఈ సినిమాలో నా పాత్ర ఉంటుంది. ఇప్పటివరకూ ఇలాంటి నేపథ్యంలో తెలుగులో సినిమా రాలేదు. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఇదే ఫీలవుతారు" అని సుధీర్‌బాబు అన్నారు. ఆయన హీరోగా జ్ఞానసాగర్ ద్వారక తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 14న వి డుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ప్రతి సన్నివేశంపైనా ఎంతో వర్క్ చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి హిట్ కొట్టబోతున్నామనే నమ్మకం ఉంది' అన్నారు. జ్ఞానసాగర్ ద్వారక మాట్లాడుతూ 'ఈ సినిమాను మురుగన్ స్వామికి అంకితం ఇస్తున్నా. సింగిల్ సిట్టింగ్‌లో సుధీర్ కథ ఓకే చేశారు. ఆయన కష్టం వల్లే సినిమా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. "హరోం హర' ప్రేక్షకులకు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఇదొక కమర్షియల్ మూవీ.సాగర్ అద్భుతంగా తీశారు' అని నిర్మాతలు సుబ్రహ్మణ్యం, సుమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్వక్‌సేన్, అడివిశేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

హీరోగా తెలుగు సినిమా చేస్తా



తెలుగులోనూ మంచి అభిమానగణాన్ని సొంతం చేసుకున్న తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహరాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను హీరో విజయ్ సేతుపతి మీడియాతో పంచుకున్నారు.

"ఒక నటుడిగా 50 చిత్రాలు పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. 'మహరాజా' సినిమా కథనం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నా క్యారెక్టర్ సినిమాలో చాలా భాగం వరకూ అండర్ ప్లే చేసి.. కీలక సమయంలో ఒక్కసారి వయోలెంట్‌గా మారుతుంది. ఇందులో నాది కుటుంబం కోసం ఎంతకైనా తెగించే పాత్ర. ఇటువంటి బ్యాలెన్సింగ్ పాత్రలో ప్రేక్షకులు నన్ను ఇంతవరకూ చూడలేదు కాబట్టి తెరపై నా నటన.. పాత్ర తీరు కొత్తగా అనిపిస్తుంది. దర్శకుడు సినిమాను అనుకున్న దాని కంటే చాలా బాగా తీశారు. ఎంతో సహజత్వంతో తెరకెక్కిన ఈ సినిమా తెలుగువారికి తప్పకుండా చేరువవుతుంది. అన్నీ చక్కగా కుదిరితే త్వరలోనే స్ట్రయిట్ తెలుగు సినిమా చేస్తా" అని చెప్పారు.





బన్నీని అన్‌ఫాలో చేసిన సాయిదుర్గ తేజ్

మెగా, అల్లు ఫ్యామిలీల మధ్యన దూరం పెరుగుతోందన్న వార్తల నేపథ్యంలో చిరంజీవి మేనల్లుడు, హీరో సాయిదుర్గ తేజ్ సోషల్ మీడియాలో అల్లు అర్జున్‌ను, ఆయన భార్య స్నేహారెడ్డిని అన్‌ఫాలో చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్... రెండింటిలోనూ బన్నీని ఫాలో అవడం లేదు. అయితే బన్నీ సోదరుడు శిరీష్‌ను మాత్రం తేజ్ ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నారు.

సరికొత్తగా ఉంటుంది



'ఓం శాంతి' సినిమాతో దర్శకుడిగా మారి.. దాదాపు 14 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ ఇప్పుడు 'యేవమ్' చిత్రాన్ని తెరకెక్కించారు ప్రకాశ్ దంతులూరి. చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నవదీప్, గోపరాజు నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా వి డుదలవుతోన్న సందర్భంగాప్రకాశ్ దంతులూరి మీడియాతో ముచ్చటించారు. "యేవమ్' అనేది సంస్కృత పదం. ఇతిహాసాలు, పురాణాల్లో.. ఇది ఇలా జరిగింది అని చెప్పడానికి ఈ పదం వాడతారు. నలుగురు వ్యక్తుల మధ్య జరిగే కథ ఇది. ఇందులో చాందిని పాత్ర పేరు సౌమ్య. ఆ పాత్రలో ఆమె లీనమై నటించారు. ఇందులోని ప్రతీ పాత్ర తీరు సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులు ప్రతీ సన్నివేశాన్ని ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాకు నేపథ్య సంగీతం ప్రధానాకర్షణ. థియేటర్స్‌లో చూసే ప్రేక్షకులకు ఒక్క క్షణం కూడా బోర్ కొట్టని విధంగా సినిమా ఉంటుంది" అని చెప్పారు.

స్టైలిష్ లుక్‌తో



గోపీచంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వం'. టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. బుధవారం గోపీచంద్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'విశ్వం' చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. స్పోర్ట్స్ బైక్‌ను నడుపుతున్న గోపీచంద్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

ఆకట్టుకునే భావోద్వేగాలతో



నూతన దర్శకుడు శివ పాలడుగు దర్శకత్వం వహించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. అజయ్‌ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు శివ పాలడుగు మీడియాతో ముచ్చటించారు. "రంగస్థలం' సినిమాలో అజయ్‌ఘోష్ నటన చూసి ఈ సినిమా కథకు ఆయనే పర్ఫెక్ట్ అని అనుకున్నాను. కథ వినగానే ఆయనకూ నచ్చి నటించడానికి ఒప్పుకున్నారు. ఇరవయ్యేళ్ల వయసులో సంగీతంలో రాణించాలని అనుకుని కొన్ని కారణాలతో ఆగిపోయిన ఓ వ్యక్తి యాభై ఏళ్లు వచ్చాక తన కలను ఎలా సాధించాడు అనేదే చిత్ర కథ. ఈ సినిమా కథను మలుపు తిప్పే పాత్రలో చాందినీ చౌదరి నటించారు. సినిమాలోని భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది" అని చెప్పారు.

తెలుగులోనూ హిట్ కొడతాం



కన్నడ నటుడు, దర్శకుడు డార్లింగ్ కృష్ణ నటించిన 'లవ్ మాక్ టైల్ 2' ఈ శుక్రవారం విడుదల కానుంది. కన్నడంలో ఆయన నటించిన చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు ఎం.ఆర్.వి. కృష్ణ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కన్నడంలో ఈ చిత్రంలో డార్లింగ్ కృష్ణ నటించారు. ఆయనే దర్శకుడు కూడా. ఘన విజయం సాధించిన ఆ చిత్రాన్ని తెలుగులో అనువదించాం. ఇక్కడా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. మిలిన నాగరాజ్, అమృత అయ్యంగార్, రేచల్ డేవిడ్, నకుల్ అభయాస్కర్ తదితరులు ఇందులో నటించారు.

అందరినీ అలరించేలా...




షణ్ముఖ్ జస్వంత్, అనఘ అజిత్, ఆమని, ఆర్జే శరణ్ ముఖ్య తారాగణంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఓ ఒరిజినల్ చిత్రం నిర్మిస్తోంది. పవన్‌సుంకర దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని శ్రీధర్ మారిసా నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ స్క్రిప్ట్ అందించగా, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల క్లాప్ కొట్టారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్ షాట్‌కు సుబ్బుకె, అవినాశ్ వర్మ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ "ఈ చిత్రం అందరినీ అలరించేలా సూపర్బ్ ఎంటర్‌టైనర్ అవుతుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నరేశ్ ఆడుప, డీఓపీ: అనూశ్ కుమార్, సంగీతం: కృష్ణ చేతన్.

హీరోగా అలీ సోదరుడి కుమారుడు



ప్రముఖ హాస్యనటుడు అలీ సోదరుడి కుమారుడు సదన్ 'ప్రణయ గోదారి' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ ను అంబర్‌పేట్ శంకర్ ఆవిష్కరించారు. చిన్న సినిమాలకు పరిశ్రమలో అందరూ అండగా నిలవాలనీ, 'ప్రణయ గోదారి' మంచి విజయం సాధించాలనీ ఆయన కోరారు. 'నాకు ఎంతో ఇష్టమైన శంకరన్న ఈ పోస్టర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తాం' అని చెప్పారు నిర్మాత లింగయ్య. సాయికుమార్, పృథ్వీ, జబర్దస్త్ రాజమౌళి, సునీల్ రావినూతల తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మార్కండేయ, ఫొటోగ్రఫీ: ఈదర ప్రసాద్.

మోదీ నమాజు టోపీ ధరిస్తే చూడాలనుంది



"మోదీ వివిధ రకాల టోపీలు, తలపాగాలు ధరించడం చూశాం. ఆయన ముస్లింలు నమాజుకు వాడే టోపీని ధరిస్తే చూడాలని ఉంది. దానివల్ల మోదీకి ముస్లింల పట్ల ఎటువంటి వ్యతిరేకత లేదని తెలుస్తుంది" అని బాలీవుడ్ సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా అన్నారు. ఆయన బుధవారం ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దేశానికి మూడో సారి నరేంద్ర మోదీ ప్రధానిగా ఎంపికవ్వడంపై స్పందిస్తూ, ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మోదీ క్యాబినెట్‌లో ఒక్క ముస్లిం కూడా లేకపోవడం బాధాకరమే అయినా పెద్దగా ఆశ్చర్యపరిచే విషయం కాదు" అని మాజీ రాష్ట్రపతి హమీద్ అన్సారీ మాటలను గుర్తుచేసుకున్నారు.

విద్య, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

"ప్రధానిగా మోదీ పాలన రాక ముందు కూడా దేశంలోని సమస్యలూ అలానే ఉన్నాయి. దేశంలోని సమస్యలన్నింటికీ మోదీనే కారణమనే ధోరణి సరికాదు. హిజాబ్, సానియా కురచ దుస్తులు లాంటి అంశాల గురించి ఆందోళన చెందడం తగ్గించి.. ముస్లింలు తమ విద్య, అభివృద్ధి, సమకాలీన ఆలోచనలపై దృష్టి పెట్టాలి" అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
గురువారం 13 జూన్ 2024

మోగింది బడి గంట




హుషారుగా పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: సెలవులకు టాటా చెబుతూ విద్యార్థులు బడుల బాట పట్టారు నెల రోజుల పాటు ఇంటి పట్టునే ఉన్న చిన్నారులు.. హుషారుగా పాఠశాలలకు తరలివచ్చారు. రోడ్లన్నీ చిన్నారులను వారి బ్యాగులతో పాటు పాఠశాలలకు తీసుకువస్తున్న తల్లిదండ్రులతో నిండి ఉండటం కనిపించింది. ఉదయం పూట పాఠశాలల్లో విద్యార్థులు ప్రార్థన చేసిన అనంతరం తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించారు. హనుమకొండ మండలంలోని శాయంపేటలోని పోచంపల్లి ప్రైమరీ పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ ఎ.సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,


పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

యూనిఫామ్స్ పంపిణీ చేశారు. హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. పరకాల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై హనుమకొండలోని మర్కజీ పాఠశాలతో పాటు హసన్‌పర్తిలోని కేజీబీవీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం పాఠశాలలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని వారు తల్లిదం డ్రులను కోరారు. బుధవారం పాఠశాలలకు హాజరైన విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్ అందజేసినట్లు డీఈవో అబ్దుల్ హై తెలిపారు.


విద్యార్థులతో కలెక్టర్ సిక్తాపట్నాయక్, డీఈవో అబ్దుల్ హై తదితరులు


సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

- అహంకారం లేకుండా పని చేయాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మడికొండలో ఎంపీ కడియం కావ్యకు ఆత్మీయ సన్మాన సభ

9


కడియం శ్రీహరి, కావ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

- జూన్ 30 వరకు పారిశ్రామిక ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 12: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు 22 మందితో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసు యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. 14 యేళ్లలోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యాజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. 18 యేళ్లలోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యాజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యాచరణ ప్రకారం స్పెషల్ డ్రైవ్ బృందాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే వాహనాన్ని, పోలీసుశాఖ వారి వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.రమేష్‌బాబు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాంరెడ్డి, బాలల సంక్షేమ సమితి సభ్యులు దామోదర్, న్యాయమండలి సభ్యులు ఎం.సుభాష్, ఆల్ షాప్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు కె.శ్యాంసుందర్, జి.రమేష్, బాల పరిరక్షణ విభాగం నుంచి జి.సునిత, టి.విజయ్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎర్ర శ్రీకాంత్, బి.కరుణ, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిల్లల చదువును తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

- అదనపు కలెక్టర్ రాధికా గుప్తా


హనుమకొండ కలెక్టరేట్, జూన్12: తల్లిదండ్రులు పిల్లల చదువుల్లో ప్రోత్సహించాలని, సీటు వచ్చిన పిల్లలు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలోకి రావాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద విద్యార్థులను హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా మాట్లాడుతూ.. బెస్ట్ అవెలబుల్ స్కీమ్ కింద సీటు వచ్చిన పిల్లలు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో ఉండాలన్నారు. పిల్లల చదువును తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని స్కూల్స్‌లో 1వ తరగతికి 87సీట్లు, 5వ తరగతికి 88 సీట్లకు లాటరీ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. బాలికలకు 33శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన 1వ తరగతిలో 29 సీట్లు, 5వ తరగతిలో 29 సీట్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు నిర్మల, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, ప్రాంతీయ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థితో డ్రా తీయిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

జడ్పీ దివాలా

'బాబ్బాబు.. కొంచెం సమయమివ్వండి.. ఖజానా ఖాళీగా ఉంది.. నిధులు సర్దుబాటు కాగానే చెల్లిస్తాం.. అంత వరకు జర అర్థం చేసుకోండి..'

- ఇదీ ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిషత్ ఆర్థిక దుస్థితి



- కనీస అవసరాలకు డబ్బులు లేని వైనం
- పలు శాఖలకు పేరుకుపోయిన బకాయిలు
- విద్యుత్ శాఖకు రూ.4లక్షలు పెండింగ్
- సెంట్రల్ జైలు బంకుకు మరో రూ.4లక్షలు..
- వేతనాలు సైతం చెల్లించలేని దుస్థితి

హనుమకొండ సిటీ, జూన్ 12 : జడ్పీ ఆర్థిక స్థితి రోజు రోజుకూ దివాలా తీస్తోంది. ఒకనాడు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిపాలనలో వైభవాన్ని ప్రదర్శించిన జడ్పీ.. ప్రస్తుతం ఆర్థికంగా కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడం, పరిపాలనా వ్యయాలకు డబ్బులు లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోతోంది. జిల్లా పరిషత్ ఉద్యోగులు తమ జేబుల్లోంచి సాదాసీదా ఖర్చులు పెట్టుకునే దుస్థితి ఏర్పడింది. ఎన్నికలు అయ్యాక పరిస్థితులు కొంతైనా చక్కబడతాయని ఆశించినప్పటికీ ప్రభుత్వం నుంచి అలాంటి సంకేతాలు ఏమీ లేకపోవడంతో జడ్పీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరికొద్ది రోజుల్లో పాలకవర్గ సమయం ముగియనుండడంతో పాత అప్పులు తెరకుండానే జడ్పీ ఎన్నికలకు వెళ్లే పరిస్థితే ఎదురైతే పరిస్థితి మరింత దిగజారిపోతుందనే ఆందోళనలో అధికార, పాలకవర్గం ఉంది.

నాలుగున్నర లక్షల బకాయిలు

హనుమకొండ జిల్లా పరిషత్ విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేకపోతోంది. విద్యుత్ శాఖకు నాలుగున్నర లక్షల వరకు బిల్లుల బకాయి పడింది. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు చెల్లించాలని జడ్పీ అధికారులకు తాఖీదులు కూడా జారీ చేశారు. విద్యుత్ సరఫరా కూడా నిలిపి వేస్తామని అధికారులు సంకేతాలిస్తున్నారు. బకాయిల చెల్లింపునకు కొంత సమయం ఇవ్వాలని అధికారవర్గం విద్యుత్ శాఖను కోరుకుంటోంది. వేసవికాలంలో విద్యుత్ నిలిపివేస్తే ఎదురయ్యే ఇబ్బంది కంటే ప్రతిష్ఠ దెబ్బతింటుందనే ఆందోళనతో అధికార, పాలకవర్గం బిక్కు బిక్కుమంటూ రోజులు నెట్టుకొస్తోంది. మరోవైపు బిల్లులు చెల్లించలేకుంటే విద్యుత్ సరఫరా నిలిపి వేయడం ఖాయమని విద్యుత్ శాఖ ప్రత్యక్షంగా, పరోక్షంగా స్పష్టం చేస్తోంది. నాలుగున్నర లక్షల బిల్లులు సైతం చెల్లించలేని దుస్థితి నెలకొందని, ప్రజాప్రతినిధులకు చెప్పలేక, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించలేక అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతున్నామని అధికారులు ఆవేదనకు లోనవుతున్నారు.

సెంట్రల్ జైలు బంక్‌కు..

వాహనాల బిల్లులు కూడా లక్షల్లోనే పేరుకుపోతున్నాయి. జడ్పీ వాహనాల పెట్రోలు బిల్లులు నాలుగు లక్షలకు పైగానే పేరుకుపోయాయి. బిల్లులు చెల్లించాలంటూ పెట్రోల్‌బంకు నిర్వహిస్తున్న సెంట్రల్ జైలు అధికారులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. లేదంటే వాహనాలకు పెట్రోలు, డీజీల్ సరఫరా నిలిపివేస్తామని కరాఖండిగా చెబుతున్నారు. బంక్‌ల వద్దకు పెట్రోల్ కోసం వెళ్లడం.. అక్కడి నుంచి సిబ్బంది ఫోన్లు చేయడం.. బంక్ నిర్వాహకులను వేడుకోవడం.. ఇబ్బందిగా మారుతోంది.



బదిలీల కోసం..

జిల్లా పరిషత్ ఉద్యోగులు బదిలీలు కావాలని భగవంతుడిని కోరుకుంటున్నారు. నిధులు లేక, మరోవైపు పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ప్రశ్నించడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ సంక్లిష్టత నుంచి బయటపడాలంటే బదిలీ ఒక్కటే శరణ్యంగా భావిస్తున్నారు.

వేతనాల కోసం పడిగాపులు

ఒప్పంద కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు లేవు. వేతనాలు కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పుడు, అప్పుడు అంటూ అధికారులు ఉద్యోగులకు చెప్పలేక సతమతమవుతున్నారు. చిన్న వేతన జీవులమైన తమను ఇబ్బందులకు గురి చేయడం తగదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రస్తుత పాలకవర్గం ప్రభుత్వానికి విన్నవించి తగిన నిధులు తీసుకురావాల్సి ఉందనేది అధికారుల భావన. కానీ బాహాటంగా చెప్పలేక అధికారులు నలిగిపోతున్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కుడా కార్యాలయంలో మునిసిపల్ విభాగాల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12: రానున్నది వర్షాకాలం అని, గతంలో వరంగల్ నగర ప్రజలు వరదల ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. 'మాన్‌సూన్ ప్రిపేర్డ్‌నెస్ యాక్షన్ ప్లాన్ అండ్ డెవలప్‌మెంట్ వర్క్స్'పై బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో అన్ని బల్దియా అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, పరకాల ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య హాజరైన కార్యక్రమంలో వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గ్రేటర్ వరంగల్ పరిధిలో అమలవుతున్న పథకాలు, బడ్జెట్, ఇప్పటి వరకు పూర్తి చేయబడిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి, ఎమ్మెల్యేలకు విశ్లేషించారు. మధ్య మధ్యలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గత వర్షాకాలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. పాత సమస్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. ఇప్పటి వరకు అధికారులు చెప్పిన సలహాలు, సూచనలు పాటించి ముందు నుంచే సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించి అక్కడ తిరిగి సమస్య రాకుండా చూడాలన్నారు. ఇంకా మిలిగి ఉన్న పనులను వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలన్నారు. పనులు మిగిలి ఉంటే ప్రతిపాదనలు పెట్టి పనులు పూర్తి చేయాలన్నారు. బల్దియాకు ఇంకా నిధులు కావాలంటే హైదరాబాద్ స్థాయిలో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల కారణంగా రెండు నెలల అభివృద్ధి వెనక్కిపోయిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అధికారులు చూడాలన్నారు. అన్ని కాలనీలలో నీరు ఎక్కడ నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. ఎక్కడ నీరు నిలిచినా ఏదో ఒక మార్గం నుంచి బయటకు వెళ్లిపోయే విధంగా చూడాలన్నారు. ఇంకా కొన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలోకి నీరు ప్రవహిస్తుంటుందని, నాలాల్లో నిలవకుండా చూడాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు విషయాన్ని ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌లకు తెలియజేయాలన్నారు. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు. మంత్రిగా ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సిన ప్రతీ పైసా విడుదల చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక, సంధ్యారాణి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఇంజనీరింగ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, ఈఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఈ సంజయ్‌కుమార్, మెప్మా టీఎంసీ రమేష్, హార్టికల్చర్ అధికారి రమేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగంలతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ గొర్రెకుంట ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా సుమారు నాలుగు ఇండ్లు నిర్మించి ఉన్నాయని, ఇంటి యజమానులతో మాట్లాడి వారికి పునరావాసం కల్పించి ఆ ప్రాంతం గుండా బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని అధికారులకు సూచించారు. దీంతో తగిన పరిష్కార మార్గం చూపిస్తామని ఇంజనీరింగ్ విభాగం డీఈ సారంగం సమాధానమిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ.. బల్దియా పరిధిలో ఉన్న కొన్ని విలీన గ్రామాలలో చాలా చోట్ల వీధి లైట్లు వెలగడం లేదని, దీంతో ఆ ప్రాంతం అంధకారాన్ని తలపిస్తుందని చెప్పారు. ఇంకా కొన్ని చోట్ల ఇనుప స్తంభాలు ఉన్నాయని గుర్తు చేశారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు అన్ని చోట్ల స్తంభాలకు లైట్లు బిగించామని, వర్షాకాలం రాకముందే వెలగని లైట్లను మరమ్మతు చేస్తామని ఎలక్ట్రిసిటీ డీఈ సంజయ్‌కుమార్ చెప్పారు.

విత్తన వ్యాపారులపై నజర్

- ముమ్మరంగా అధికారుల తనిఖీలు
- నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కేసులు

బాలసముద్రం, జూన్ 12: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు నకిలీ వ్యాపారుల భరతం పడుతున్నారు. కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నవారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. నకిలీ విత్తనాలు, ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు అమ్ముతున్న వారితో పాటు విత్తనాల బ్రాండ్‌ల పేరుతో కొరత చూపించి రైతులను మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్న పలువురు వ్యాపారులపై ఇప్పటికే సంబంధిత అధికారులు కేసులు నమోదు చేశారు. హనుమకొండ జిల్లాలో పరకాలతో పాటు ఇతర మండలాల్లో మండల అధికారులు తనిఖీలు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో స్పెషల్ కమిటీలు ఏర్పాటు చేసి జిల్లాలో నకిలీ విత్తనాల షాపులను తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

కమిటీలు

హనుమకొండ జిల్లా పరిధిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పోలీసు, రెవెన్యూ అధికారులను కలిపి స్పెషల్ కమిటీలను మానిటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు ఎరువుల షాపులను తనిఖీలు చేస్తున్నారు. కలెక్టర్ ఖరీఫ్ సీజన్‌లో రైతులను అప్రమత్తం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఫర్టిలైజర్ డీలర్లను, షాపు యజమానులను హెచ్చరిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చెబుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, అలాగే విత్తనాల లాట్ నెంబర్ ఉండేలా చూసి అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయాలని అధికారులు రైతు వేదికలలో పలు సూచనలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నారు.

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు మా క్లయింట్ కోట సురేష్ వల్లు సారయ్య, నివాసము : కరీమాబాద్, వరంగల్ గారి ఆదేశానుసారము తెలియచేయునది ఏమనగా, కోరబోయిన రామలీల, భర్త : లేట్ చౌదరి, కరీమాబాద్, వరంగల్, మా క్లయింట్‌పై గౌరవ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో O.S.No. 163/2024 అను దావా, 9 గుంటల భూమి సర్వే నెంబర్ 372/A3/3 ఉర్సు గ్రామము, ఖిలా వరంగల్ మండలము మరియు వరంగల్ జిల్లా అని తెలుపుతూ పై కేసు వేసి యుండెను, మా క్లయింట్ జవాబు దాఖలు చేసి ఆమెకు ఏ విధమైన హక్కులు లేవనియు తెలియచేస్తూ కేసులో హక్కు పత్రములు దాఖలు చేయనైనది కాని ఈ మధ్యకాలములో సదరు రామలీల మధ్యంతర ఆర్డర్స్ తనకు అనుకూలముగా ఉన్నవని, కేసు పెండింగ్‌లో ఉండగా విషయములను మభ్యపెట్టి ఇతరులకు అమ్మ చూపుటకు ప్రయత్నించుచున్నారని రూఢీగా తెలియ వచ్చినది. కావున పై తెలిపిన భూమిపై ఏ విధమైన లావాదేవీలు జరుపకూడదనియు, ప్రకటనకు విరుద్ధముగా ఏమైన క్రయ విక్రయములు చేసినచో చట్ట బద్ధత యుండదనియు తదుపరి మా క్లయింట్ తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురనియు హెచ్చరించడమైనది.

Sd/- K.Narsimha Rao, B.A., L.L.M., I.R.P.M.
K. Indira.N.Rao, M.A., L.L.M.
Advocates
Hanamkonda. Cell : 9849138909


ప్రకటన

ఇందు మూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా ! నా క్లయింటు అగు శ్రీ చింతపట్ల ప్రవీణ్‌కుమార్, తండ్రి : సర్వోత్తం గార్లు లష్కర్ సింగారం గ్రామము, హన్మకొండ నందు గల ఇల్లు 2-4-1206/5/1, 210 చ॥గజ॥ల దానికి తన భార్య అయిన మాడిశెట్టి విజయలక్ష్మీ గారితో ఉమ్మడి యాజమాన్య, స్వాధీన హక్కు భుక్తములను కలిగి ఉన్నారు. నా క్లయింటు భార్య అగు విజయలక్ష్మి గారు నా క్లయింటు యొక్క హక్కులకు భంగము కలిగించుచు, ఇతరులకు అమ్మే ప్రయత్నము చేయుచున్నందున, నా క్లయింటు తన హక్కులను కాపాడుకునే ఉద్దేశ్యముతో ఆస్తి విభాగము కొరకు కేసు వేసినారు.

నా క్లయింటు వేసిన కేసు నంబరు అయినది. ఇట్టి కేసు నెంబరు 39/2024 హన్మకొండ మూడవ జూనియర్ సివిల్‌జడ్జి నందు విచారణలో ఉన్నది. ఇట్టి కేసు 03-07-2024 విచారణకు ఉన్నది. శ్రీమతి మాడిశెట్టి విజయలక్ష్మి గారు నా క్లయింటుకు తెలియకుండా పైన పేర్కొనబడిన ఇంటిని ఇతరులకు అమ్ముటకు ప్రయత్నించుచున్నట్లు తెలిసినది. కావున సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా ! ఓ.యస్.39/2024 మూడవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు విచారణలో ఉన్నందున ఎవరైనా సదరు ఇంటిని కొన్నచో అది చెల్లదు మరియు కోర్టు ఉత్తర్వులకు లోబడి ఉండును. అట్టి విక్రయము నా క్లయింటు యొక్క అనుమతి లేనందున అది చెల్లదు అని హెచ్చరించనైనది

సం/- పింగిలి నాగేశ్వర్‌రావు బి.కాం. ఎల్.ఎల్.బి., అడ్వకేట్
ఇ.నెం.6-4-157, నాగుల వీధి, హన్మకొండ.
సెల్ : 8008663187

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

సంధ్య 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00am
సుదర్శన్ 35 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00am
శాంతి 70 - నారాయణగూడ 9.00am
మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.30,2.30,6.30,9.30

మల్లిఖార్జున - కూకట్‌పల్లి 8.00am	భ్రమరాంబ - కూకట్‌పల్లి 8.00am
BR హైటెక్ - మాదాపూర్ 8.00am	లక్ష్మీ క.మం 70ఎంఎం ఎ/సి - అల్వాల్
సాయిరాం - మల్కాజ్‌గిరి 8.00am	భుజంగ 70 - జీడిమెట్ల 8.00am
శ్రీరాములు - మూసాపేట 8.00am	శ్రీప్రేమ 70 - తుక్కుగూడ 11.00,9.00

రేపే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00

మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.30,2.30,6.30,9.30

PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 10.40am	ఎంజేఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.50pm
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.40pm	INOX జీఎస్ఎమ్ - మదీనాగూడ 4.35pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 10.45am	INOX నెక్లెస్ సత్య - కావాడిగూడ 10.40pm
PVR ఎస్‌2నోవ - మల్లాపూర్ 4.20pm	మిరాజ్ సినిమాస్ - బాలానగర్ 4.30pm
లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 11.30am	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.00pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.45pm	

విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట

SHRAY MOTION PICTURES THRO PARAMJYOTHI FILMS

రేపే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

మహాలక్ష్మీ కాంప్లెక్స్ - కొత్తపేట 6.15,9.45

శ్రీలక్ష్మి కళామందిర్ 70 - అల్వాల్ 11.30,2.30,6.00,9.00	శ్రీప్రేమ 70ఎంఎం - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 ఎంఎం - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00	వెంకటేశ్వర 70ఎంఎం - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00

INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 1.45pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 5.30pm

లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ | ప్రసాడ్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్

ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్

SANTOSH ENTERTAINMENTS 9553374555 / 8121666662

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి, జూన్ 12: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. 'బ్లడ్ వేసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డికపోజిషన్ అండ్ మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అనే అంశంపై పరిశోధనలు సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ వచ్చినట్లు పేర్కొన్నారు. సంతోష్‌కుమార్‌కు పీహెచ్‌డీ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల

యూత్ జనరేషన్ కు సరికొత్త కంటెంట్
ఇది పక్కా మీ సినిమా



లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్

AAVISHKAR MOVIES CREATIONS 7330891221

SUPER HIT నేడే చూడండి




PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.50pm	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 2.35pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 4.25pm	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.55am
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 11.30am	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.35pm
PVR గలేరియా - పంజాగుట్ట 7.10pm	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.45am
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 11.10am	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.30pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.20am	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.45am
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 11.10am	సినిమాస్ - బాలానగర్ 11.00am
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 2.00pm	సినిమాస్ - చందానగర్ 11.00am
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 4.35pm	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 10.20am
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 2.20pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.35pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 1.35pm	

PVR ఎస్‌2 70 - వరంగల్	ప్రతిభా - కరీంనగర్	విష్ణురాం 70 - కోదాడ	తిరుమల - సూర్యాపేట
శ్రీదేవి - హన్మకొండ	గీతా - నిజామాబాద్	PVR జేఆర్‌మాల్ - ఆర్మూర్	మల్టీప్లెక్స్ 70 - గద్వాల్
శ్రీనివాస - కరీంనగర్	GHR కాంప్లెక్స్ - కోదాడ	బెలినిగోల్డ్ - మంచిర్యాల	మిరాజ్ సినిమాస్ - రాయచూర్

GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30	రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్ 11.00,2.00,6.00,9.00	శ్రీదేవి 70 - చిలకలగూడ 11.15,2.30,6.00,9.15	శ్రీరమణ 35 - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00	విజేత 70 - బోరబండ 11.00,2.00,6.00,9.00
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15	తాళ్ళూరి 70 - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00	సుష్మ 70ఎంఎం - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15	సాయిరంగ 70 - మియాపూర్ 2.00,9.00	స్వప్న 70ఎంఎం - కాటేదాన్ 11.15,6.00
జగదాంబ 70 - ఘట్‌కేసర్ 11.30,6.30	జ్యోతి 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00	రంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00	గోకుల్ 70ఎంఎం - ఎర్రగడ్డ 11.15,2.30,6.15,9.30	సూపర్ 70 - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.00,6.00,9.00	వైజయంతి 70ఎంఎం - నాచారం 11.00,6.00	సాయిరాం 70 - మల్కాజ్‌గిరి 2.30,9.45	అలంకార్ 70 - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00	సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 2.30,9.15
శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.30,6.30	రాజ్యలక్ష్మి 70 - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00	శ్రీసాయిపూజ 70 - సూరారం 11.00,2.00,6.00,9.00	BR హైటెక్ 70 - మాదాపూర్ 11.00,6.00	సంతోష్ 70 - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

ఎ.ఎం.బి.సినిమాస్ - గచ్చిబౌలి 10.30,1.20,7.15,10.20	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.35,7.30,10.30	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.50,7.40	టివోలి - సికింద్రాబాద్ 4.50,10.30
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.15,4.15,10.15	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.45,4.35,7.25,10.20	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.40,4.50,7.20	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 11.15,2.15,6.00,9.15
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.40,10.15	ఏషియన్ రాధిక - కాప్రా 1.40,7.30	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.00,9.15	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.35,4.30,7.45,10.45

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి	శ్రీరాములు 70 - మూసాపేట్	జగదాంబ 70 - ఘట్‌కేసర్	శ్రీరమణ 70 ఎ/సి - అంబర్‌పేట	తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్	సంగీత 70 - ఆర్.సి.పురం	శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి	సంతోష్ 70 - ఇబ్రహీంపట్నం	భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్	శివశక్తి 70ఎంఎం - కాప్రా	విజేత 70 ఎ/సి - బోరబండ	సంపూర్ణ 70ఎంఎం - వనస్థలిపురం	సాయిరంగ 70 ఎ/సి - మియాపూర్
రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్	ఈశ్వర్ 70 - అత్తాపూర్	సూపర్ 70 ఎ/సి - బాలాపూర్	శ్రీకృష్ణ 70ఎంఎం ఎ/సి - ఉప్పల్	BR హైటెక్ - మాదాపూర్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

కోణార్క్ 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్	ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్	మహాలక్ష్మి 70ఎంఎం - కొత్తపేట	శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్
వెంకటరమణపద్మావతి 70 - కాచిగూడ	తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్	రంగ 70ఎంఎం - జీడిమెట్ల	విజేత 70 ఎ/సి - బోరబండ
తారాకరామ 70ఎంఎం - కాచిగూడ	లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్	సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్	స్వప్న 35 ఎ/సి - కాటేదాన్
భ్రమరాంబ 70ఎంఎం - కూకట్‌పల్లి	శ్రీరాములు 70 - మూసాపేట	సంగీత 70 - ఆర్.సి.పురం	శ్రీ రమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

19న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 19న నిర్వహిస్తున్న జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో ఎ.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్ కోర్సుల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ జాబ్ మేళాలో డీవీవో రోల్ కోసం ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023, 2024 విద్యా సంవత్సరాల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరుకావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7569177071 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కేజీబీవీల్లో సరుకుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: జిల్లాలోని 9 కేజీబీవీలు, 3 మోడల్ స్కూళ్లు, ఒక్క అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ సరుకులు సరఫరా చేసేందుకు ఆసక్తిగల వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అబ్దుల్ హై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, మటన్ తదితర వస్తువులు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు దాఖల చేయాలని తెలిపారు. ఆసక్తి గల వారు కలెక్టర్ పేరున తీసిన రూ.500 డీడీ చెల్లించి టెండర్ ఫారాలు తీసుకొని ఈనెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు డీఈవో కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని కోరారు. వేర్వేరు వస్తువులకు వేర్వేరు టెండర్లు దఖాలు చేయాలని తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.

పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.

ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.

అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.

క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

» ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..

» మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

రెసిడెన్షియల్ కోసం అద్దె భవనం కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల కోసం ములుగు జిల్లా పరిధిలో అద్దె భవనం కావాలని ఆర్‌సీవో ఎస్.విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాలురు, బాలికల పాఠశాల/కళాశాల నిర్వహణ కోసం 16 తరగతి గదులు, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గదులు, అన్ని వసతులున్న భవనం కావాలని ఆమె కోరారు. ఆసక్తి ఉండి, భవనం ఉన్న వారు 7995010600/7995010599 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నిజామాబాద్‌కు 12 డీలక్స్ సర్వీసులు

బాలసముద్రం, జూన్ 12: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 12 డీలక్స్ బస్సు సర్వీస్‌లను గురువారం నుంచి నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజర్ శ్రీలత ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కోసం అదనంగా 12 డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ నుంచి ఉదయం 4.15 గంటలకు, రాత్రి 11 గంటల వరకు ప్రతీ అరగంటకు ఒక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఒకరికి రూ. 350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ. 230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ 120 టికెట్ ధర తీసుకోనున్నట్లు శ్రీలత తెలిపారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

● అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ● మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ



మడికొండలో జరిగిన అభినందన సభలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

మడికొండ, జూన్ 12: అధికారం అలంకారం మాత్రమేనని, అది శాశ్వతం కాదని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆత్మీయ పరిచయ, సన్మాన సభలో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.


గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన అవినీతి, అక్రమాలే వారి ఓటమికి కారణాలయ్యాయని, అలాంటి పరిస్థితి మనం తెచ్చుకోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా, అవినీతిరహితంగా ఒక్క రూపాయి ఆశించకుండా నిరుపేదల ఇంటికి చేరే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విధంగా పనిచేస్తేనే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్నారు. అధికారం ఉంది కదా అని అహంకారం చూపిస్తే బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టినట్టే మన ప్రభుత్వాన్ని సైతం ప్రజలు తిరస్కరిస్తారని హితవు పలికారు. తనకు కూతురులాంటి డాక్టర్ కడియం కావ్య.. తండ్రిని మించిన నాయకురాలిగా ఎదిగి మచ్చలేని తన తండ్రి పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే పార్లమెంట్‌లో సమస్యలపై ఎలా గళం ఎత్తాలన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళం ఎత్తుతానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉంటే రానున్న మరో పదిహేనేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చి నిధులు అందజేస్తానని తెలిపారు. అలాగే తనకు రాజకీయ జీవితం ఇచ్చిన తన తండ్రికి మచ్చరాకుండా మంచిపేరు తీసుకు వచ్చేలా పనిచేస్తానని తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పాత, కొత్త అనే తేడాలేకుండా పనితరును, అభిమానాన్ని బట్టి అందరికీ అవకాశాలు లభిస్తాయన్నారు. రాజకీయాల్లో మర్యాద, నిజాయితీలే కాపాడుతాయన్నారు. తన మాట తీరు చాలామందికి బాధ కలిగించిదని, అర్థం చేసుకున్న తర్వాత వారే స్వీకరిస్తున్నారన్నారు. నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కార్యకర్తలే గౌరవించరన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు పంచడం, పథకాలు అమ్ముకోవడం సర్వసాధారణమైందని, తాను మాత్రం ఏ పనిచేసినా ఎవరి వద్ద నుంచి కూడా ఒక్క పైసా అడగనన్నారు. ఎవరైనా తన పేరుతో డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కిందిస్థాయి నాయకులు సైతం భూ వివాదాలు, భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడే వారికి వంతపాడకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎవరైనా గ్రూపు రాజకీయాలకు పాల్పడితే తోకలు కత్తిరిస్తామని కడియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిర, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకుముందు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారి నుంచి కావ్యను, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వాహనంలో కన్వెన్షన్ హాల్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దారిపొడవునా పూల వర్షం కురిపించారు. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. బంజారా, లంబాడా మహిళలు తమ సంస్కృతీ సంప్రదాయ దుస్తులు ధరించి బంజారా నృత్యం చేస్తూ కావ్య, శ్రీహరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణుల గజమాలతో కావ్యను, శ్రీహరిని ఘనంగా సత్కరించారు.

తేనెటీగల దాడితో మృతదేహాన్ని వదిలి పరిగెత్తారు..

పలువురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

కొత్తగూడ మండలం ఎంచగూడెంలో వీరస్వామి మృతదేహాన్ని వదిలి వెళ్తున్న బంధువులు, గ్రామస్థులు, రోడ్డుపై వీరస్వామి మృతదేహం

కొత్తగూడ, జూన్ 12 : ఓ వ్యక్తి అంతిమయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేయగా.. వారంతా మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. ఎంచగూడెం గ్రామానికి చెందిన రుద్రారపు వీరాస్వామి (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం అతడి దహనసంస్కారాలు నిర్వహించేందుకు గాను కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అంతిమయాత్రగా శ్మశానవాటికకు బయల్దేరారు. వారు గ్రామశివారులో చేరుకున్న తర్వాత టపాసులు పేల్చగా వాటి పొగ, శబ్దానికి చెట్టుపై ఉన్న తేనేటీగలు ఒక్కసారిగి లేచి దాడి చేశాయి. దీంతో స్థానికులు, బంధువులు వీరస్వామి మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలి పరుగు తీశారు. ఆతర్వాత వారంతా సుమారు గంట తర్వాత అక్కడికి వచ్చి వీరాస్వామి మృతదేహాన్ని తీసుకెళ్లి దహనసంస్కారాలు పూర్తి చేశారు. నిర్వహించారు. కాగా, తేనేటీగల దాడిలో కందికొండ యాకయ్య, కందికొండ మల్లయ్య, జిట్టి కొమురయ్యతో పాటు పలువురికి తీవ్రగాయాలు కావడంతో 108లో వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయాలి



రాస్తారోకో చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

వడ్డెపల్లి, జూన్ 12: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈవో, డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వేల్పుల చరణ్, కుంటి పవన్, శ్రీపతి వినయ్, రిషిత, రేష్మా, దీప్తి, వైష్ణవి, ప్రియాంక, అనూష, ఐశ్వర్య, దేవరాజుల శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో మొట్టమొదటి సారిగా పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేశాడన్నారు. ఇందుకోసం త్వరలోనే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా తల్లిదండ్రులకు పాఠశాల మీద భరోసా కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. లక్ష్యాలను సాధించే విధంగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యాలత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఎల్‌వో సుధా, ఎంఈవో రామకిషన్‌రాజు, ఏఎంవో శ్రీనివాసరెడ్డి, ఎంఎస్‌వో రాజిరెడ్డి, డీఈఈ రవిందర్, ఆదర్శ పాఠశాల వీవోలు మాధవి, అనసూయ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





సిద్ధాపూర్ స్కూల్‌లో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, హనుమకొండ ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో యూనిఫారమ్స్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యార్థులు శ్రద్ధ పెట్టి చదవాలి

హనుమకొండ టౌన్: విద్యార్థులు శ్రద్ధతో చదవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నూతన విద్యా సంవత్సరం సందర్భంగా బుధవారం హనుమకొండ ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వేసవి సెలవుల్లో పాఠశాలల్లో మరమ్మతులు చేయించి విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎస్‌హెచ్‌జీలు, మెప్మా, డీఆర్‌డీవో గ్రూప్‌ల ద్వారా విద్యార్థులకు యూనిఫామ్స్‌ను కుట్టించామని, పాఠశాలల ప్రారంభానికి ముందే టెక్స్‌బుక్స్, నోట్ బుక్స్‌ను పాఠాశాలలకు చేర్చామన్నారు. మర్కజీలో ప్రైమరీతో పాటు ఉన్నత పాఠశాల కలిపి 1000పైగా విద్యార్థులు ఉండటం, అందుకు తగ్గట్టు మంచి ఉపాధ్యాయులు ఉండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జిల్లాలో మొత్తం 37 వేల యూనిఫామ్స్ కుట్టించి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జిల్లాలో 310 పాఠశాలల్లో టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్‌హై, డిప్యూటీ డీఈవో రాధ, స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలి

కాజీపేట టౌన్: ప్రభుత్వ బడులను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ విద్య ఉపసంచాలకులు (ఆర్జేడీ) సత్యనారాయణరెడ్డి కోరారు. కాజీపేట దర్గాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఎస్ఎంఎం



కాజీపేట దర్గాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

స్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడుల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబకర్, కవి, రచయిత రాజ్‌మోహన్, స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సతీష్‌పాల్, సుమలత, బి.సునీత పాల్గొన్నారు.

• న్యూశాయంపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదవాలని పాఠశాల విద్య ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి సూచించారు. న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆర్జేడీ స్కూల్ యూనిఫామ్‌లు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ జె.సరోజ, ఉపాధ్యాయులు కె.సరళ, మహానందరెడ్డి, సీహెచ్ రవిందర్‌రాజు, పి.చంద్రమోహన్, హెచ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జనసభలను విజయవంతం చేయాలి

▸▸ ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ



మీడియాతో మాట్లాడుతున్న మైస ఉపేందర్

కాజీపేట, జూన్ 12: వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి 25 వరకు నిర్వహించే మాదిగ జనసభలను విజయవంతం చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణకోసం చేపడుతున్న ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు పలికి వర్గీకరణకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు కార్యరూపం దాల్చేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్‌ల సాధనే ధ్యేయంగా ప్రతి మాదిగ పని చేయాలని పిలుపునిచ్చారు. మాదిగలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. అనంతరం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన ఇసురం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మీడియా సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎడ్ల మహిపాల్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఎడ్ల అనిల్ కుమార్, నాయకులు శిఖం రవి, బర్ల శదంకర్, ఎడ్ల అశోక్, ఎడ్ల రాజు, ఎడ్ల కుమార్, ఐలపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

ఐనవోలు, జూన్ 12: మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారుల ప్రత్యేక బృందం ఇంటింటి సర్వే చేపట్టారు. ఐనవోలు, వెంకటాపురం, నందనం, కక్కిరాలపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లేశం, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవికుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డిలతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక యాప్ ద్వారా ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా వస్తుందా, వస్తే ఎన్ని రోజులకు ఒక సారి వస్తుంది, నీటి సరఫరాలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అంటూ వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. నీటి సరఫరా లేని వారి పేర్లను సైతం ఆధార్ ఆధారంగా నమోదు చేసుకున్నారు. వారంలో అన్నిగ్రామాల్లో ప్రతీ ఇంటిని సర్వేచేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నారు.



నందనంలో మిషన్ భగీరథ నీటీ సరఫరాపై వివరాలు సేకరిస్తున్న అధికారులు

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: కాకతీయ విశ్వవిద్యా లయం హాస్టల్స్ డైరెక్టర్‌గా గణిత శాస్త్ర విభాగ సహాయ అధ్యాపకుడు డాక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్‌ను నియమించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆ యనకు బుధవారం నియామ క పత్రం అందజేసినట్లు తెలిపారు. బాధ్యతలను స్వీకరించిన రాజ్‌కుమార్‌కు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యమకారులకు పెన్షన్లు మంజూరు చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ననుమాస స్వామి

వడ్డెపల్లి, జూన్ 12: తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లిన ఉద్యకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ మూవ్‌మెంట్ డిటెన్యూస్ ఫోరం వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ననుమాస స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులు పెన్షన్లు పొందేందుకు జైలు సర్టిఫికెట్ల కోసం కొందరు 11 ఏళ్లుగా కోర్టు చుట్టూ, సెంట్రల్ జైలు చుట్టూ తిరిగారన్నారు. వరంగల్ జిల్లా సెషన్ కోర్టులో ఉద్యమకారులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ పత్రాలు దొరికాయని, మరికొందరికి రావాల్సి ఉందని అన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఉద్యమకారులకు పెన్షన్లు మంజూరు చేయకపోతే 2018లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. 2023 ఫిబ్రవరిలో తొలి దశ ఉద్యమకారులు 82మంది పెన్షన్లు పొందేందుకు ఆర్డర్ పొందారని పేర్కొన్నారు. ఆర్డర్ పొందిన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మాడుగుల అమృతరెడ్డి, తిప్ప సారయ్య, కె.కొండయ్య, తిరుపతి రెడ్డి, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, జూన్12: నిబంధనలు ఉల్లఘించిన పలువురు వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడ్డ ముగ్గురిని బుధవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి రూ.1,700, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఒక వ్యక్తికి రూ..1,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సుకు కేయూ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి వైద్య వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో కేయూ విద్యార్థులు పాల్గొంటున్నారు. బుధవారం నుంచి ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్, కేయూ అధ్యక్షుడు జశ్వంత్, పరిమళ, సందీప్, రాకేష్, కళ్యాణ్, ఈశ్వర్, సిద్ధార్థ్, ఇస్మాయిల్, హరి తదితరుల పాల్గొంటున్నారు.



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సులో పాల్గొంటున్న కేయూ విద్యార్థులు

టీడీపీ శ్రేణుల సంబరాలు

ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో స్వీట్ల పంపిణీ

వడ్డెపల్లి, జూన్12: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడాన్ని పురస్కరించుకొని హనుమకొండ పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి ఎం.డి. రహీమ్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు జరుపుకొన్నారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టపాసులను పేల్చి స్వీ ట్లను పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణలో సైతం టీడీపీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆల్ ఇండియా బాలకృష్ణ అభిమాన సంఘం జాతీయ కన్వీనర్ జీఎల్ శ్రీధ ర్, టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు హన్మకొండ సాంబయ్య, మాడగాని మనోహర్, హరిదాస్యం సురేష్, కుసుమ శ్యాంసుందర్, కటకం కుమారస్వా మి, ఎన్టీఆర్ మొగిలి, దుబ్యాల కృష్ణ, మామిండ్ల రాములు పాల్గొన్నారు.



హనుమకొండలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

గోపాల్‌పూర్‌లో..

చంద్రబాబు నాయుడు నాలుగోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని పురస్కరించుకొని టీడీపీ వాణిజ్య సెల్ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కటకం కుమారస్వామి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు ఆంజనేయులు, కటకం సంధ్యారాణి, సాంబయ్య, కటకం వరుణ్‌సాయి, కృష్ణ, శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడి ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా బుధవారం హసన్‌పర్తిలో టీడీపీ సీనియర్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చారు. రాబోయే రోజుల్లో టీడీపీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిలగాని మోహన్, బొనగాని రమేశ్‌గౌడ్, మాటం తిరుపతి, మాజీ ఎంపీటీసీ సత్యప్రకాశ్, కామారపు బాలకిషన్, ఎన్టీఆర్ మొగిళి, నేదునూరి కోటేశ్వర్, శీలం బాలకిషన్, తోట రమేశ్, శ్రీపతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

• కాజీపేట: ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కాజీపేటకు చెందిన టీడీపీ నేతలు బుధవారం విజయవాడకు తరలివెళ్లారు. విజయవాడలో చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు కాజీపేటలో బాణా సంచా కాల్చి సంబరాలు చేశారు. ప్రమాణస్వీకారానికి తరలి వెళ్లిన వారిలో వరంగల్ పార్లమెంట్ నాయకులు భైరపాక ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సతీష్, వాణిజ్య సెల్ కార్యదర్శి ఎలగందుల రవీందర్ గుప్త తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఐనవోలు, జూన్ 12: కల్లు గీత కార్మికుడికి గాయాలైన ఘటన నందనం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు గడ్డం అశోక్‌గౌడ్ వృత్తిలో భాగంగా బుధవారం తాడిచెట్టు ఎక్కుతుండగా చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన పక్కటెముకలు విరుగడం తోపాటు తల, కాళ్లకు గాయాలయ్యాయి. గాయపడిన అశోక్‌గౌడ్‌ను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆయనను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని గౌడ కులస్థులు కోరారు.

నేడు 3కే రన్

వడ్డెపల్లి, జూన్ 12: హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు గురువారం ఉదయం 6 గంటలకు 3కే రన్ నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. 3కే రన్ అనంతరం క్రికెట్ మ్యాచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు 3కే రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుకు ఘనస్వాగతం

మల్లన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

ఐనవోలు, జూన్ 12: టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికై బుధవారం స్వగ్రామం ఐనవోలుకు వచ్చిన మార్నేని రవీందర్‌రావుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ సెంటర్ నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీగా వెళ్లగా ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న ఆయనకు అర్చలకు వేదా ఆశీర్వచనాలు అందజేసి పట్టువస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదం అందించారు. అనంతరం ఆలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. డీసీసీ మార్ట్ వద్ద నందనం సొసైటీ పాలకవర్గంతో కలిసి కేక్‌కట్ చేశారు. గ్రామానికి చెందిన రవీందర్‌రావుకు రాష్ట్రస్థాయిలో పదవి లభించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీలకు అతీతంగా నాయకులతోపాటు అభిమానులు టెస్కాబ్ చైర్మన్ దంపతులు మధుమతిరవీందర్‌రావులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షాలు తెలిపారు. ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు, ఎంపీటీసీలు శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

రవీందర్‌రావును కలిసిన సీపీఎం బృందం

సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, మండల కమిటీ సభ్యులు బండి పర్వతాలు, కె. నారాయణరెడ్డి, దర్శనాలు సంపత్, దీకొండ ఉప్పలయ్య, ఎం. నాగరాజు, యాకయ్య, రాజ్‌కుమార్, నర్సయ్య, ఎఎస్ రెడ్డి, రాజిరెడ్డి తదతరులు టెస్కాబ్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'సఖీ' సేవలను మహిళలు వినియోగించుకోవాలి



చట్టాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సఖీ వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ వినీల

మడికొండ, జూన్ 12: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో సఖీ వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా 'సఖీ' వన్‌సాప్ కేంద్రం కేస్ వర్కర్ వినీల మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో విడిపోయే భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఒకటిగా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపుల వల్ల మానసికంగా కృంగిపోయే మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖీ వన్‌స్టాప్ కేంద్రం కృషి చేస్తోందన్నారు. సమస్యలపై సహాయం కోసం ఈ కేంద్రానికి వచ్చే మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్, సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటివి అందజేయబడుతుందని తెలిపారు. ఇందుకోసం 0870-2452112 లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 181 కు ఫోన్ చేయాలన్నారు. సదస్సులో మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



హనుమకొండ టౌన్, జూన్12: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం హనుమకొండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్, రాంనగర్, అశోకకాలనీ, పోచమ్మగుడి ఏరియా, విద్యానగర్, గాంధీనగర్, అంబేద్కర్‌భవన్ ఏరియా, వాజ్‌పేయి కాలనీ ఏరియా, బీరకుంట ఏరియా, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేయి స్తంభాల దేవాలయం, ఆలయం ఏరియా, యునాని ఆస్పత్రి, శ్రీనివాస కిడ్నీ ఆస్పత్రి, న్యూరాయపుర, రాయపురవాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

వరంగల్‌లో..

శంభునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని రంగశాయిపేట, తెలంగాణ కాలనీ, సాయినగర్, రామాలయం ఏరియా, నాగమయ్య టెంపుల్, ఫోర్ట్ రోడ్డు పెట్రోల్‌పంపు ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్ సాయిబాబా టెంపుల్, పద్మశాలీ స్ట్రీట్, విశ్వనాథ కాలనీ, షై మాస్టర్ స్కూల్, గిరిప్రసాద్ కాలనీ, టీచర్స్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ శంకేసి మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎంత ఖర్చయినా ఓకే.. ప్రాణ నష్టం జరగొద్దు!

- వరదల వల్ల ఇబ్బందులు పడకుండా చూడండి
- సీజనల్ వ్యాధుల నిరోధానికి ముందస్తు చర్యలు
- నాలాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి
- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'వరదలు, వర్షాల వల్ల ప్రాణ నష్టం జరగొద్దు. ఎంత ఖర్చయినా తక్షణ చర్యలు చేపట్టండి. అవసరమైతే అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి' అని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు, రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, ఆహార కల్తీ, బక్రీద్ ఏర్పాట్లపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి సమీక్షించారు. అనంతరం పొన్నం విలేకరులతో మాట్లాడుతూ.. వరద నీటి నిర్వహణతోపాటు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీగా వర్షపు నీరు నిలుస్తున్న 12 ప్రాంతాల్లో భూగర్భ సంపులు నిర్మిస్తున్నామని, వాన పడినప్పుడు వాటిలో నిలిచే నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతామని చెప్పారు. విపత్తు నిర్వహణకు సంబంధించి 5 వేల మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చామన్నారు. వరద నీటి నిర్వహణకు మూడు షిఫ్టుల్లో 24 గంటలు ప్రత్యేక బృందాలు పని చేస్తాయని, ప్రాంతాల వారీగా 203 మంది నోడల్ అధికారులను వరద నీటి నిర్వహణ కోసం నియమించినట్టు చెప్పారు. నాలాల్లో వ్యర్థాల పూడికతీతపై ప్రస్తుతం సాంకేతిక పర్యవేక్షణ కొనసాగుతోందని, అక్రమాలు జరిగినట్టు సర్కారు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంస వ్యర్థాల నిర్వహణతో ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి, ఇంజనీర్ ఇన్ చీఫ్ జియావుద్దీన్, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర ప్రసాద్ నాయక్, అదనపు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అదనపు కమిషనర్ తీరుపై మంత్రి అసంతృప్తి

నగరంలో పారిశుధ్య నిర్వహణ విషయంలో ఆ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్‌రెడ్డిపై మంత్రి పొన్నం అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రోడ్లపై చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి.. చెత్త సేకరణపైనా ఫిర్యాదులు వస్తున్నాయి.. పారిశుధ్య నిర్వహణ ఎందుకింత అధ్వానంగా ఉంది? ఎవరినీ ఖాతరు చేయవంట.. ఎవరికి చెబితే నాకేంటి అంటావట కదా? ఎందుకలా? ఎవ్వరన్నా లెక్కలేదా..? మంచిగా పని చేసుకోండి' అని సూచించారని తెలిసింది. వర్షాకాలం నేపథ్యంలో రోడ్ల తవ్వకాలపై నిషేధం ఉందని ఇంజనీరింగ్ విభాగం అధికారులు వివరించగా.. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తోపాటు పలు ప్రాంతాల్లో కూడా తవ్విన రోడ్లు కనిపిస్తున్నాయి..? నిషేధం ఎక్కడ అమలవుతుంది..? అని ప్రశ్నించినట్టు తెలిసింది. వీధి కుక్కల స్టెరిలైజేషన్ లెక్కలపైనా ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం.

కొత్త క్రిమినల్ చట్టాలు.. అమలుపై మాజీ ఎంపీ వినోద్ అభ్యంతరాలు

- కేంద్ర హోం, న్యాయశాఖ మంత్రులకు లేఖ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) చట్టాల్లో పలు అభ్యంతరాలు ఉన్నట్లు బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ మంత్రులకు లేఖలు రాశారు. నూతన క్రిమినల్ చట్టాలను తేవాలనే ఉద్దేశం మంచిదే అయినా.. వాటిల్లో పలు లోపాలున్నాయని పేర్కొన్నారు. చట్టాలకు పెట్టిన టైటిళ్లను ఇంగ్లిష్‌లో కాకుండా హిందీలో పెట్టడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348కి వ్యతిరేకమని.. వాటిని అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లంలో తర్జుమా చేయాలని సూచించారు. దీంతోపాటు సమగ్ర సంప్రదింపులు జరగలేదని.. సమాజం కోరుకుంటున్న నిజమైన సంస్కరణలకు స్థానం లభించలేదని.. గోప్యత, డిజిటల్ ఎవిడెన్స్, సమ్మరీ ట్రయల్, జీరో ఎఫ్ఐఆర్, న్యాయ పర్యవేక్షణ వంటి అంశాల్లో లోపాలున్నట్లు పేర్కొన్నారు.

'ప్రాణహిత' నిర్మిస్తే ఉత్తర తెలంగాణకు మేలు

- హైదరాబాద్ విశ్రాంత ఇంజనీర్ల సంఘం
- అసెంబ్లీలో ప్రస్తావిస్తా: హరీశ్‌బాబు


కౌటాల, జూన్ 12: ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తే ఉత్తర తెలంగాణకు మేలు జరుగుతుందని హైదరాబాద్ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అభిప్రాయపడింది. బుధవారం తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని ఆ సంఘం ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాణహిత ప్రాజెక్టు పనులు చేపడితే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారానే నీటిని తరలించే అవకాశముందని తెలిపారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డిని కలసి త్వరలోనే వివరిస్తామని చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో బృహత్తర తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు మూలనపడి లక్ష కోట్ల మేడిగడ్డ ప్రాజెక్టు అఘమేఘాల నిర్మాణం జరిగిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేసేందుకు గతంలోనే మహారాష్ట్రతో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. కేంద్రం కూడా 60 శాతం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. సమావేశంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు భీమయ్య, పుల్లారెడ్డి, శ్రీరాం రెడ్డి, రఘుమారెడి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల

పంపిణీలో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ చేశారు. వనపర్తి జిల్లా అమరచింత జెడ్పీహెచ్ఎస్‌లో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా తరగతుల తెలుగు పుస్తకాలను పరిశీలించగా.. ముందుమాటలో 'పాఠ్య పుస్తకాల రూపకల్పన కోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలిచ్చి ప్రోత్సహించిన తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, పూర్వపు విద్యాశాఖ మంత్రులు కడియం శ్రీహరి, జగదీశ్ రెడ్డి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొని ఉండటం గమనించిన ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఈవో భాస్కర్ సింగ్, ప్రధానోపాధ్యాయుడిని పిలిచి ఈ అంశంపై నిలదీశారు. ప్రభుత్వం మారినా పాత వారి పేర్లను ఎలా ముద్రిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించారు. పలుచోట్ల ఇదే విషయాన్ని చివరి నిమిషంలో గుర్తించిన కొందరు అధికారులు ఆ పేజీని తొలగించిన అనంతరం పుస్తకాలు అందజేశారు. 2022లో ఆ పుస్తకాలు ముద్రించినవని వివరణ ఇచ్చారు. సంగారెడ్డి, జనగామ జిల్లాల విద్యా శాఖాధికారులు కూడా ఇదే విషయమై ఆ పేజీ తొలగించి పుస్తకాలు పంపిణీ చేయాలంటూ ఆదేశించారు.



(శ్రీకె బిస్కెస్) కోసంలో చేర్చి బలోపేతం చేయడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి, విద్యాశాఖ పూర్వపు మంత్రులు శ్రీ జి. జగదీశ్ రెడ్డి గారికి, శ్రీ కడియం శ్రీహరి గారికి, ప్రస్తుత విద్యాశాఖా మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు శ్రీ ఎమ్. జగదీశ్వర్ గారికి, ప్రస్తుత సంచాలకులు శ్రీ టి.చిరంజీవులు గారికి, ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. [illegible]

తేది : 05-12-2022
స్థలం : హైదరాబాద్.

సంచాలకులు
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

విద్యార్థులకు పంపిణీ చేసిన తెలుగు పాఠ్యపుస్తకంలో మాజీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారుల పేర్లు

పలు జిల్లాల్లో పాల్గొన్న మంత్రులు

పలు జిల్లాల్లో మంత్రులు బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఖమ్మంలోని ఎన్ఎస్పీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో పెను మార్పు తెచ్చేందుకే తెలంగాణ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్స్ పేరుతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా భట్టి తెలిపారు. ఇటు సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు.

21 లక్షల మంది విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ పంపిణీ

- ఈ నెలాఖరులోగా రెండవ జత పంపిణీ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 21 లక్షల మంది విద్యార్థులకు ఒక జత యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. ఈ నెలాఖరులోగా రెండవ జత యూనిఫామ్‌ను అందించనున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈసారి ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రైవేటు పాఠశాలల మోజు నుంచి బయటపడేలా పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజునే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 21,19,439 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అలాగే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం 1,11,97,976 నోట్‌బుక్‌లకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి రోజున 11.65 లక్షల మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. యూనిఫాంలను కుట్టే బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. దీంతో దాదాపు 30 వేల మహిళా సంఘాలకు ఉపాధి లభించింది. కాగా, ప్రైవేట్ స్కూళ్లల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఆమోదించిన పుస్తకాలనే కొనుగోలు చేసే విధంగా చర్యల్ని తీసుకోవాలని వివిధ ప్రింటర్స్ ప్రతినిధులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనకు వినతి పత్రాన్ని అందించారు. కోట్ల రూపాయలను తాము ప్రభుత్వానికి రాయల్టీగా చెల్లించి, పుస్తకాలను ముద్రిస్తే.. ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, ఈ విషయంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ కేసు.. ముందస్తు బెయిల్‌కు రాహిల్ పిటిషన్

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో 2022లో కారు ప్రమాదంతో ఓ చిన్నారి మరణం, ఇద్దరు తీవ్ర గాయాలపాలవ్వడానికి కారకుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ అలియాస్ సాహిల్ బెయిల్ కోసం బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. రాహిల్ గత ఏడాది ప్రజాభవన్ వద్ద జరిగిన ప్రమాదం కేసులోనూ నిందితుడే. పంజాగుట్ట కేసులో తన స్థానంలో మరో వ్యక్తిని అరెస్టు చేయించే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే..! ఆ కేసులో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతోపాటు.. 15 మంది జైలుపాలవ్వగా, రాహిల్ దుబాయ్ పారిపోయాడు. పోలీసులు అతణ్ని వెనక్కి రప్పించి, అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే 2022 నాటి జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసులోనూ రాహిల్ నిందితుడని తేల్చారు. జూబ్లీహిల్స్ కేసులో పోలీసులు తనను ఏ క్షణమైనా అరెస్టు చేసే ప్రమాదం ఉందని గుర్తించిన రాహిల్.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. తన తండ్రి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అని, రాజకీయ కక్షతోనే పోలీసులు తనను టార్గెట్‌గా చేసుకున్నారని రాహిల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. పాత కేసును చూపుతూ తన వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించాడు. ఇటీవల ఇదే హైకోర్టు తనను అరెస్టు చేయొద్దని మధ్యంతర ఆదేశాలిచ్చిందని, ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించిందని గుర్తుచేశాడు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

86 స్కూల్ బస్సులు సీజ్

- రవాణా శాఖ తనిఖీల్లో ఫిట్‌నెస్, పర్మిట్లు లేని వాహనాల గుర్తింపు
- తనిఖీలకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- డ్రైవర్ల అనుభవం, అర్హత పరిశీలన

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్, అనుమతి పత్రాలు లేని స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో బుధవారం విద్యార్థులను స్కూళ్లకు చేరవేస్తున్న బస్సులను ఆపి విస్తృత స్థాయిలో తనిఖీ చేశారు. పదుల సంఖ్యలో బస్సులు ఫిట్‌గా లేవని, ఇంకొన్నింటికి అనుమతి లేదని, మరికొన్నింటిని పన్ను చెల్లించకుండా తిప్పుతున్నారని గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 25, రంగారెడ్డిలో 46, మేడ్చల్‌లో 15 మొత్తం 86 బస్సులు సీజ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేలకు పైగా ఉన్న స్కూల్ బస్సుల్లో ఇప్పటి వరకు సగం బస్సులకు కూడా యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదని తెలిసింది. ఫిట్‌నెస్, పర్మిట్లపై ఆయా జిల్లాల్లో రవాణా శాఖ అధికారులు లేఖలు రాసినా యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో రవాణా శాఖ ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసింది. హైదరాబాద్ జిల్లాలో జాయింట్ కమిషనర్ సీ రమేష్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో డిప్యూటీ కమిషనర్ మామిడ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. హైదరాబాద్ జిల్లాలో 19 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని, మరో ఆరు బస్సులకు పన్ను చెల్లించలేదని, అనుమతి లేదని రమేష్ తెలిపారు. ఇక ముందు కూడా తనిఖీలు కొనసాగుతాయని చంద్రశేఖర్‌గౌడ్ చెప్పారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు రోడ్లపైకి రావొద్దని, 60 యేళ్లలోపు వయస్సు ఉండి, అర్హత ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించాలని సూచించారు. పన్ను చెల్లించని బస్సులకు త్రైమాసికం ముగింపు నెల కావడంతో పెనాల్టీగా రెట్టింపు పన్ను విధించామని ఉప్పల్ ఆర్టీవో వాణి తెలిపారు.



రంగారెడ్డి జిల్లాలో బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

కాలంచెల్లిన వాహనాలూ..!

గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం 12,631 విద్యా సంస్థల బస్సులున్నాయి. ఇప్పటివరకు 9,578 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోగా మరో 2,873 వాహనాలు ఇప్పటి వరకు దరఖాస్తు చేయలేదు. 8 వాహనాల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు.

టెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు హాజరుకాగా.. 57,725 (67.13%) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అలాగే పేపర్-2 పరీక్షకు 1,50,491 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 51,443 (34.18%) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అయితే 2023లో నిర్వహించిన టెట్‌తో పోలిస్తే.. ప్రస్తుతం పేపర్-1లో 30.2%, పేపర్-2లో 18.8 అర్హత శాతం పెరిగింది. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా టెట్-2024 దరఖాస్తు ఫీజు తగ్గింపునకు ఎన్నికల కమిషన్ అంగీకరించలేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెట్-2024లో అర్హత సాధించని అభ్యర్థులకు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.



సీఎం రేవంత్‌కు రాసిన లేఖను ప్రదర్శిస్తున్న ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, వి.వి రావు, బండారు రామ్మోహన్ రావు

నేడు బాధ్యతలు స్వీకరించనున్న బండి సంజయ్



హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ గురువారం ఉదయం 10.35 నిమిషాలకు బాధ్యతలు చేపట్టనున్నారు. నార్త్ బ్లాక్‌లోని హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. భద్రతా కారణాల వల్ల కార్యకర్తల హడావిడి, నాయకుల సందడి లేకుండా సంజయ్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఈ కార్యక్రమానికి హాజరై బండి సంజయ్‌కి ఆశీస్సులు అందించనున్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న కిషన్ రెడ్డికి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి కార్మికులకు మరింత మేలు చేసే విధంగా కిషన్ రెడ్డి కృషి చేస్తారని బండి సంజయ్ ఆకాంక్షించారు.

పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

- ప్రభుత్వానికి పలు సంఘాల నాయకుల విజ్ఞప్తి

పంజాగుట్ట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం పూర్తి కావడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని, వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, వివిధ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ అనే అంశంపై స్థానిక ప్రభుత్వాల సాధికార వేదిక ఆధ్వర్యంలో వేదిక రాష్ట్ర సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం పూర్తయ్యి 4 నెలలు గడిచినా ఇంకా ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసి పాలక మండలిని నియమించాలని, ఆర్థిక సంఘం సిఫారసు మేరకు పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్తులకు నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే 73, 74వ రాజ్యాంగ సవరణలను పూర్తి స్థాయిలో అమలు చేసి, అధికారాలను బదిలీ చేయాలని కోరారు. సర్పంచులు, కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని, తాము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేస్తూ సీఎంకు రాసిన లేఖను ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, వి.వి రావు, బండారు రామ్మోహన్ రావు, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' పిటిషన్లన్నీ బదిలీ చేయాలి


» సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం.. ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఎన్టీఏ

న్యూఢిల్లీ, జూన్ 12: నీట్-యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలు హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కోరింది. ఈ విషయమై తాము అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బుధవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. కొందరికి గ్రేస్ మార్కులు కేటాయించడం, పేపర్ లీక్, ఇతర అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలంటూ కోర్టులు ఆదేశించిన నేపథ్యంలో ఎన్టీఏ ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. ఏడు హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టులోనూ ఈ అంశంపై పిటిషన్లు దాఖలయ్యాయని ఎన్టీఏ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. త్వరలోనే ఈ పిటిషన్ల బదిలీపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ధర్మాసనానికి తెలియజేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను జూలై 5కు వాయిదా వేసింది. మరోవైపు 1500 మందికి పైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ 'ఫిజిక్స్ వాలా' సంస్థ సీఈవో అలఖ్ పాండే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పాండే పిటిషన్‌తో పాటు మరో రెండు పిటిషన్లపై గురువారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

కేసులు నమోదైతే పేపర్ లీకైనట్లు కాదు: ఎన్టీఏ డీజీ

నీట్-యూజీ పరీక్షలో కొద్ది మంది అవకతవకలకు పాల్పడితే పేపర్ లీకైనట్లు కాదని ఎన్టీఏ డీజీ సుబోధ్ సింగ్ అన్నారు. "నీట్-యూజీ పరీక్షకు సంబంధించి 63 మంది విద్యార్థులు అక్రమాలకు పాల్పడినట్లు తెలింది. ఇందులో 23 మంది పరీక్ష సమయంలో డిబార్ అయ్యారు. మిగిలింది 40 మంది. ఈ కొద్ది మంది విద్యార్థులు అవకతవకలకు పాల్పడితే పేపర్ లీకేజీ జరిగినట్లు కాదు. దాని వల్ల నీట్ పరీక్ష పవిత్రత ఏమాత్రం దెబ్బతినదు" అని సుబోధ్‌సింగ్ అన్నారు.

'రియాసి దాడి' ఉగ్రవాది ఊహాచిత్రం విడుదల



జమ్మూ, జూన్ 12: జమ్మూకశ్మీర్ రియాసీ వద్ద యాత్రికుల బస్సుపై దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ఒకరి ఊహా చిత్రాన్ని బుధవారం పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ వెల్లడిస్తే రూ. 20లక్షలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షులను విచారించి వారిచ్చిన వివరాల ఆధారంగా పోలీసులు నిందితుడి స్కెచ్‌ను విడుదల చేశారు. గత ఆదివారం శివ్‌ఖోరీ ఆలయం నుంచి మాతా వైష్ణవీ దేవీ ఆలయానికి బయల్దేరిన యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, బుధవారం కథువా జిల్లాలోని ఓ గ్రామంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక జవాన్ అమరుడు కాగా, ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. కాగా, జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 20న అక్కడకు వెళ్లనున్నారు.

రూ.300 కోట్ల ఆస్తి కోసం మామ హత్య!



నాగపూర్, జూన్ 12: రోడ్డు మీద వెళుతున్న 82 ఏళ్ల వృద్ధుడిని ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ పండు ముదుసలి అక్కడికక్కడే మృతిచెందాడు. దీన్ని తొలుత ప్రమాదం అనే భావించారంతా. వృద్ధుడు దుర్మరణం పాలైన 15 రోజుల తర్వాత పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయం బయటపడింది. ఇది ప్రమాదం కాదని, అత్యంత పథకం ప్రకారం జరిగిన హత్య అని, సొంత కోడలే ముగ్గురికి రూ.కోటి సుపారీ ఇచ్చి మరీ చంపించినట్లు పోలీసులు తేల్చారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ ఘటన జరిగింది. హతుడి పేరు పురుషోత్తం పుత్తేవార్! నిందితురాలు పురుషోత్తం కుమారుడైన మనీశ్ భార్య, అంటే హతుడి కోడలు అర్చనా పుత్తేవార్! మామ పురుషోత్తం పేరిట దాదాపు రూ.300 కోట్ల ఆస్తి ఉండటం, ఆయన్ను అడ్డు తొలగించుకుంటే ఆ సంపదంతా తన అధీనంలోకి వస్తుందన్న దురాలోచనతో ఆమె ఘాతుకానికి పాల్పడిందని పోలీసులు నిర్ధారించారు. నిందితురాలైన అర్చన టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మామ ఆస్తిపై కన్నేసిన అర్చన, భర్త దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బాగ్డేకు, నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్ అనే మరో ఇద్దరికి మామను చంపే బాధ్యత అప్పగించింది. వారికి కోటి రూపాయిలిచ్చింది. ప్రమాదవశాత్తు వాహనం ఢీకొట్టి చనిపోయాడని భావించాలనే పథకంతో ఓ సెకండ్ హ్యాండ్ కారు కొనేందుకూ డబ్బిచ్చింది. పోలసులు అర్చనతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారిగా అర్చన చట్ట విరుద్ధంగా లే అవుట్స్‌కు అనుమతులిచ్చారని ఆరోపణలున్నాయి.

అత్తపై 95 వేట్లు వేసి చంపిన కోడలికి మరణశిక్ష

రేవా (మధ్యప్రదేశ్), జూన్ 12: రెండేళ్ల కింద కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తపై కొడవలితో 95 వేట్లు వేసి దారుణంగా చంపిన కోడలికి మధ్యప్రదేశ్‌లోని ఓ కోర్టు మరణ శిక్ష విధించింది. రేవా జిల్లాలోని అత్రైలాకు చెందిన 24 ఏళ్ల కంచన్‌కోల్, అత్త సరోజ్ కోల్ (50)కు మధ్య ఎప్పుడూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలోనే గృహహింస కేసు కూడా నమోదైంది. అయితే 2022 జూలైలో ఎవరూ లేని సమయంలో కోడలు కంచన్‌కోల్ అత్తపై కొడవలితో విరుచుకుపడి విచక్షణారహితంగా దాడి చేసి దారుణంగా చంపింది. ఇంటికి వచ్చిన ఆమె భర్త, సరోజ్‌కోల్ కొడుకు వాల్మిక్ కోల్ దీనిపై పోలీసులకు సమాచారమందించాడు. కోర్టు తాజాగా కంచన్‌కోల్‌కు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

బాల్య వివాహాల కట్టడికి విద్యార్థినులకు స్టైపెండ్!

గువాహటి, జూలై 12: బాల్యవివాహాల కట్టడికి అసోం ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. 11వ తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థినులకు ప్రతినెలా స్టైపెండ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు 'నిజుత్ మోయినా' పేరిట ప్రతిపాదించిన పథకానికి కేబినేట్ నుంచి ఆమోదం లభించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ బుధవారం వెల్లడించారు. పథకం కింద 11, 12వ తరగతులు చదివే అమ్మాయిలకు నెలకు రూ.1000, డిగ్రీ చదివే యువతులకు నెలకు రూ.1250, పీజీ చదివే అమ్మాయిలకు రూ.2500 చొప్పున అందించనున్నట్లు ఆయన వివరించారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థినులకు పెళ్లికాకపోతేనే ఈ పథకానికి అర్హులని, పీజీ విద్యార్థినులు మాత్రం పెళ్లైనా ఈ పథకం కింద లబ్ధి పొందవచ్చని తెలిపారు.

భారత్‌లో బర్డ్ ఫ్లూ రెండో కేసు: డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ, జూన్ 12: భారత్‌లో బర్డ్ ఫ్లూ రెండో కేసును గుర్తించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో నాలుగేళ్ల బాలికలో హెచ్9ఎన్2 వైరస్ ద్వారా సోకే బర్డ్ ఫ్లూని గుర్తించినట్లు తెలిపింది. "ఆ బాలికని తీవ్రమైన శ్వాస సమస్యలు, జ్వరం, కడుపు నొప్పితో ఫిబ్రవరి నెలలో ఓ స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. వ్యాధి నిర్ధారణ తర్వాత చికిత్స చేసి మూణ్నెళ్ల తర్వాత బాలికను డిశ్చార్జ్ చేశారు" అని డబ్ల్యూహెచ్‌వో తాజాగా వెల్లడించింది. 2019లో తొలిసారి హెచ్9ఎన్2 బర్డ్ ఫ్లూ కేసుని భారత్‌లో గుర్తించినట్లు తెలిపింది.

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

50 మంది భారతీయుల దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు.. ఇలా 50 మంది గాయాలపాలవ్వగా వారిలో 15 మంది ఆస్పత్రిలో కన్నుమూశారు. క్షతగాత్రుల్లో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. కువైట్‌లోని మంగఫ్ మునిసిపాలిటీ పరిధిలోని ఎన్‌బీటీసీ గ్రూప్ భవనంలో ఈ దారుణం చోటుచేసుకుంది. మలయాళీ అయిన కేజీ అబ్రహాంకి చెందిన ఎన్‌బీటీసీ కంపెనీలో పనిచేసేవారంతా మలయాళీలు, తమిళులే.! వీరికి వసతి కల్పించేందుకు కువైట్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో భవనాలను నిర్మించారు. మంగాఫ్ నగరంలోని ఆరంతస్తుల భవనంలో సుమారు 196 మంది మలయాళీలు, తమిళులు నివసిస్తున్నారు. కువైట్‌లోని భారతీయులు ఈ భవనాన్ని 'మలయాళీ క్యాంపు'గా పిలుస్తారు. కువైట్ కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో ఎన్‌బీటీసీ కార్మికులు నివసించే భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న వంటగదిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వంటగదిలో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో.. క్షణాల్లో మంటలు పైఅంతస్తులకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఉదయం 6 గంటల వేళ మంటలు అదుపులోకి వచ్చాయి. ఘటనాస్థలిలో 35 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, అగ్నిప్రమాదం నుంచి తప్పించుకునేందుకు పైఅంతస్తుల నుంచి కిందకు దూకి గాయాలైన వారు, దట్టమైన పొగతో శ్వాస ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారు.. ఇలా మొత్తం 50 మందిని అల్-అదాన్, అల్-ఫర్వానియా, అల్-అమీరి, అల్-ముబారక్, అల్-జాబెర్ ఆస్పత్రులకు తరలించినట్లు ఆయన వివరించారు. వీరిలో 15 మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మిగతా 35 మంది క్షతగాత్రులకు అత్యవసర చికిత్సలు అందజేస్తున్నట్లు వివరించారు. బాధితుల్లో చాలా మంది దట్టమైన పొగను పీల్చడం వల్ల మరణించినట్లు వైద్య అధికారులు ప్రకటించారు. కువైట్‌లోని భారత రాయబారి ఆదర్శ్ స్వైకా సంఘటనాస్థలిని సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడారు. బాధితుల కుటుంబ సభ్యులు ఎంబసీ హెల్ప్‌లైన్ +965 65505246ను సంప్రదించవచ్చన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న భారత రాయబారి ఆదర్శ్

మోదీ, జైశంకర్ దిగ్భ్రాంతి

కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భారతీయులు మృతిచెందడం పట్ల ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "పరిస్థితిని సమీక్షిస్తున్నాం. కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయ అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు" అని పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. భారీ ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ హుటాహుటిన కువైట్‌కు బయలుదేరారు. మృతదేహాలను త్వరితగతిన భారత్ తరలించేందుకు ఆయన చొరవ తీసుకుంటారని తెలుస్తోంది.

తెలుగు వారంతా క్షేమమే

తమకు ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాద మృతుల్లో తెలుగు వారెవరూ లేరని ఎన్నారై టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు, యునైటెడ్ తెలుగు ఫోరం కన్వీనర్ వెంకట్ కోడూరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "ప్రమాదం జరగ్గానే మనవాళ్లు ఉన్నారా? అనే అంశంపై ఆరా తీశాం. ఎన్‌బీటీసీ భవనం చుట్టుపక్కల నివసించే తెలుగువారిని ఆరా తీస్తే.. మృతుల్లో మలయాళీలు, తమిళులే ఉన్నట్లు చెప్పారు. కువైట్ అధికారిక వర్గాలు విడుదల చేసిన పేర్లలో, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో తెలుగువారు ఎవరూ లేరని స్పష్టమవుతోంది" అని ఆయన వివరించారు. అయితే, బుధవారం కడపటి వార్తలందేసరికి మృతుల్లో 21 మంది పేర్లను ప్రకటించారు. వారిలో ఒకరు ఏపీకి చెందిన వారు కావొచ్చని అనుమానిస్తున్నారు. మృతుల్లో ఎక్కువ మంది మలయాళీలు కావడంతో కేరళలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, కువైట్‌లోని మలయాళీ సంఘాలు మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను సంప్రదించేందుకు ఈ కింది హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశాయి.

అనుప్ మంగత్	+965 90039594
బిజోయ్	+965 66893942
రిచీ జార్జ్	+965 60615153
అనిల్ కుమార్	+965 66015200
థామస్ సెల్వన్	+965 517141951
అన్సారీ	+965 60311882
జిన్స్ థామస్	+965 65589453

పాక్ ఉగ్రవాదికి క్షమాభిక్ష తిరస్కరణ

» 2000లో ఎర్రకోటపై దాడి కేసులో ఆరిఫ్‌కు మరణశిక్ష

» క్షమాభిక్ష పిటిషన్‌ను తోసిపుచ్చిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జూన్ 12: ఎర్రకోటపై దాడి కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న పాకిస్థాన్ ఉగ్రవాది మొహమ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. అధికార వర్గాలు బుధవారం ఈ విషయాన్ని వెల్లడించాయి. 2000 డిసెంబరు 22న ఎర్రకోట ఆవరణలోని 7 రాజ్‌పుతానా రైఫిల్స్ యూనిట్‌పై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడటంతో ముగ్గురు జవాన్లు మరణించారు. ఆ తర్వాత నాలుగు రోజులకు లష్కరే తాయిబా ఉగ్రవాది ఆరిఫ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 1999లో మరో ముగ్గురు ఉగ్రవాదులు అబూ షాద్, అబూ బిలాల్, అబూ హైదర్‌లతో కలిసి ఆరిఫ్ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం అబూ షాద్, అబూ బిలాల్, అబూ హైదర్ వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మరణించారు. 2005 అక్టోబరు 5న విచారణ కోర్టు ఆరిఫ్‌కు మరణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు కూడా విచారణ కోర్టు తీర్పును సమర్థిస్తూ 2011 ఆగస్టులో తీర్పు వెలువరించింది. ఆ తర్వాత ఆరిఫ్ వేసిన రివ్యూ పిటిషన్, క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు 2022లో కొట్టివేసింది. కాగా, ఈ ఏడాది మే 15న ఆరిఫ్ క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేయగా, దానిని అదేనెల 27వ తేదీన రాష్ట్రపతి తిరస్కరించారు. మే 29న వెలువడిన రాష్ట్రపతి సెక్రటేరియట్ ఆదేశంలో ఈ మేరకు పేర్కొన్నట్టు అధికారులు బుధవారం వెల్లడించారు.

లోకం తీరు



ఎలాన్ మస్క్ స్త్రీలోలుడు!

» తన వద్ద పనిచేసిన ఉద్యోగినులతో లైంగిక సంబంధాలు పెట్టుకున్నారు

» 'వాల్‌స్ట్రీట్ జర్నల్' సంచలన కథనం



న్యూయార్క్, జూన్ 12: స్పేస్ ఎక్స్, టెస్లా కంపెనీల అధిపతి ఎలాన్ మస్క్.. తన వద్ద పనిచేసిన పలువురు మహిళలతో లైంగిక సంబంధాలు పెట్టుకున్నారంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనాన్ని ప్రచురించింది. తన కన్నా వయసులో 20 ఏళ్లు చిన్నదైన యువతి ఇంటర్న్‌షిప్ కోసం వస్తే.. మస్క్ ఆమెతో డేటింగ్ చేసి, సిసిలీలోని ఓ రిసార్టుకు తీసుకెళ్లి శృంగారంలో పాల్గొన్నారని ఆ కథనంలో పేర్కొంది. అలాగే.. తనతో పిల్లల్ని కనాలంటూ మరో మహిళా ఉద్యోగినిని కూడా మస్క్ అడిగారని, కానీ అందుకు ఆమె ఒప్పుకోలేదని వెల్లడించింది. 2013లో ఆమె స్పేస్‌ఎక్స్‌లో తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. మరొక ఉద్యోగిని.. 2014లో మస్క్‌తో నెలరోజులపాటు లైంగిక బంధంలో ఉన్నట్టు తెలిపింది. ఆ తర్వాత వారిద్దరి మధ్య సంబంధాలు చెడడంతో ఉద్యోగం మానేసినట్టు వెల్లడించింది. తనతో శృంగారంలో పాల్గొంటే గుర్రాన్ని కొనిపెడతానంటూ మస్క్ 2016లో తనను ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారని స్పేస్ ఎక్స్‌లో ఫ్లైట్ అటెండెంట్‌గా పనిచేసిన ఒక మహిళ ఆరోపించింది. ఇలా మస్క్ తన టెస్లా, స్పేస్‌ఎక్స్ కంపెనీల్లో కల్పించిన వాతావరణంతో మహిళా ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. మస్క్‌తో శృంగారంలో పాల్గొన్న మహిళలు, వారి స్నేహితులు, కుటుంబసభ్యులతో మాట్లాడి.. పలు టెక్స్ట్ సందేశాలు, ఈమెయిళ్లు, ఇతర పత్రాలను పరిశీలించి వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ కథనాన్ని ప్రచురించింది.

పార్లమెంటు సమావేశాలు 24 నుంచి



న్యూఢిల్లీ, జూన్ 12: ఇటీవలి ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీలతో 18వ లోక్‌సభ ఈ నెల 24న కొలువుదీరనుంది. జూలై 3 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. తొలి మూడు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, స్పీకర్ ఎన్నిక ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఈ నెల 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఇక రాజ్యసభ 264వ సమావేశాలు ఈ నెల 27 నుంచి జూల్ 3 వరకు కొనసాగుతాయని 'ఎక్స్'లో రిజిజు పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీ తన మంత్రులను 27న రాష్ట్రపతి ప్రసంగం అనంతరం పార్లమెంటుకు పరిచయం చేస్తారని భావిస్తున్నారు.

నేడు ఇటలీకి మోదీ

» జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రధాని నరేంద్రమోదీ జీ-7 దేశాల 50వ సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లనున్నారు. ఇటీవల మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీకిది తొలి విదేశీ పర్యటన కానుంది. అపులియా ప్రాంతంలోని బోర్గో ఎగ్నాజియా అనే రిసార్ట్‌లో జూన్ 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంఘర్షణపై సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశముంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం ఓ సెషన్‌కు హాజరై తమ దేశంపై రష్యా జరుపుతున్న దాడి గురించిన చర్చలో పాల్గొంటారు. కాగా, జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం జీ-20 ఫలితాలను అనుసరించేందుకు ఉపకరిస్తుందని విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వత్రా బుధవారం తెలిపారు. కాగా, ఇటలీలో మహాత్మగాంధీ విగ్రహాన్ని బుధవారం ఖలిస్థానీ మద్దతు దారులు ధ్వంసం చేశారు.

చావు దెబ్బ తీశాం

» మోదీ సర్కారుది కనీసం నడవలేని స్థితి

» వయనాడ్, రాయ్‌బరేలీల్లో దేన్ని త్యజించాలో తేల్చుకోలేకపోతున్నా: రాహుల్



వయనాడ్, జూన్ 12: ఎన్నికల్లో విపక్షాలు కొట్టిన చావుదెబ్బకు మోదీ సర్కారు కనీసం నడవలేని స్థితికి చేరుకుందని కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. దేశాన్ని నడిపించే చేవ ఎన్డీయే కూటమికి లేదన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ తమ వైఖరులను మార్చుకోవాల్సిందేనన్న స్పష్టమైన సంకేతాన్ని తమ తీర్పుతో దేశ ప్రజలు ఇచ్చారని పేర్కొన్నారు. కేరళలోని వయనాడ్‌లో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం తర్వాత వయనాడ్‌లో తొలిసారి ఆయన పర్యటించారు. "ఇప్పుడు చూసేది పాత మోదీని కాదు. మోదీ వేసుకున్న పథకాలను ఇండియా కూటమి ధ్వంసం చేసేసింది" అని రాహుల్ పేర్కొన్నారు. వారాణసీలో మోదీ త్రుటిలో ఓటమిని తప్పించుకున్నారని ఆయన పేర్కొన్నారు. "ఏడో విడత ఎన్నికల ప్రచార విరామంలో అందరూ ఇంటికి పరిమితం అయ్యారు. కానీ, మోదీ ధ్యానం పేరిట కన్యాకుమారిలో ప్రచారం సాగించారు. ఇంత చేసినా గానీ వారాణసీలో మోదీ మెజారిటీ గణనీయంగా తగ్గిపోయింది" అని రాహుల్ ఎద్దేవా చేశారు. మోదీ అవసరాలను తీర్చేలా షెడ్యూల్‌ను ఈసీ తయారుచేసిందని, వారాణసీకి చివరి విడతలో ఎన్నికలు జరిపించడం ఇందులో భాగమేనన్నారు. కాగా, సాధారణ ఎన్నికల్లో రాహుల్ వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీ నుంచి కూడా విజయం సాధించారు. ఈ రెండింటిలో ఒకటి ఆయన వదులుకోవాల్సి ఉంది. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాను. కానీ, నేను ఏ నిర్ణయం తీసుకున్నా ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి' అని కోరారు. కాగా, "దేశానికి నాయకత్వం వహించాల్సిన నేతను వయనాడ్‌కే పరిమితం చేసి చూడలేం" అంటూ కాంగ్రెస్ పార్టీ కేరళ శాఖ అధ్యక్షుడు సుధాకరన్ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

అయోధ్య ప్రజలది గొప్ప తీర్పు

పుణే, జూన్ 12: మందిర రాజకీయాలను ఎలా తిప్పికొట్టాలో అయోధ్య ప్రజలు రుజువు చేశారని, అందుకే అక్కడ బీజేపీ ఓటమి చవిచూసిందని ఎన్సీపీ(ఎస్పీ) నేత శరద్‌పవార్ పేర్కొన్నారు. రామ మందిరమే ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లోకి వెళ్లిన అధికార పార్టీ భారీగా ఓట్లు మూటకట్టుకుంటుందని తాను భావించానని, కానీ దేశ ప్రజలు వివేకవంతులని, గుడి పేరుతో ఓట్లు అడుగుతుందని గ్రహించి బీజేపీని ఓడించారని తెలిపారు. మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మోదీపై విమర్శలు గుప్పించారు.

మోదీ 3.0కి మరో సవాల్!

న్యూఢిల్లీ, జూన్ 12: కేంద్రంలో సొంతంగా అధికారంలోకి రాలేకపోయిన బీజేపీకి, ప్రధాని మోదీకి ఈ సారి పార్లమెంటరీ కమిటీల పదవుల విషయంలో పెద్ద సవాల్ ఎదురు కానుంది. కమిటీల్లో సింహభాగం ఇన్నాళ్లూ బీజేపీ చేతిలోనే ఉండేవి. ఇప్పుడు విపక్షాల సంఖ్యాబలం (234) పెరగడంతో కొన్ని కమిటీల సారథ్యం వాటికీ ఇవ్వక తప్పని పరిస్థితి. ఎన్డీయేలో ప్రస్తుతం బీజేపీ (240) తర్వాత పెద్ద పార్టీలైన టీడీపీ (16), జేడీయూ (12) కూడా కొన్ని కమిటీల చైర్మన్ పదవులు తప్పక ఆశిస్తాయి. కేంద్రప్రభుత్వంలోని అన్ని శాఖలకు సంబంధించి పార్లమెంటులో మొత్తం 24 కమిటీలు ఉంటాయి. ప్రతి కమిటీలో 31 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 21 మందిని లోక్‌సభ నుంచి స్పీకర్, 10 మందిని రాజ్యసభ నుంచి చైర్మన్ ఎంపిక చేస్తారు. ఇవిగాక ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ), ప్రివిలేజెస్ కమిటీ, హౌస్ కమిటీలు ఉంటాయి. మొత్తంగా 30 కమిటీలు ఉంటాయని.. వీటి చైర్మన్లను పార్లమెంటులో బలాబలాల ఆధారంగా ఆయా పార్టీల నుంచి ఎంపిక చేస్తారు. కీలక బిల్లులను చట్టంగా మార్చే క్రమంలో పార్లమెంటరీ కమిటీల పాత్ర కీలకం. బిల్లుల్లో లోపాలను ఎత్తిచూడం, సిఫారసులు చేయడం కమిటీల విధి. ఈ నేపథ్యంలో కీలక సంస్కరణలు, విధానాల కొనసాగింపునకు వీలుగా హోం, ఆర్థిక, ఐటీ, రక్షణ, విదేశీ వ్యవహారాల కమిటీల చైర్మన్ పదవులను బీజేపీ వదులుకోదని పార్లమెంటరీ వర్గాలు అంటున్నాయి. అయితే, సంకీర్ణ భాగస్వాములను కూడా బీజేపీ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని.. ముఖ్యంగా ఏపీ, బిహార్ రాష్ట్రాల అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుందని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని జాకీర్ హుస్సేన్ ఢిల్లీ కాలేజీ ప్రొఫెసర్ రవి రంజన్ తెలిపారు.

మద్యం దుష్ప్రభావాలకు చెక్ పెట్టే జెల్

అభివృద్ధి చేసిన ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులు



న్యూఢిల్లీ, జూన్ 12: మద్యం మత్తుకు, ఆ మహమ్మారి వల్ల శరీరంపై పడే దుష్ప్రభావాలకూ చెక్ పెట్టే వినూత్న ప్రొటీన్ జెల్‌ను స్విస్ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. శరీరంలోకి ప్రవేశించిన మద్యం ప్రమాదకరమైన ఎసిటాల్డిహైడ్‌గా మారకముందే.. దాన్ని నిరపాయకరమైన ఎసిటిక్ యాసిడ్ మార్చేయడం ఈ జెల్ ప్రత్యేకత. సాధారణంగా మనం తినే ఆహారం జీర్ణవాహికలో నిదానంగా జీర్ణమవుతుంది. కానీ, మద్యం అలా నెమ్మదిగా కాకుండా.. జీర్ణవాహిక గోడలపై ఉండే మ్యూకస్-మెంబ్రేన్ పొరల గుండా రక్తంలోకి ప్రవేశించి, రక్త కణాల ద్వారా శరీరమంతా వేగంగా వ్యాపిస్తుంది. అందుకే మద్యం తీసుకున్న కొద్దిసేపటికే మత్తు కలగడం మొదలవుతుంది. అలా రక్తంలోకి చేరిన ఆల్కహాల్‌ను మన కాలేయం బ్రేక్‌డౌన్ చేసి అసిటాల్డిహైడ్‌గా మారుస్తుంది. అది కొద్దిసేపటికే ఎలాంటి ప్రమాదం లేని అసిటిక్ యాసిడ్‌గా మారుతుంది. కానీ.. ఆలోగానే అసిటాల్డిహైడ్ మన శరీరానికి తీవ్ర హాని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్విట్జర్లాండ్‌కు చెందిన ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులకు ఒక ఆలోచన వచ్చింది. శరీరంలోకి ప్రవేశించిన ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశించి, ఆపై అసిటాల్డిహైడ్‌గా మారకుండా నేరుగా అసిటిక్ యాసిడ్‌గా మారిపోయేలా చేస్తే మద్యం మత్తును, ఇతర దుష్ప్రభావాలను అరికట్టవచ్చన్నది వారి ఆలోచన. దీనిపై రకరకాల ప్రయోగాలు చేసి, చివరికి.. వే ప్రొటీన్లకు ఐరన్, గ్లూకోజ్, గోల్డ్ నానో పార్టికల్స్‌ను జోడించి తాము అనుకున్న జెల్‌ను తయారు చేయగలిగారు. ప్రయోగాల్లో భాగంగా ఆ జెల్‌ను రెండు గ్రూపుల ఎలుకలకు ఇచ్చారు. ఒక గ్రూపులో ఎలుకలకు ఒక్కసారి మద్యం తాగించారు. మరో గ్రూపులోని ఎలుకలకు 10 రోజులపాటు మద్యం తాగించారు. ఒక్కసారి మద్యం తాగించిన ఎలుకలకు ఈ జెల్‌ను ఇచ్చి.. అరగంట తర్వాత పరీక్ష చేయగా, వాటిలో ఆల్కహాల్ స్థాయిలు 40% తగ్గినట్టు వెల్లడైంది. ఐదుగంటల తర్వాత పరీక్ష చేయగా.. మద్యం స్థాయిలు 56 శాతం మేర తగ్గాయి. పదిరోజులపాటు వరుసగా ఆల్కహాల్ ఇచ్చిన ఎలుకలకు ఈ జెల్ ఇవ్వగా.. అది మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలను బాగా తగ్గించినట్టు గమనించారు. ఆ ఎలుకల కాలేయం, ప్లీహం, పేగులు అంత ఎక్కువగా దెబ్బతినకుండా ఉండడాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. అయితే.. ఈ జెల్ ప్రభావం మానవులపై ఎలా ఉంటుందో పరీక్షించాల్సి ఉంది. మానవులపై కూడా జెల్ ఇలాగే పనిచేస్తే ఏటా మద్యపాన వ్యసనం వల్ల సంభవిస్తున్న 30 లక్షల మరణాలకు చెక్ పెట్టవచ్చని ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలేయంలో కాకుండా...

"ఆల్కహాల్ సాధారణంగా కాలేయంలో బ్రేక్‌డౌన్ అవుతుంది. కానీ, మా జెల్ ఆ ప్రక్రియను కాలేయం నుంచి జీర్ణవాహికకు మారుస్తుంది" అని ఈ పరిశోధనలో పాలుపంచుకున్న డాక్టర్ రఫెల్ మెజెంగా వివరించారు. అసలు మద్యపానం చేయకుండా ఉండడమే ఉత్తమమమైన పని అని.. ఇప్పటికే ఆ వ్యసనానికి బానిసలై, మానలేనివారికి తమ జెల్ ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. తాగిన మద్యం పేగుల్లో ఉండేదాకా మాత్రమే తమ జెల్ పనిచేస్తుందని, ఒక్కసారి ఆ ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశిస్తే మాత్రం దాని ప్రభావాన్ని జెల్ ఏ మాత్రం రివర్స్ చేయలేదని డాక్టర్ రఫెల్ స్పష్టం చేశారు. అంటే.. మద్యం మత్తు ఆవరించాక జెల్ తీసుకుంటే మత్తు పోదు. కాకపోతే, అవయవాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. మద్యం తాగకముందే ఈ జెల్‌ను నోటి ద్వారా మాత్ర రూపంలో తీసుకుంటే ఎక్కువ ఉపయోగం ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

చివరాఖరు.. ఈ జెల్ తీసుకుంటే రక్తంలో మద్యం స్థాయిలు తగ్గుతాయంటే.. భవిష్యత్తులో మందుబాబులు డ్రంకెన్‌డ్రైవ్‌ల్లో పట్టుబడకుండా ఉండడానికి వీటిని విచ్చలవిడిగా వాడేయరూ?

ఒడిసా సీఎంగా మాఝీ ప్రమాణం

భువనేశ్వర్, జూన్ 12: ఒడిసాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ నేత, గిరిజన నాయకుడు మోహన్ చరణ్ మాఝీ ఒడిసా ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సమక్షంలో ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. కేవీ సింగ్ డియో, ప్రవతీ పరిడా ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యారు. కాగా, భక్తుల సౌకర్యార్థం పూరీ జగన్నాథ స్వామి ఆలయంలోని నాలుగు ద్వారాలను గురువారం ఉదయం నుంచి తెరుస్తామని సీఎం మాఝీ బుధవారం ప్రకటించారు. ఇన్నాళ్లూ జగన్నాథ స్వామి ఆలయంలోకి భక్తులను కేవలం ప్రధాన ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ వరుసగా మూడో సారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఖండూను ఎన్నుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు ప్రకటించాయి.

స్పోర్ట్స్

మనోళ్లు సూపర్

టీమిండియాకు సూపర్-8 బెర్త్

● అమెరికాపై ఏడు వికెట్ల విజయం
● సత్తా చాటిన అర్ష్‌దీప్, సూర్యకుమార్



అర్ష్‌దీప్ (4-0-9-4)



సూర్యకుమార్ (50 నాటౌట్)

స్కోరుబోర్డు

యూఎస్ఏ: షయన్ జహంగీర్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 0, స్టీవెన్ టేలర్ (బి) అక్షర్ 24, గౌస్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 2, ఆరోన్ జోన్స్ (సి) సిరాజ్ (బి) హార్దిక్ 11, నితీష్ (సి) సిరాజ్ (బి) అర్ష్‌దీప్ 27, అండర్సన్ (సి) పంత్ (బి) హార్దిక్ 15, హర్మీత్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 10, షాడ్లీ వాన్ (నాటౌట్) 11, జస్దీప్ సింగ్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 110/8; వికెట్ల పతనం: 1-0, 2-3, 3-25, 4-56, 5-81, 6-96, 7-98, 8-110; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-9-4, సిరాజ్ 4-0-25-0, బుమ్రా 4-0-25-0, హార్దిక్ 4-1-14-2, దూబే 1-0-11-0, అక్షర్ 3-0-25-1.

భారత్: రోహిత్ (సి) హర్మీత్ (బి) నేత్రావల్కర్ 3, కోహ్లీ (సి) గౌస్ (బి) నేత్రావల్కర్ 0, పంత్ (బి) అలీఖాన్ 18, సూర్యకుమార్ (నాటౌట్) 50, దూబే (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 18.2 ఓవర్లలో 111/3; వికెట్ల పతనం: 1-6, 2-15, 3-44; బౌలింగ్: నేత్రావల్కర్ 4-0-18-2, అలీఖాన్ 3.2-0-21-1, జస్దీప్ 4-0-24-0, షాడ్లీ వాన్ 4-0-25-0, కోరే అండర్సన్ 3-0-17-0.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	1.137
అమెరికా	3	2	1	0	4	0.127
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

న్యూయార్క్: వందకుపైగా లక్ష్యాన్ని ఛేదించడానికి టీమిండియా ఆపసోపాలు పడినా.. సూపర్-8కు చేరుకొంది. సూర్యకుమార్ (49 బంతుల్లో 50 నాటౌట్) సమయోచిత అర్ధ శతకంతో.. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పసికూన అమెరికాపై గెలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన రోహిత్ సేన మొత్తం ఆరు పాయింట్లతో తర్వాతి దశకు అర్హత సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ (4-0-9-4) కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో చెలరేగడంతో.. తొలుత అమెరికా 20 ఓవర్లలో 110/8 స్కోరు చేసింది. నితీష్ కుమార్ (27), స్టీవెన్ టేలర్ (24), కోరె అండర్సన్ (15) ఆదుకొన్నారు. హార్దిక్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. దూబే (31 నాటౌట్), రిషభ్ పంత్ (18) రాణించారు. సౌరభ్ నేత్రావల్కర్ 2 వికెట్లు పడగొట్టాడు.

తడబడి.. నిలబడి: లక్ష్య ఛేదనలో సూర్య, దూబే నాలుగో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యంతో టీమిండియాను గట్టెక్కించారు. నేత్రావల్కర్ దెబ్బకు 10 పరుగులకే ఓపెనర్లు కోహ్లీ (0), రోహిత్ శర్మ (3)ను కోల్పోయిన టీమిండియాను తొలుత పంత్, సూర్య ఆదుకొన్నారు. ఐదో ఓవర్‌లో సౌరభ్ బౌలింగ్‌లో సూర్య సిక్స్ బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పంత్ సిక్స్ సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 33/2తో మెరుగ్గా కనిపించింది. అయితే, దూకుడుగా ఆడుతున్న పంత్‌ను అలీ బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 29 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో పేలవ ఫామ్‌లో ఉన్న దూబే క్రీజులోకి రావడంతో మధ్య ఓవర్లలో స్కోరు వేగం మందగించింది. మరోవైపు సూర్య కూడా ఆచితూచి ఆడడంతో 10 ఓవర్లకు భారత్ 47/3 స్కోరు చేసింది. కాగా, 22 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద షాడ్లీ బౌలింగ్‌లో సూర్య ఇచ్చిన క్యాచ్‌ను నేత్రావల్కర్ చేజార్చడంతో బతికిపోయాడు. మరోవైపు దూబే సిక్స్‌తో గేర్ మార్చడంతో.. లక్ష్యం చివరి 30 బంతుల్లో 35 పరుగులుగా మారింది. **కాగా, ఓవర్‌కు ఓవర్‌కు మధ్య 'వన్ మినిట్' నిబంధనను యూఎస్ మూడోసారి ఉల్లంఘించడంతో ఐదు పరుగుల పెనాల్టీ విధించారు. దీంతో 16వ ఓవర్‌లో మొత్తం 11 రన్స్ లభించాయి.** ఆ తర్వాతి ఓవర్‌లో సూర్య 6,4తో 15 పరుగులు పిండుకోవడంతో.. టార్గెట్ 18 బంతుల్లో 9 రన్స్‌కు దిగివచ్చింది. సూర్య సింగిల్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. దూబే మరో 10 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఎదురునిలిచిన నితీష్: అర్ష్‌దీప్ నిప్పులు చెరిగినా.. నితీష్ ఆదుకోవడంతో అమెరికా పోరాడగలిగే స్కోరు చేసింది. టేలర్‌తో కలసి మూడో వికెట్‌కు 31 పరుగులు జోడించిన నితీష్.. అండర్సన్‌తో ఐదో వికెట్‌కు 25 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఎస్‌ను అర్ష్‌దీప్ భయపెట్టాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జహంగీర్ (0), ఆండ్రెస్ గౌస్ (2)ను అవుట్ చేయడంతో.. పవర్‌ప్లేలో అమెరికా 18/2తో నిలిచింది. జోరుమీదున్న ఆరోన్ జోన్స్ (11)ను బోల్తా కొట్టించిన పాండ్యా.. ప్రత్యర్థిని పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. ఈ దశలో మరో ఓపెనర్ టేలర్‌కు జత కలసిన నితీష్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు యత్నించాడు. సిక్స్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న టేలర్‌ను అక్షర్ బౌల్డ్ చేశాడు. కానీ, అండర్సన్‌తో జత కలసి నితీష్ ఎదురుదాడి చేశాడు. పాండ్యా వేసిన 13వ ఓవర్‌లో నితీష్ 6,4తో 12 పరుగులు పిండుకొన్నాడు. మరోవైపు అండర్సన్ కూడా సిక్స్‌తో టచ్‌లోకి వచ్చాడు. అయితే, ధాటిగా ఆడుతున్న నితీష్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ మళ్లీ దెబ్బకొట్టాడు. కానీ, 16వ ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో అండర్సన్ ఫోర్ కొట్టగా.. హర్మీత్ (10) సిక్స్ బాదడంతో మొత్తం 14 పరుగులు లభించాయి. అండర్సన్‌ను పాండ్యా, హర్మీత్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేశారు. షాడ్లీ వాన్ (11 నాటౌట్), జస్‌దీప్ (2) జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	0.603
బంగ్లాదేశ్	2	1	1	0	2	0.075
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.024
నేపాల్	2	0	1	1	1	-0.539
శ్రీలంక	3	0	2	1	1	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x న్యూజిలాండ్ (ఉ.6. గం.)
బంగ్లాదేశ్ x నెదర్లాండ్స్ (రా.8. గం.)
ఇంగ్లండ్ x ఒమన్ (రా.12.30. గం.)

లంక, నేపాల్ అవుట్!

వర్షంతో ఇరుజట్ల మ్యాచ్ రద్దు
సూపర్-8కు సౌతాఫ్రికా

లాడర్‌హిల్: భారీ వర్షం కారణంగా గ్రూప్-డిలో శ్రీలంక, నేపాల్ మధ్య బుధవారం జరగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఇరు జట్లకూ చెరో పాయింట్ లభించినా.. టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, ఆడిన మూడు మ్యాచుల్లోనూ నెగ్గి 6 పాయింట్లు సాధించిన సౌతాఫ్రికా సూపర్-8కు దూసుకెళ్లింది. లంకతో మ్యాచ్ రద్దు కాకముందు నేపాల్‌కు కూడా టాప్-2లో నిలిచే అవకాశం ఉండడంతో సఫారీలు సూపర్-8కు చేరుకోవడంపై అప్పుడు స్పష్టత రాలేదు. ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల నుంచి ఒక పాయింటే సాధించిన నేపాల్.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో బలమైన సౌతాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో ఆడాల్సి ఉంది. ఇక, శ్రీలంకకు ఒక్క మ్యాచే మిగిలుండడంతో ఆ జట్టు తర్వాతి దశకు చేరడం అసాధ్యమే. గ్రూప్‌లో మిగిలిన రెండో బెర్త్ కోసం బంగ్లా, నెదర్లాండ్స్ పోటీపడుతున్నాయి. అయితే, డచ్ జట్టు కంటే బంగ్లా మెరుగైన రన్‌రేట్‌తో ఉండడం కలిసొచ్చే అంశం.



1 టీ20లలో 100 వికెట్లు సాధించిన తొలి ఆస్ట్రేలియా పురుష బౌలర్ ఆడమ్ జంపా

సూపర్-8కు ఆస్ట్రేలియా

9 వికెట్లతో నమీబియాపై గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): బలమైన ఆస్ట్రేలియా ధాటికి పసికూన నమీబియా చిగురుటాకులా వణికింది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్లతో నమీబియాను చిత్తు చేసి సూపర్-8లోకి అడుగుపెట్టింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన నమీబియా ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 17 ఓవర్లలో 72 పరుగులకే చేతులెత్తేసింది. కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ (43 బంతుల్లో 36) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఎదుర్కొన్న 17వ బంతికి కానీ తొలి పరుగు చేయని ఎరాస్మస్ 43/8తో దయనీయ స్థితిలో ఉన్న జట్టు స్కోరును తన బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ దాటించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జంపా (4/12) నమీబియాను ఉక్కిరిబిక్కిరి చేశాడు. హాజెల్‌వుడ్, స్టొయినిస్ కూడా ప్రత్యర్థి పతనంలో తమవంతు పాత్ర పోషించారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 5.4 ఓవర్లలోనే 74/1 స్కోరుతో ఛేదించింది. వరుసగా 3 విజయాలు సాధించిన ఆసీస్ తదుపరి దశకు చేరింది. మరోవైపు 3 మ్యాచ్‌ల్లో రెండింటిలో ఓడిన నమీబియా సూపర్-8 రేస్‌నుంచి అవుటైంది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	3	3	0	0	6	3.580
స్కాట్లాండ్	3	2	0	1	5	2.164
నమీబియా	3	1	2	0	2	-2.098
ఇంగ్లండ్	2	0	1	1	1	-1.800
ఒమన్	3	0	3	0	0	-1.613

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోరు:
నమీబియా: 17 ఓవర్లలో 72 ఆలౌట్ (ఎరాస్మస్ 36, లింగెన్ 10, జంపా 4/12, స్టొయినిస్ 2/9, హాజెల్‌వుడ్ 2/18); **ఆస్ట్రేలియా:** 5.4 ఓవర్లలో 74/1 (హెడ్ 34 నాటౌట్, వార్నర్ 20, మార్ష్ 18 నాటౌట్, వీజ్ 1/15).

సిక్కి జోడీ శుభారంభం

సిడ్నీ: తెలుగు షట్లర్లు సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జంట ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రణయ్, సిరిల్ వర్మ, కిరణ్, ఆకర్షి కశ్యప్ ముందంజ వేశారు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి-సుమిత్ జోడీ 21-17, 21-19తో వాంగ్ టైన్ సి-లిమ్ చివ్ (మలేసియా) జంటపై గెలిచింది. ప్రణయ్ 21-10, 23-21తో డి ఒలివెరా (బ్రెజిల్)పై, సిరిల్ 21-10, 21-10తో టాంగ్ (ఆస్ట్రేలియా)పై, కిరణ్ జార్జ్ 21-17, 21-10తో షెంగ్ (కెనడా)పై, ఆకర్షి 21-14, 21-11తో పొలినా (ఉక్రెయిన్)పై, మాళవిక 21-10, 21-8తో కియోరాపై నెగ్గారు. శ్రీకృష్ణప్రియ-వెంకట్ ద్వయం తొలి రౌండ్లోనే ఓడింది.

నిత్య, జ్యోతికకు స్వర్ణాలు



జ్యోతికశ్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఇండియన్ గ్రాండ్ ప్రీ-3లో తెలుగు అథ్లెట్లు నిత్య, జ్యోతికశ్రీ స్వర్ణాలతో మెరిశారు. బెంగళూరులో బుధవారం జరిగిన 200 మీటర్ల రేసును నిత్య 24.23 సెకన్లలో పూర్తిచేసి విజేతగా నిలిచింది. ఇక, 400 మీటర్ల రేసులో తణుకు అమ్మాయి జ్యోతికశ్రీ 51.53 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని ప్రథమస్థానంలో నిలిచింది.



నిత్య

క్వార్టర్స్‌లో సుమిత్



పెరూగియా (ఇటలీ): సుమిత్ నగల్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తున్నాడు. గతవారం జర్మనీలో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గిన సుమిత్.. పెరూగియా చాలెంజర్ టోర్నీలోనూ టైటిల్ దిశగా మరింత ముందుకెళ్లాడు. సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం హోరాహోరీగా జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆరోసీడ్ సుమిత్ 0-6, 7-5, 7-6(7-5)తో స్థానిక ఆటగాడు అలెగ్జాండ్రో గియానెస్సిని ఓడించాడు.

రూ. 1.35 లక్షల కోట్లు

ఐపీఎల్ విలువ ఇదీ

న్యూఢిల్లీ: గతేడాదితో పోలిస్తే ఐపీఎల్ వ్యాపార విలువ ఈ సంవత్సరం 6.5 శాతం పెరిగి రూ. 1.35 లక్షల కోట్లకు చేరినట్టు అమెరికాకు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హూలిహాన్ లోకీ ఇంక్ వెల్లడించింది. ఇక.నిరుటితో పోలిస్తే ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన 6.3 శాతం పెరిగి రూ. 28 వేల కోట్లకు చేరింది. ఈసారి టోర్నీలో నాకౌట్‌కు చేరకపోయినా..చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అటు బ్రాండ్, ఇటు వ్యాపార విలువలో నెం.1 ఫ్రాంచైజీగా నిలిచింది. గత ఏడాది కంటే..ఈసారి ఆ జట్టు విలువ 9శాతం పెరిగి రూ. 1928 కోట్లకు చేరింది. బెంగళూరు రెండో (రూ. 1894 కోట్లు) స్థానంలో నిలిచింది. ఈ సీజన్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్రాండ్ వాల్యూలో (రూ. 1802 కోట్లు) ముంబై ఇండియన్స్ (రూ. 1702 కోట్లు)ను వెనక్కు నెట్టి మూడో స్థానం దక్కించుకుంది. రాజస్థాన్ రాయల్స్ (రూ.1110) ఐదో స్థానం, సన్‌రైజర్స్ (రూ.1101) ఆరో స్థానంలో నిలిచాయి.

బిజినెస్

జీవిత బీమా పాలసీలపై రుణ కల్పన తప్పనిసరి

పెన్షన్ పాలసీల నుంచి పాక్షికంగా పెట్టుబడులు వెనక్కి.. ఐఆర్‌డీఏఐ సర్క్యులర్ జారీ

న్యూఢిల్లీ: జీవిత బీమా పాలసీలకు సంబంధించి బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పాలసీలపై రుణ సదుపాయాన్ని ఇక నుంచి తప్పనిసరి చేసింది. దీనికి సంబంధించి బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పాలసీలపై రుణం ఇవ్వడం అనేది సంబంధిత సంస్థ విచక్షణాధికారానికి లోబడి ఉండేది. పాలసీదారుల లిక్విడిటీ అవసరాలు పరిగణనలోకి తీసుకుని ఐఆర్‌డీఏఐ తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం ఇక నుంచి జీవితబీమా కంపెనీలన్నీ పాలసీదారులు కోరినట్టయితే పాలసీలోని సొమ్ముపై తప్పనిసరిగా రుణం అందించాల్సి ఉంటుంది. దీనికి తోడు పాలసీ తీసుకున్న అనంతరం అది తనకు సంతృప్తికరంగా లేకపోతే సరెండర్ చేయడానికి ఉద్దేశించిన ఫ్రీ లుక్ పీరియడ్‌ను ప్రస్తుత 15 రోజుల నుంచి నెల రోజులకు పెంచింది. దీని వల్ల పాలసీ తీసుకున్న వినియోగదారులు పాలసీ పత్రాలు సమగ్రంగా అధ్యయనం చేసేందుకు మరింత సమయం అందుబాటులోకి వస్తుంది. పాలసీలు సరెండర్ చేసే వారికి చెల్లించే మొత్తం, పాలసీల్లో కొనసాగేవారితో సమానంగా ఉండాలని కూడా ఐఆర్‌డీఏ స్పష్టం చేసింది.

పెన్షన్ పాలసీదారులకు ఊరట

పెన్షన్ పథకాల నుంచి పాలసీదారులు పాక్షికంగా పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకు కూడా ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. దీని వల్ల పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇల్లు/ఫ్లాట్ కొనుగోలు/నిర్మాణం, తీవ్ర అనారోగ్య సమస్యలకు అయ్యే చికిత్స వ్యయాలు వంటి అవసరాల కోసం తమ పెన్షన్ పాలసీల నుంచి కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునే సౌలభ్యం పాలసీదారులకు ఏర్పడనుంది. బీమా అంబుడ్స్‌మన్ ఇచ్చే తీర్పులపై అప్పీల్‌కు వెళ్లకపోతే, బీమా సంస్థలు ఆ తీర్పులను నెల రోజుల్లో అమలు చేయాలని కూడా ఐఆర్‌డీఏ కోరింది. లేకపోతే బీమా సంస్థలు ఫిర్యాదుదారుడికి రోజుకి రూ.5,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.



అమెరికాలో వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: వడ్డీరేట్లను ఇప్పుడున్న స్థాయిలోనే యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వు నిర్ణయించింది. దీంతో అక్కడ వడ్డీరేటు 5.25-5.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతుంది. ఫెడ్ చైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అమెరికాలో మే నెల రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతానికి తగ్గింది. దీంతో ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు కొద్దిగా తగ్గించే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమయ్యాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు (ఈసీబీ) ఇటీవల వడ్డీరేట్లు పావు శాతం తగ్గించడమూ ఈ అంచనాలకు తోడైంది. అయితే వడ్డీరేట్ల తగ్గింపునకు మరికొంత కాలం వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించింది. ఈ ఏడాది చివరిలోగా ఒకసారి మాత్రమే వడ్డీరేటు తగ్గించే అవకాశం ఉందని పోవెల్ చెప్పారు. జూన్-ఆగస్టు మధ్య కూడా రిటైల్ ద్రవ్యోల్బణం ఇలానే తక్కువ స్థాయిలో కొనసాగితే, సెప్టెంబరు సమావేశంలో ఫెడ్ తప్పకుండా వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా.

ఏడాది కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార వస్తువుల ధరలు స్వల్పంగా తగ్గడంతో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో ఏడాది కనిష్ఠ స్థాయి 4.75 శాతానికి దిగివచ్చింది. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గత ఏడాది మేలో నమోదైన 4.31 శాతం తర్వాత తిరిగి కనిష్ఠ స్థాయిని నమోదు చేయడం ఇదే ప్రథమం. గత నెలలో ఇది 4.83 శాతం ఉంది. ఆహార వస్తువుల విభాగంలో ధరలు ఏప్రిల్‌తో పోల్చితే 8.70 శాతం నుంచి 8.69 శాతానికి తగ్గాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన 5.1 శాతం నుంచి ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గుతూ వస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.5 శాతానికి తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనా.

హైదరాబాద్‌లో ఒలింపస్ ఓడీసీ కేంద్రం

హైదరాబాద్: హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరనుంది. మెడికల్ టెక్నాలజీలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థగా పేరొందిన ఒలింపస్ కార్పొరేషన్ హైదరాబాద్‌లో తన ఆర్ అండ్ డీ ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఓడీసీ) ఏర్పాటు చేయనుంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఒలింపస్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రులు డీ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమక్షంలో ఒలింపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్ అండ్ డీ) సయ్యద్ నవీద్ ఈ విషయం ప్రకటించారు. మరోవైపు ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో ఒలింపస్ కస్టమర్ల కోసం డెడికేటెడ్ ప్రొడక్ట్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం వచ్చే నెలాఖరుకల్లా కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. ఈ కేంద్రం ద్వారా అమెరికా, యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల్లోని ఒలింపస్ కస్టమర్లకు అధునాతన వైద్య సేవలు అందిస్తారు.

నిఫ్టీ సరికొత్త రికార్డు

ముంబై: మార్కెట్ రెండు రోజుల వరుస నష్టాల నుంచి బయట పడింది. నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. ఇంట్రాడేలో 177 పాయింట్లకు పైగా పెరిగి 23,441.95 పాయింట్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 58.10 పాయింట్ల లాభంతో 23,322.95 వద్ద మరో జీవితకాల గరిష్ఠ స్థాయిలో స్థిరపడింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 594 పాయింట్ల వరకు పెరిగి 77,050 వద్దకు ఎగబాకినప్పటికీ ఆఖరి గంటలో లాభాల స్వీకరణ కారణంగా వృద్ధిని 150 పాయింట్లకే పరిమితం చేసుకుని 76,606.57 వద్ద క్లోజైంది.

వచ్చే ఏడాది మార్కెట్ మహా పతనం?

యూఎస్ ఆర్థికవేత్త హ్యారీ డెంట్ హెచ్చరిక

వచ్చే ఏడాది అమెరికన్ స్టాక్ మార్కెట్ భారీగా పతనం కావచ్చని, అది 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో జరిగిన మార్కెట్ క్రాష్ కంటే దారుణంగా ఉండవచ్చని ఆ దేశ ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత హ్యారీ డెంట్ హెచ్చరించారు. ప్రస్తుతం యూఎస్ స్టాక్ మార్కెట్లో ఇదివరకెన్నడూ లేనంత పెద్ద బుడగ (బబుల్) ఏర్పడుతోందని, వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఎప్పుడైనా అది పేలవచ్చని ఫాక్స్ న్యూస్ డిజిటల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డెంట్ అభిప్రాయపడ్డారు. రాబోయే మార్కెట్ క్రాష్‌లో ఎస్ అండ్ పీ సూచీ 86 శాతం, నాస్‌డాక్ 92 శాతం మేర క్షీణించవచ్చని.. అమెరికన్ స్టాక్ మార్కెట్ కొత్త హీరోగా అవతరించిన ఎన్‌విడియా షేరు గరిష్ఠ స్థాయి నుంచి 98 శాతం మేర పతనం కావచ్చని డెంట్ అంచనా వేశారు. అమెరికా స్టాక్ సూచీలు కుప్పకూలితే భారత్ సహా ప్రపంచ మార్కెట్లూ భారీ పతనాన్ని చవిచూడాల్సి రావచ్చు.

ప్రపంచ టాప్-100 బ్రాండ్లలో నాలుగు భారత కంపెనీలు

● టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్‌లకు చోటు ● కాంటార్ బ్రాండ్జ్ రిపోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత విలువైన 100 బ్రాండ్ల జాబితాలో భారత్ నుంచి నాలుగు కంపెనీలకు చోటు దక్కింది. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ 46వ స్థానంలో నిలవగా ప్రైవేట్ బ్యాంకింగ్ సేవల దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 47వ స్థానంలో ఉంది. టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ 73వ స్థానంలో, ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ 74వ స్థానంలో ఉన్నాయి. అంతేకాదు, అత్యంత విలువైన గ్లోబల్ బీ2బీ టెక్నాలజీ బ్రాండ్ల లిస్ట్‌లో ఇన్ఫీ 20వ స్థానాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయ మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్ బ్రాండ్జ్ ఈ ఏడాదికిగాను విడుదల చేసిన మోస్ట్ వేల్యువబుల్ గ్లోబల్ బ్రాండ్స్ రిపోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది.

కంపెనీ	బ్రాండ్ విలువ (కోట్ల డాలర్లు)
టీసీఎస్	4,479.0
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4,326.0
ఎయిర్‌టెల్	2,526.3
ఇన్ఫోసిస్	2,468.6



ట్రిలియన్ డాలర్ బ్రాండ్ యాపిల్

ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్‌గా అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం, ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ అగ్రస్థానంలో నిలిచింది. అంతేకాదు, ప్రపంచంలో లక్ష కోట్ల డాలర్ల బ్రాండ్ విలువ కలిగిన తొలి సంస్థగా యాపిల్ మరో రికార్డును సైతం సృష్టించింది. కాంటార్ రిపోర్టు ప్రకారం.. యాపిల్ బ్రాండ్ వేల్యూ 1,01,590 కోట్ల డాలర్లుగా నమోదైంది. కాగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెక్‌డొనాల్డ్స్ టాప్ 5 స్థానాల్లో ఉన్నాయి.

ప్రపంచంలో అత్యంత బలమైన హోటల్ బ్రాండ్ తాజ్

ఆతిథ్య రంగానికి చెందిన తాజ్ బ్రాండ్.. ప్రపంచంలోనే అత్యంత బలమైన హోటల్ బ్రాండ్‌గా నిలిచింది. మార్కెట్ రీసెర్చ్ కంపెనీ బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన 'హోటల్స్ 50 : 2024' జాబితా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ రిపోర్టు ప్రకారం.. తాజ్ బ్రాండ్ విలువ వార్షిక ప్రాతిపదికన 45 శాతం పెరిగి 54.5 కోట్ల డాలర్లకు చేరుకుంది. బ్రాండ్ శక్తి సూచీలో తాజ్‌కు 100కు 92.9 పాయింట్లు లభించాయి. అంతేకాదు, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హోటల్స్ బ్రాండ్లలో తాజ్ రెండో స్థానంలో నిలిచిందని బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది.

డిపాజిట్ రేట్లు తగ్గాల్సిందే : ఖారా

న్యూఢిల్లీ: దేశంలో డిపాజిట్లపై వడ్డీరేట్లు ఇప్పటికే పతాక స్థాయికి చేరాయని, మధ్యకాలికంగా తగ్గుముఖం పట్టక తప్పదని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా అన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి ఆర్‌బీఐ రెపోరేట్ల తగ్గింపు ప్రారంభించవచ్చునని ఆయన జోస్యం చెప్పారు. అప్పటికి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి పరిధిలో కనిష్ఠ స్థాయి 4 శాతానికి చేరువ కావచ్చునని ఆయన అన్నారు. గత నెలలో కొన్ని మెచ్యూరిటీలపై ఎఫ్‌డీ రేట్లను ఎస్‌బీఐ 0.75 శాతం మేరకు పెంచింది.

● **ఇన్‌జెనస్‌తో డాక్టర్ రెడ్డీస్ టై అప్**

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ అమెరికా మార్కెట్‌లో కొత్త కేన్సర్ ఔషధాన్ని మార్కెట్ చేయనుంది. ఇందుకోసం కంపెనీ అమెరికా అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఇంక్, ఇన్‌జెనస్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్‌సీ అనే కంపెనీతో ఒక లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఇన్‌జెనస్ ఫార్మా తయారు చేసే సైక్లోఫోస్ఫామైడ్ అనే ఇంజెక్షన్‌ను డాక్టర్ రెడ్డీస్ అమెరికాలో మార్కెట్ చేస్తుంది. డాక్టర్ రెడ్డీస్ ఈ అమ్మకాలపై వచ్చే లాభంలో 50 శాతాన్ని ఇన్‌జెనస్ ఫార్మా కంపెనీకి రాయల్టీగా చెల్లిస్తుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▲	66,150 ▲	95,800 ▲
ముంబై	71,580 ▲	65,570 ▲	88,190 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)


13వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	530
వరంగల్	532	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	133	గోదావరి	139
వరంగల్	133	విజయవాడ	139
కరీంనగర్	133	గుంటూరు	141
మహబూబ్‌నగర్	133	ఒంగోలు	141
కర్నూలు	133	చిత్తూరు	145
విశాఖపట్నం	133		



ఎల్లెడలా ఉల్లాసం... ఉత్సాహం... భావోద్వేగభరిత వాతావరణం నడుమ కొత్త సర్కారు కొలువు తీరింది. 'నారా చంద్రబాబు నాయుడు అనే నేను...' అనే మాటతో సంబరం అంబరాన్నంటింది.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు... జనసేన అధిపతి కొణిదెల పవన్ కల్యాణ్‌తోసహా 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

కేంద్రంలో చంద్రబాబుకు దక్కిన ప్రాధాన్యానికి నిదర్శనంగా... ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితరులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు.

వేదికపై మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.బాలకృష్ణ తనదైన శైలిలో వేదికపై సందడి చేశారు.

నవ్యాంధ్రలో నవశకం





మోదీ.. బాబు ఉల్లాసంగా కబుర్లు

మంత్రివర్గ ప్రమాణ స్వీకార వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఉల్లాసంగా కబుర్లు చెప్పుకొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపై మోదీ, చంద్రబాబు ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే సమయంలో సుమారు ముప్పావు గంటపాటు ఇరువురూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తన కుటుంబంతో కలిసి చంద్రబాబు ప్రధానితో గ్రూప్ ఫొటో దిగారు.

పవన్ ప్రమాణం...

చంద్రబాబు అనంతరం ప్రాధాన్య క్రమంలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. 'కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను' అంటూ పవన్ పలకగానే సభావేదిక మొత్తం ఒక్కసారిగా హోరెత్తింది. పదేళ్ల కష్టం, గత ఐదేళ్ల పోరాటానికి ఫలితం దక్కిందనే ఆనందం జనసైనికుల్లో తాండవించింది. ఆయన ప్రమాణ స్వీకారం పూర్తి చేసిన వెంటనే మోదీ వద్దకు వెళ్లి నమస్కారం చేశారు. అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కారం చేశారు. పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అక్కడ నుంచి పవన్ నేరుగా విశిష్ట అతిథుల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. వేదికపైనే ఉన్న తన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవికి పాదాభివందనం చేశారు. తమ్ముడిని అన్నయ్య ఆప్యాయ ఆలింగనం చేసుకున్నారు. సభా ప్రాంగణంలో ఆసీనులైన 'మెగా ఫ్యామిలీ' మొత్తం ఈ క్షణాలను ఆనందంగా ఆస్వాదించింది.

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. జాతీయ గీతాలాపన అనంతరం.. చంద్రబాబుతో ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రారంభమైంది. "నారా చంద్రబాబు నాయుడు అనే నేను" అనగానే సభా ప్రాంగణం మొత్తం హర్షధ్వానాలతో దద్దరిల్లింది. అభిమానులు, ప్రజలు, కార్యకర్తలు కుర్చీల్లోంచి లేచి నిల్చుని చప్పట్లతో తమ ఆనందం వ్యక్తం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం పూర్తయేదాకా చప్పట్లు మోగుతూనే ఉన్నాయి. నందమూరి, నారా కుటుంబ సభ్యులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. నందమూరి రామకృష్ణ మరింత పిడికిలి బిగించిన చెయ్యి పైకెత్తి తన ఉద్వేగం, ఉత్సాహం ప్రదర్శించారు. చంద్రబాబు గంభీరమైన స్వరం, గర్జన తరహాలో ప్రమాణ పాఠాన్ని చదివారు. కొన్ని పదాలను ప్రత్యేకంగా నొక్కి పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం చంద్రబాబు నేరుగా నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి అభివాదం చేశారు. మోదీ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని భుజం తట్టారు. ఆ సమయంలో ఇటు ప్రధాని, అటు చంద్రబాబులో హుషారు, ఆనందం తొణికిసలాడాయి. అనంతరం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులకు చంద్రబాబు నమస్కారం చేశారు. అక్కడ నుంచి నేరుగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మెగాస్టార్ చిరంజీవి, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ దంపతులు, ఇతర అతిథులకు అభివాదం చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రతి ఒక్కరూ కళ్లు అర్పకుండా చూశారు. "ఇదే కదా మేం కోరుకున్నది. ఈ క్షణం కోసమే వేచి ఉన్నది' అనే ఆనందం అందరిలో కనిపించింది.



నారా లోకేశ్ అనే నేను..

చంద్రబాబు, పవన్ తర్వాత నారా లోకేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే కార్యకర్తలు, నాయకులు హర్షధ్వానాలతో హోరెత్తించారు. ఆ సమయంలో లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నందమూరి, నారా కుటుంబ సభ్యులు ఉద్వేగంగా కనిపించారు.



మీ తమ్ముడు గట్టివాడు!

పవన్ కల్యాణ్ గురించి చిరంజీవితో ప్రధాని మోదీ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): "మీ తమ్ముడు గట్టివాడు" అంటూ ప్రధాని నరేంద్ర మోదీ.. జనసేనాని పవన్ కల్యాణ్ గురించి మెగాస్టార్ చిరంజీవితో వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేశారు. ఆ వెంటనే మోదీ ఇద్దరినీ అభినందించారు. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్.. ప్రధాని మోదీని తన అన్నయ్య చిరంజీవి వద్దకు తీసుకువెళ్లారు. చిరంజీవిని చూడగానే మోదీ ఆప్యాయంగా పలకించారు. ఇద్దరినీ వేదిక ముందుకు తీసుకువచ్చి, ఇద్దరి చేతులు పైకి ఎత్తే అందరికీ అభివాదం చేశారు. పవన్ కల్యాణ్ గురించి చిరంజీవికి వివరిస్తూ "మీ తమ్ముడు గట్టివాడు" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇది విన్న చిరంజీవి వెంటనే తన తమ్ముడు గడ్డాన్ని ఆప్యాయంగా నిమిరి మురిసిపోయారు. ఈ సంఘటన చూసిన మెగా కుటుంబ సభ్యులు, అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

అచ్చెన్నాయుడు నుంచి వరుసగా...

చంద్రబాబు, పవన్, లోకేశ్ తర్వాత కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన దైవ సాక్షిగా చెయ్యి ఎత్తి మరీ ప్రమాణం చేశారు. కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకార సమయంలో కాస్త హడావిడిగా కనిపించారు. గవర్నర్‌తో సంబంధం లేకుండా ఆయన ముందుగానే రాజ్యాంగ ప్రమాణ పత్రాన్ని చదవడం ప్రారంభించారు. దీంతో వెంటనే మైక్ కట్ చేశారు. ఆ తర్వాత గవర్నర్ అనుమతితో ప్రమాణం పూర్తి చేశారు. అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేల నాదెండ్ల మనోహర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మోదీ, చంద్రబాబుకు నమస్కారం చేశారు. పవన్ కల్యాణ్ ఆయనను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ఆ తర్వాత... నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.నారాయణ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత వరుసగా వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రాంనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, డోల బాల వీరాంజనేయులు, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తెలుగులో 'దేవుడి సాక్షిగా' ప్రమాణస్వీకారం చేశారు. ఫరూక్ 'అల్లా సాక్షి'గా అని ప్రమాణం చేశారు. కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. అనంతరం సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

ఆరు నిమిషాలు ఆలస్యంగా...

ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ.. వీవీఐపీల రాకలో జాప్యంతో ఆరు నిమిషాలు ఆలస్యంగా 11.33 గంటలకు ప్రారంభమైంది. కార్యక్రమం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో కలిసి సీఎం చంద్రబాబు, కొత్త మంత్రులు గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం మోదీని చంద్రబాబు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. పవన్‌తో కలిసి వెంకటేశ్వరస్వామి ప్రతిమను మోదీకి బహూకరించారు. తిరిగి జాతీయ గీతాలాపనతో కార్యక్రమం లాంఛనంగా ముగిసింది.

ఏపీ మంత్రులు వీరే...

తెలుగుదేశం

1. నారా లోకేశ్ (మంగళగిరి)
2. కింజారపు అచ్చెన్నాయుడు (టెక్కలి)
3. కొల్లు రవీంద్ర (బందరు)
4. పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ)
5. వంగలపూడి అనిత (పాయకరావుపేట)
6. నిమ్మల రామానాయుడు (పాలకొల్లు)
7. ఎన్ఎండీ ఫరూక్ (నంద్యాల)
8. ఆనం రామనారాయణ రెడ్డి (ఆత్మకూరు)
9. పయ్యావుల కేశవ్ (ఉరవకొండ)
10. అనగాని సత్యప్రసాద్ (రేపల్లె)
11. కొలుసు పార్థసారథి (నూజివీడు)
12. డోలా బాల వీరాంజనేయ స్వామి (కొండపి)
13. గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి)
14. గుమ్మడి సంధ్యారాణి (సాలూరు)
15. బీసీ జనార్దన రెడ్డి (బనగానపల్లి)
16. టీజీ భరత్ (కర్నూలు)
17. ఎస్.సవిత (పెనుకొండ)
18. కొండపల్లి శ్రీనివాస్ (గజపతినగరం)
19. ఎం.రాంప్రసాద్ రెడ్డి (రాయచోటి)
20. వాసంశెట్టి సుభాష్ (రామచంద్రాపురం)

జనసేన

1. పవన్ కల్యాణ్ (పిఠాపురం)
2. నాదెండ్ల మనోహర్ (తెనాలి)
3. కందుల దుర్గేశ్ (నిడదవోలు)

బీజేపీ

1. సత్యకుమార్ యాదవ్ (ధర్మవరం)



తరలివచ్చిన అతిరథులు

చంద్రబాబుప్రమాణ స్వీకారోత్సవానికి అతిరథమహారథులంతా హాజరయ్యారు. వారిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అథావలే, అనుప్రియ పటేల్, చిరాగ్ పాశ్వాన్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు ఉన్నారు.

దద్దరిల్లిన సభాప్రాంగణం..

నారా చంద్రబాబు అనే నేను అంటూ చంద్రబాబు ప్రమాణ స్వీకారం మొదలుపెట్టిన వెంటనే సభికుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఆయన ఎంత బిగ్గరగా ప్రమాణం చేస్తున్నా అభిమానుల కేకలు, ఈలల మధ్య ఆయన మాటలు కొద్దిసేపు వినబడలేదు.

నేడు సచివాలయంలోకి బాబు

మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ రద్దు సహా

ఐదు అంశాలపై సీఎం తొలి సంతకాలు

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా పదవీప్రమాణం చేసిన చంద్రబాబు రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో గురువారం అడుగు పెట్టనున్నారు. సాయంత్రం 4.41 గంటలకు ఆయన తన చాంబర్లో అడుగు పెట్టి బాధ్యతలు స్వీకరిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మెగా డీఎస్సీ సహా ఐదు అంశాలపై ఆయన తన తొలి సంతకాలు చేయనున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహణపై మొదటి సంతకం చేస్తానని ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు ప్రకటించారు. ఆ మాట నిలబెట్టుకోనున్నారు. రెండో సంతకం లాండ్ టైటిలింగ్ చట్టం ఉపసంహరణపై చేయననున్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక పింఛన్లను ఇప్పుడున్న రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచే ఫైలుపై మూడో సంతకం చేస్తారు. ఉపాధి కల్పనకు సంబంధించి వివిధ స్కిల్స్ ఉన్న వారి వివరాల సేకరణకు సంబంధించిన స్కిల్ సెన్సస్ నిర్వహణపై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం ఆయన చేస్తారని టీడీపీ వర్గాలు వివరించాయి.



నాలుగోసారి ముఖ్యమంత్రిగా

తన రాజకీయ జీవితంలో నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మొదటిసారి 1995లో, తర్వాత 1999లో రెండోసారి సీఎంగా ప్రమాణం చేశారు. 2014లో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా మూడోసారి, ఐదేళ్ల విరామం తర్వాత ఇప్పుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు.


ప్రత్యేక బస్సులో వస్తున్న సురేఖ, నాగబాబు, శ్రీజ, సాయిధరమ్‌తేజ్, నిహారిక


రజనీకాంత్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రధాని మోదీ


ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా వసుంధర, బ్రాహ్మణి, దేవాన్ష్, తేజస్విని తదితరులు

కొత్తతరానికి అందలం..

సీనియర్లకూ ప్రాధాన్యం

మొత్తంగా సామాజిక సమతౌల్యం!.. మంత్రివర్గం కూర్పులో చంద్రబాబు నేర్పు

- 17 మందికి తొలిసారి క్యాబినెట్‌లో చోటు
- యనమల, అయ్యన్నలకు దక్కని పదవులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పార్టీలోని కొత్త తరానికి అధికార అందలమెక్కించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గ బృందాన్ని ఎంపిక చేసుకున్నారు. 24 మంది మంత్రులతో కలిసి ఆయన బుధవారం పదవీ ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. సీనియర్లకు తగిన ప్రాధాన్యం ఇస్తూనే కొత్త తరానికి అధిక స్థానాలు కేటాయించారు. మంత్రివర్గంలో 17 మంది మొదటిసారి మంత్రి పదవులు అందుకోవడం విశేషం. గతంలో మంత్రులుగా పనిచేసినవారు కొత్త క్యాబినెట్‌లో కేవలం ఏడుగురే ఉన్నారు. మంత్రుల్లో పది మంది తొలిసారి అసెంబ్లీలో కాలు మోపుతుండడం మరో విశేషం. వీరిలో పవన్ కల్యాణ్, వాసంశెట్టి సుభాష్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, టీజీ భరత్, సవిత, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ చట్టసభలకు మొదటిసారి ఎన్నికయ్యారు. లోకేశ్, కందుల దుర్గేశ్, గుమ్మిడి సంధ్యారాణి గతంలో ఎమ్మెల్సీలుగా పనిచేశారు. ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలోకి అడుగు పెట్టడం మాత్రం ఇదే ప్రథమం. మరో 8 మంది మంత్రులు గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసినా అమాత్య పదవులు అందుకోవడం ఇదే మొదటిసారి. వీరిలో పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవి కుమార్, బీసీ జనార్థన్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేలుగా చేశారు గానీ.. మంత్రులు కాలేదు. ఇక క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, లోకేశ్ గతంలోనూ మంత్రులుగా పనిచేశారు. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న పార్టీకి భావి నాయకత్వాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా కొత్త తరానికి టీడీపీ అధినేత అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రయత్నంలో కొందరు సీనియర్లు అవకాశం కోల్పోయారు. కేశవ్, గొట్టిపాటి రవికి చోటు దక్కడంతో అదే సామాజిక వర్గంలో సీనియర్ బుచ్చయ్య చౌదరికి చోటు దక్కలేదు. శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి యువ నేత సుభాష్‌కు చోటు దక్కడంతో సీనియర్ నేత పితాని సత్యనారాయణ అవకాశం కోల్పోయారు. యాదవ సామాజిక వర్గం నుంచి సుదీర్ఘ కాలంగా సీనియర్ నేత యనమల రామకృష్ణుడికి మంత్రి పదవి దక్కలేదు. ఈసారి ఆ వర్గం నుంచి సత్య కుమార్, కొలుసు పార్థసారథికి చాన్సు ఇచ్చారు. కొప్పుల వెలమ నుంచి కేంద్రంలో రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రంలో అచ్చెన్నాయుడికి అవకాశం ఇవ్వడంతో అదే వర్గానికి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి చాన్సు రాలేదు.

3 జిల్లాలకు అధిక ప్రాధాన్యం

ఉమ్మడి జిల్లలవారీగా చూసినప్పుడు గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలకు మంత్రివర్గంలో అధిక ప్రాధాన్యం లభించింది. ఈ మూడు జిల్లాల నుంచి ముగ్గురేసి చొప్పున మంత్రులయ్యారు. రాయలసీమలో ఉమ్మడి కడప జిల్లా నుంచి ఒకరికి ప్రాతినిధ్యం లభించగా.. చిత్తూరు జిల్లా నుంచి చంద్రబాబు మినహా ఎవరికీ చోటు దక్కలేదు. నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాల నుంచి ఇద్దరేసి ఎమ్మెల్యేలకు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఒక్కొక్కరికి చోటు లభించింది.

వేధింపులకు గురైన వారికి పదవులు

జగన్ ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురై జైళ్లకు వెళ్లినవారు.. కేసుల్లో ఇరుక్కున్న బాధిత నేతలకు మంత్రివర్గంలో స్థానం లభించడం విశేషం. వీరిలో అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దనరెడ్డి అరెస్టయి జైళ్లకు కూడా వెళ్లారు. నారాయణపై అనేక కేసులు నమోదైనా ఆయన అరెస్టు కాలేదు. న్యాయస్థానాల్లో ఆయనకు ఉపశమనం లభించింది. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కూడా కేసుల్లో ఇరుక్కుని వేధింపులకు గురయ్యారు. ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డిపైనా పలు కేసులు బనాయించారు. ఇలా ప్రభుత్వ వేధింపులకు గురైన వారిలో కొంత మందికి మంత్రివర్గంలో చోటిచ్చారు.



మంత్రులతో భేటీ అయిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

బడుగులకు పెద్ద పీట

చంద్రబాబు తన మంత్రివర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం 24 మంది మంత్రుల్లో 8 మంది బీసీలే. అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్, వాసంశెట్టి సుభాష్, సవిత, కొల్లు రవీంద్రలకు అవకాశమిచ్చారు. ఎస్సీల నుంచి వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్టీల నుంచి గుమ్మడి సంధ్యారాణి, ముస్లింల నుంచి ఎన్ఎండీ ఫరూక్‌లకు చోటు దక్కింది. వీరితో కలిపి మొత్తం క్యాబినెట్‌లో సగం మంది బలహీన వర్గాలకు చెందినవారే ఉండడం విశేషం.

కమ్మ, కాపు 4-రెడ్డి-3

కమ్మ సామాజిక వర్గం నుంచి నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వీరిలో లోకేశ్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ (టీడీపీ), నాదెండ్ల మనోహర్ (జనసేన) ఉన్నారు. కాపు సామాజిక వర్గం నుంచి నారాయణ, నిమ్మల రామానాయుడు (టీడీపీ), పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్ (జనసేన) ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దనరెడ్డి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఐదుగురు ఉండగా.. బాబు క్యాబినెట్‌లో ముగ్గురు ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి అప్పుడు ఒకరే ఉండగా ఇప్పుడు నలుగురు ఉన్నారు. కాపు సామాజిక వర్గం నుంచి అప్పుడు, ఇప్పుడు నలుగురే. ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి కూడా రెండు ప్రభుత్వాల్లోనూ ఒకరు చొప్పునే ఉన్నారు. ఇప్పుడు ఈ వర్గం నుంచి మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కుమారుడు టీజీ భరత్‌ను ఎంపిక చేశారు. జగన్ మంత్రివర్గంలో ఏడుగురు బీసీలు ఉండగా.. ఇప్పుడు 8 మంది ఉన్నారు.

తిరుమలకు చంద్రబాబు



తిరుమలలో ప్రజలకు అభివాదం చేస్తున్న బాబు

తిరుమల (ఆంధ్రజ్యోతి), గన్నవరం, జూన్ 12: ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం ఉండవల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి పయనమయ్యారు. గన్నవరం విమానాశ్రయంలో టీడీపీ నాయకులు, అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి 8.54 గంటలకు సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌లతో కలిసి చంద్రబాబు తిరుమలలోని గాయత్రి నిలయం అతిథిగృహానికి చేరుకున్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిశోర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలో బస చేసిన చంద్రబాబు గురువారం ఉదయం సంప్రదాయ వస్త్రధారణతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తిరుపతి విమానాశ్రయం నుంచి ఘాట్‌రోడ్డు, తిరుమలలోని అతిథిగృహం, శ్రీవారి ఆలయం, కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

కరెంటు కమిషన్‌కు అజయ్‌మిశ్రా వివరణ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్‌కేంద్రాల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్‌కు బుధవారం ఇంధన శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. యాదాద్రి నిర్మాణం కీలకదశలో ఉన్న సమయంలో అజయ్‌మిశ్రా ఇంధనశాఖ బాధ్యతలు చూస్తుండేవారు. ఆ కారణంగానే కమిషన్ ఆయనకు నోటీసులు ఇవ్వగా... యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంతో తనకెలాంటి సంబంధం లేదని, అదంతా ఉన్నతస్థాయిలో తీసుకున్న నిర్ణయమని అజయ్‌మిశ్రా వివరణ ఇచ్చినట్లు సమాచారం. కమిషన్ నోటీసులు ఇచ్చిన 25 మందిలో ఇప్పటివరకూ మాజీ సీఎం కేసీఆర్ తప్ప అందరూ వివరణ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీలోగా వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు కమిషన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

రఘునందన్‌కు హరీశ్ అభినందన



ఎంపీ రఘునందన్‌ను అభినందిస్తున్న హరీశ్

సిద్దిపేటక్రైం, జూన్ 12: మెదక్ ఎంపీగా గెలిచిన రఘునందన్ రావును మాజీమంత్రి హరీశ్‌రావు అభినందించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఒకరిపై ఒకరు విమర్శల వర్షం కురిపించుకున్నారు. అయితే బుధవారం వారిద్దరు ఎదురుపడినప్పుడు భిన్న వాతావరణం కనిపించింది. సిద్దిపేటలోని శరభేశ్వరాలయంలో అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం శివపార్వతుల కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు తారసపడగా ఆత్మీయంగా చిరునవ్వులు చిందిస్తూ పలకరించుకున్నారు. హరీశ్ రఘునందన్‌ను అభినందించారు.

అగ్నిమాపకశాఖకు రూ.190.14 కోట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు కేంద్ర 15వ ఆర్థిక సంఘం రూ. 190.14 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ రూ. 142.61 కోట్లు కాగా రాష్ట్ర వాటా రూ. 47.53 కోట్లు ఉంది. డీజీ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ హోంగార్డ్స్ వివేక్ వత్సల్య, రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై. నాగిరెడ్డి ఢిల్లీలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో అవగాహనా ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేశారు. ఈ నిధులతో ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 18 కొత్త ఫైర్ స్టేషన్లలో అత్యాధునిక అగ్నిమాపక వాహనాలు, పరికరాల కొనుగోలు చేయనున్నారు.

ప్రతీ కేసులో ప్రతివాదిగా సీఎస్ వద్దు: ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కేసులో ప్రతివాది(రెస్పాండెంట్)గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని చేర్చడం తగదని, ప్రధాన కార్యదర్శికి ఏ మాత్రం సంబంధం లేని కేసుల నుంచి సీఎస్‌ను తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను కోరింది. ఈమేరకు వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్యకార్యదర్శులు/కార్యదర్శులు/ప్రత్యేక కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ కేసులో ప్రతివాదిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉండటంతో సీఎస్‌లను న్యాయస్థానాలు కోర్టుకు ఈడ్చుతున్నాయని, గత పదేళ్లుగా రాజ్యాంగంలోని ఆర్టికల్-166 ప్రకారం జారీ చేసిన బిజినెస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఈ విధానం కొనసాగుతోందని గుర్తించారు. దాంతో తక్షణమే ఆయా కేసుల్లో, అందులోనూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏ మాత్రం సంబంధం లేని కేసుల నుంచి ప్రతివాదిగా తొలగించడానికి వీలుగా అడ్వకేట్ జనరల్(ఏజీ), ప్రభుత్వ న్యాయవాదులు(జీపీ)లతో సంప్రదింపులు జరిపి... హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసి తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

సీఎం రేవంత్ పేద విద్యార్థులకు దేవుడు

- ఓయూ విద్యార్థి నేతలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఓయూ విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ విద్యార్థి నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ పదేళ్ల పాలనలో రేషనలైజేషన్ పేరిట 4 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం రేవంత్ రూ. 2వేల కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాల నేపథ్యం నుంచే వచ్చిన సీఎం ఆ స్కూళ్ల అభివృద్ధికి పాటు పడుతున్నారని అన్నారు. అనంతరం విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నేత మానవతారాయ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ పేద విద్యార్థుల పాలిట దేవుడని అన్నారు.



నాసా కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థులకు బహుమతులు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు అదరగొట్టారని శ్రీ చైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ చెప్పారు. ప్రపంచ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలల నుంచి 167 మంది విద్యార్థులు ఎంపికై పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు సుమారు 30 దేశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారని, ఏ ఇతర దేశ విద్యాసంస్థ నుంచి ఇంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు కాన్ఫరెన్స్‌కు హాజరుకాలేదని ఆమె చెప్పారు. భారతదేశం నుంచి 28 వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో తమ సంస్థకు చెందిన విద్యార్థులే 62 విన్నింగ్ ప్రాజెక్టులను గెలుచుకున్నట్టు సీమ తెలిపారు.



ప్రమాణ స్వీకార వేదికపై తమిళిసైకి వేలు చూపించి మాట్లాడుతున్న షా

తమిళిసైకి అమిత్ షా క్లాస్!

- ఏదోటి మాట్లాడి కొత్త పంచాయితీ పెట్టొద్దని వారింపు
- వేలు చూపిస్తూ గట్టిగా మందలించిన వీడియో వైరల్

చెన్నై/అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమ వేదికపై జరిగిన ఒక ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల మాజీ గవర్నర్, బీజేపీ నాయకురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. బుధవారం ఉదయం ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన తమిళిసై.. వేదికపై కూర్చున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అమిత్‌షాకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అయితే అమిత్‌షా ఆమెను వెనక్కి పిలిచి, వేలు చూపిస్తూ గట్టిగా మందలించడం కనిపించింది. ఈ సమయంలో తమిళిసై నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆయన పట్టించుకోలేదు. దాంతో ఆమె ఆయన మాటలకు 'సరే' అన్నట్లుగా తలూపుతూ, వేదికపై వున్న వారికి నమస్కరిస్తూ తనకు కేటాయించిన కుర్చీలో కూర్చున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ తమిళనాడు శాఖలో చిచ్చు రేగింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షులు తమిళిసై, పొన్ రాధాకృష్ణన్, ఎల్.మురుగన్ తదితరులంతా ఓటమి పాలయ్యారు. తమిళిసై మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో అన్నామలై వ్యూహరచన సరిగ్గా లేదని, అన్నాడీఎంకేతో పొత్తు ఉంటే తమ పార్టీ విజయం సాధించేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తమిళిసైని అమిత్‌షా హెచ్చరించి ఉంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.



బాబు ప్రమాణ స్వీకారానికి విదేశీ ప్రతినిధులు

- 10 దేశాల కాన్సుల్ అధికారులు హాజరు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధుల నుంచి కూడా అభినందనలు అందాయి. బుధవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో విదేశీ కాన్సులేట్ కార్యాలయాల ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. సాధారణంగా ప్రధానుల ప్రమాణ స్వీకారోత్సవానికి విదేశీ ప్రతినిధులు హాజరవుతుంటారు. ముఖ్యమంత్రుల ప్రమాణానికి దేశీయ ప్రతినిధులు తప్ప విదేశీ ప్రతినిధులు, కాన్సుల్ అధికారులు కనిపించడం అరుదు. కానీ, చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి 10 దేశాలకు చెందిన కాన్సుల్ జనరల్ అధికారులు, విదేశీ ప్రతినిధులు తరలివచ్చారు. భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెడ్ జె. స్నేహజ విదేశీ ప్రతినిధులను సమన్వయం చేశారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తూర్పు జయారెడ్డి నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన యూత్ కాంగ్రెస్

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి కుమార్తె, యూత్ కాంగ్రెస్ నేత తూర్పు జయారెడ్డి.. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. తన తండ్రితో పాటుగా ఎవరి సిఫారసు లేకుండా.. పార్టీకి, యూత్ కాంగ్రెస్‌కు తాను అందించిన సేవల ద్వారానే ఆమె నియమితులు కావడం గమనార్హం. 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు జగ్గారెడ్డి అరెస్టు కాగా.. ఆయన తరఫున సంగారెడ్డి నియోజకవర్గంలో జయారెడ్డి విస్తృతంగా పర్యటించి.. తండ్రి విజయంలో తన వంతు పాత్ర పోషించారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం పలు కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. కొద్ది సంవత్సరాలుగా ఆమె యూత్ కాంగ్రెస్‌లో కార్యదర్శి హోదాలో చురుకుగా పాల్గొంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక యూత్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించినందుకు, యూత్ కాంగ్రెస్ ఇచ్చిన కార్యక్రమాలు అమలు చేయడంలో ముందు వరుసలో ఉన్నందున ఆమెను యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. ఈ సందర్భంగా జయారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు.



రుణమాఫీపై ప్రణాళిక!

(మొదటిపేజీ తరువాయి)

ఉపశమనం కలిగేలా ఆ పథకాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు.. రుణమాఫీ విధివిధానాలను ఖరారు చేసేందుకు వారం రోజుల్లో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రైతులకు ఇచ్చిన హామీమేరకు.. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇటీవలే వ్యవసాయశాఖ, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరం? నిధుల సమీకరణకు ఉన్న మార్గాలు, అందు బాటులో ఉన్న వనరులన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు రుణమాఫీ అమలుకు ఏ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలనే అంశంపైనా ఇంకా స్పష్టత రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబరు ఏడో తేదీని (2023) కటాఫ్‌గా తీసుకుంటారా? మహాలక్ష్మి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన డిసెంబరు తొమ్మిదిని తీసుకుంటారా? వచ్చే ఆగస్టు 15 తేదీ వరకున్న బకాయిలను కూడా తీసుకుంటారా? అనే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. పెద్ద రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలా? వద్దా? అనే అంశంపైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హులైన రైతులకు కేంద్రం ఏటా రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. మంత్రులు, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర-రాష్ట్ర ఉద్యోగులు, రూ.10 వేలకు మించి పెన్షన్ అందుకునే రిటైర్డ్ ఉద్యోగులు, ఐటీ పన్ను చెల్లించేవారు, డాక్టర్లు, ఇంజనీర్లు, సీఏ, ఆర్కిటెక్ట్ లాంటి ప్రొఫెషనల్స్‌ను పీఎం-కిసాన్ పథకం నుంచి కేంద్రం మినహాయించింది. ఆ పథకానికి కేంద్రం అనుసరించిన మార్గదర్శకాల వల్ల అసలైన రైతులకు లబ్ధి చేకూర్చిందనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలోనే.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకూ మేలు జరిగేలా రుణమాఫీ అమలుకు ఎలాంటి మార్గదర్శకాలు పాటించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కసరత్తు చేస్తోంది. గతంలో జరిగిన రుణమాఫీ అమలు తీరును పరిశీలించడంతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ అమలుకు అనుసరించిన విధివిధానాలపై వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఉదాహరణకు.. మహారాష్ట్రలో సహకారశాఖను నోడల్ ఏజెన్సీగా పెట్టి రూ.2 లక్షల వరకూ ఉన్న అన్ని రుణాలూ కలిపి రూ.20 వేల కోట్ల మేర పంట రుణాలు మాఫీ చేశారు. డబ్బును నేరుగా రైతుల రుణ ఖాతాల్లో జమచేసి రుణవిముక్తులను చేశారు. నిర్దేశిత గడువు(కటాఫ్ తేదీ)లో అప్పు తీసుకున్న రైతులు పెద్ద రైతులా? చిన్నరైతులా? అని చూడకుండా అసలు, వడ్డీ కలిపి రూ. 2 లక్షల వరకు మాఫీచేశారు. రాజస్థాన్‌లో రైతు రుణ ఉపశమన కమిషన్ ఏర్పాటుచేసి అక్కడే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్టర్డ్ బ్యాంకు, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతులకు రుణమాఫీ చేశారు. వీటిలో ఏ రాష్ట్ర మోడల్‌ను ఇక్కడ పరిగణనలోకి తీసుకుని అమలు చేస్తారో తేలాల్సి ఉంది.



ధరణి పెండింగ్ దరఖాస్తులపై వీడియో కాన్ఫరెన్స్

- 14న జిల్లాల వారీగా కలెక్టర్ల భేటీ

ధరణి సమస్యలపై ప్రభుత్వం మరోమారు దృష్టి సారించింది. ఏ జిల్లాలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? తాజా దరఖాస్తుల పరిస్థితి ఏమిటి? స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన వాటిలో ఎన్ని పరిశీలించారు? ఇలా ధరణి సమస్యల సమగ్ర వివరాలు, వాటిని పరిష్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలపై సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఈ నెల 14న జిల్లాల వారీగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు హాజరుకానున్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేసేందుకు, వాటి పరిష్కారానికి తీసుకోనున్న చర్యలపై చర్చించనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఉదయం 10:30 నుంచి 11:30 వరకు ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కలెక్టర్లు హాజరు కానున్నారు. 11.30 నుంచి 12.30 గంటల వరకు అదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. 2 గంటల నుంచి 3 గంటల వరకు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల కలెక్టర్లు, 3 నుంచి 4 గంటల వరకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల కలెక్టర్లు, 4 గంటల నుంచి 5 గంటల వరకు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, భువనగిరి జిల్లా కలెక్టర్లతో సీసీఎల్ఏ సమావేశం నిర్వహించనున్నారు.

పంటల నమోదుకు డిజిటల్ సర్వే

- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పంటల నమోదు ప్రక్రియను మ్యానువల్‌గా కాకుండా డిజిటల్ పద్ధతిలో చేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పంటల నమోదును డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని, ప్రతి ఫీల్డులో సాగుచేసిన పంట ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలు రావటంతో.. రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ అంశంపై దృష్టిసారించింది. కొంతకాలంగా క్రాప్ బుకింగ్ ప్రక్రియను రాష్ట్రంలో పకడ్బందీగా చేస్తున్నారు. ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి.. ఏ సర్వే నెంబరులో ఏ పంట వేశారు? రైతుల వివరాలు, పంటల వివరాలు సేకరించి క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం పంటల నమోదును డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని, ప్రతి సర్వే నెంబరులో, ప్రతి ఫీల్డులో సాగుచేసిన పంటల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది.

జీవో 317పై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

- జూన్ 14-30 వరకు దరఖాస్తులకు అవకాశం
- 12 వేల అర్జీలకు రీ వెరిఫికేషన్

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటుకు సంబంధించిన జీవో 317పై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. కమిటీ చైర్మన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను సబ్ కమిటీ ప్రకటించింది. దరఖాస్తు చేసుకునే ఉద్యోగులకు జూన్ 14 నుంచి జూన్ 30 వరకు అవకాశం కల్పించారు. అలాగే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను లోకల్ స్టేటస్ ఆప్షన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య, భర్తలకు కూడా ఆప్షన్ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు రశీదు ఇస్తారు. ఇప్పటివరకు 12వేల దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా స్వీకరించామని, ఈ దరఖాస్తులను రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించామని సమావేశం అనంతరం కమిటీ తెలిపింది.

సీఎం రేవంత్ దాతృత్వం

- వేదవల్లి తండ్రికి రూ.5 లక్షల ఎల్‌వోసీ అందజేత
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చిన్నారి వేదవల్లి తండ్రి రఘుకు ఎల్‌వోసీ అందజేస్తున్న సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న చిన్నారి వేదవల్లి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయతను చూపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ప్లీజ్ నా బిడ్డను ఆదుకోండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సీఎం స్పందించారు. రూ.5లక్షల వరకు చికిత్స వ్యయాన్ని భరించడానికి ముందుకొచ్చారు. వేదవల్లి తొందరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు చిన్నారి వేదవల్లి తండ్రి రఘుకు బుధవారం ఎల్‌వోసీ అందజేశారు. అలాగే చిన్నారి వేదవల్లి వైద్య చికిత్సకు పలువురు దాతలు సాయం చేశారు. ఆంధ్రజ్యోతిలో కథనం చూసి పలువురు దాతలు తనకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇచ్చారని చిన్నారి తండ్రి రఘు చెప్పారు. తనకు సాయం అందించిన సీఎంకు, దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోడు భూమిని తీసుకుంటే ఉరేసుకుంటా!

- అధికారులతో చెప్పిన పోడు రైతు.. అన్నంత పనీ చేశాడు
- తన భూమి పోతోందన్న బాధతో రైతు బలవన్మరణం



కుర్ర కన్న (ఫైల్)

మిర్యాలగూడ, జూన్ 12: అతడో పేద రైతు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ రైతు కుటుంబానికి రెండెకరాల పోడు భూమే జీవనాధారం. ఆరేళ్లుగా సాగు చేసుకుంటూ బతుకుబండి లాగిస్తున్నాడు. ఇటీవల ఆ భూమి తమ పరిధిలోకి వస్తుందంటూ అటవీ అధికారులు చెప్పడంతో.. ఆ రైతు గుండె ఆగినంతపనైంది. తన కుటుంబానికి దిక్కుగా ఉన్న ఆ భూమిని తీసుకుంటే.. తాను బతకలేనని, ఉరేసుకుంటానని చెప్పిన ఆ రైతు అన్నంత పని చేశాడు. బుధవారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బంగారికుంటతండాలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంగారికుంట తండా మొల్కచర్ల రెవెన్యూ శివారులోని 20 ఎకరాల్లో 15 కుటుంబాలు ఆరేళ్లుగా పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. ఇదే తండాకు చెందిన కుర్ర కన్న (58) రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. అటవీ శాఖ అధికారులు ఇటీవల ఆ ప్రాంతంలోని పోడు భూములను తమ శాఖకు చెందిన భూములుగా గుర్తించి వాటిలో మొక్కలు నాటేందుకు యత్నిస్తున్నారు. మంగళవారం అటవీ అధికారులు రాగా.. తన భూమి మీదకు వస్తే తాను ఉరి వేసుకుంటానని వారితో కన్న అన్నాడు. దీంతో వెనుదిరిగిన అటవీశాఖ సిబ్బంది బుధవారం ఉదయం పోలీసుల సహాయంతో మొల్కచర్ల రెవెన్యూ శివారు ప్రాంతానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో కన్న పక్క రైతు పోడు భూమిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో తన భూమిలో కూడా మొక్కలు నాటుతారని, తాను జీవనాధారం కోల్పోతానని ఆవేదనతో ఉన్న కన్న కొంత దూరంలో ఉన్న చెట్టు కొమ్మకు తాడుతో ఉరి వేసుకున్నాడు. కన్న మృతదేహాన్ని మిర్యాలగూడకు తీసుకువెళ్లిన బంధువులు.. అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టేందుకు యత్నించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

యువతులతో డేటింగ్ పేరుతో మోసాలు!

- టెకీలే లక్ష్యంగా ఢిల్లీకి చెందిన ముఠా దోపిడీ
- కుట్రలో హైదరాబాద్, బెంగళూరు పబ్‌లు
- వలపు వలతో టెకీలను పబ్‌లకు పిలిపించుకొని ఖరీదైన మద్యం, భోజనంతో పెద్ద ఎత్తున బిల్లులు
- హైదరాబాద్‌లో బాధితుల నుంచి ఫిర్యాదు
- ముఠా సభ్యులు.. పబ్‌ల నిర్వాహకుల అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ డాక్టర్ వినీత్

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకంగా యువతులను నియమించుకొని.. వారి ఫొటోలతో డేటింగ్ యాప్‌లలో ఖాతాలు సృష్టించి టెకీలను లక్ష్యంగా చేసుకొని వలపు వల విసరడం ద్వారా లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన ముఠా గుట్టును హైదరాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠా దోపిడీకి ఢిల్లీ, బెంగళూరులో పబ్‌ల నిర్వాహకులు సాయం చేయడం విశేషం. గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో కేసు వివరాలను డీసీపీ వినీత్ వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఆకాశ్, సూరజ్, అక్షత్ నరులా, తరుణ్, శివరాజ్ నాయక్, రోహిత్.. ఢిల్లీలో "డెవిల్స్ నైట్ క్లబ్"ను నిర్వహించారు. నష్టాలు రావడంతో మోసాలకు తెరతీశారు. ఉద్యోగాలిప్పిస్తామని ప్రకటనలిచ్చి ఢిల్లీ, యూపీకి చెందిన ఆరుగురు యువతులను నియమించుకున్నారు. వారి ఫొటోలతో, తప్పుడు పేర్లతో టిండర్, బంబుల్ వంటి డేటింగ్ యాప్‌లలో ఖాతాలు తెరిచారు. ముఠాలోని సూరజ్, డేటింగ్ యాప్‌లలో ఐటీ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని అమ్మాయిల పేర్లతో చాటింగ్ చేసేవాడు. వారితో పరిచయం పెంచుకునేవాడు. ముందుగా వారిని కాఫీ షాపుకు పిలిచేవారు అక్కడికి యువతులను పంపేవారు. తర్వాత చాటింగ్‌లో పబ్‌లో కలుద్దామంటూ మాయమాటలు చెప్పి ఒప్పించేవారు. తాము సూచించిన పబ్‌కు వచ్చాక పథకంలో భాగంగా తమ యువతితోనే వచ్చిన టెకీల కోసం ఖరీదైన మద్యం, భోజనం ఆర్డర్ చేయించి రూ. 15 వేల నుంచి రూ. 40 వేల దాకా బిల్లులు వసూలు చేస్తున్నారు. ఇలా ఢిల్లీ, బెంగళూరులోని పబ్‌ల నిర్వాహకుల సాయంతో పలువురిని మోసం చేశారు. వసూలు చేసిన డబ్బును పంచుకునేవారు. ఈ ముఠా ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లలో పలువురిని మోసం చేసింది. నగరంలోని మోష్ పబ్‌లో ఈ తరహా ఘటనలు జరగడంతో, బాధితుల ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముఠాలోని ఆకాష్, సూరజ్, అక్షత్ నరులా, తరుణ్, శివరాజ్ నాయక్, రోహిత్‌తోపాటు మోష్ పబ్ ఈవెంట్ మేనేజర్ చెరుకుపల్లి సాయికుమార్, నిర్వాహకులు తరుణ్, జగదీశ్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 40 లక్షల విలువైన 8 మొబైల్స్, థార్, కియా కార్లు స్వాధీనం చేసుకున్నారు. మోష్ పబ్‌లో ఏప్రిల్ 17 నుంచి మే 30 వరకు 50 నుంచి 60 మంది యువకుల నుంచి 30 లక్షల వరకు వసూలు చేశారు. ఈ ముఠా సభ్యులు 6 వారాలకు మించి ఒకనగరంలో ఉండరని, నాగపూర్‌లో మోసాలు చేసేందుకు వెళ్లినట్లు గుర్తించి అరెస్ట్ చేశామని డీసీపీ తెలిపారు.

85 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం!

- మద్యం మత్తులో ఓ వ్యక్తి ఘాతుకం

చందంపేట, జూన్ 12: మద్యం మత్తులో 85 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టాడో దుర్మార్గుడు. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఈ ఘటన జరిగింది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. ఆమె ముగ్గురు కుమార్తెలకు పెళ్లయి అత్తగారింట్లో ఉంటున్నారు. ఏకైక కుమారుడేమో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అదే గ్రామస్థుడు, తాగుడుకు బానిసై, పనీపాటా లేకుండా ఖాళీగా తిరుగుతున్న చాట్ల బలరామ్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి మద్యం మత్తులో వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి అత్యాచారం జరిపాడు. వృద్ధురాలి అరుపులకు చుట్టుపక్కల వారు రావడంతో బలరామ్ పరారయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం బాధితురాలిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడికి సమాచారమిచ్చారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నిందితుడు బలరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అచ్చంపేట మునిసిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

- బీఆర్ఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

అచ్చంపేట: నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట బీఆర్ఎస్ మునిసిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం నెగ్గింది. మునిసిపాలిటీ కౌన్సిలర్లకు అవిశ్వాస తీర్మానంపై ఎన్నికల అధికారి ఆర్డీవో మాధవి గత నెల 27న నోటీసులు జారీ చేశారు. ఈక్రమంలో అచ్చంపేట మునిసిపల్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. మొత్తం 20 మందికి గానూ 16 మంది సభ్యులు హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కూడా అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. కాగా, మిగిలిన నలుగురు సభ్యులు చైర్మన్ నర్సింహగౌడ్‌తో పాటు కౌన్సిలర్లు రమేశ్ రావు, మనోహర్ ప్రసాద్, ఖాజాబీ గైర్హాజరయ్యారు.

జూలై 14న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పరీక్ష

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్ల(ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్స్)తో పాటు కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి వచ్చేనెల 14న పరీక్ష జరగనుంది. ఈ మేరకు జెన్‌కో షెడ్యూల్ విడుదల చేసింది. జూలై 14న ఉదయం 9 గంటల నుంచి 10:40 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 1 గంట నుంచి 2:40 గంటల దాకా, సాయంత్రం 5 గంటల నుంచి 6:40 గంటల వరకు.. మూడు షిఫ్టుల్లో పరీక్ష జరగనుంది. అభ్యర్థులు http://www.tggenco.com వెబ్‌సైట్ ద్వారా జూలై 3వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జెన్‌కో సీఎండీ అలీ ముర్తుజా రిజ్వీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఎన్టీపీసీలో ఆర్నెల్లపాటు సమ్మెలపై నిషేధం

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీలో సమ్మెలపై ఈనెల 14 నుంచి ఆరునెలల పాటు నిషేధం విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్మా చట్టం ప్రకారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ బుధవారం ఆదేశాలిచ్చారు.

ఆదిత్యనాథ్ నియామకాన్ని రద్దు చేయాలి

- ఆ 5 గ్రామాలు తెలంగాణలో కలపాలి: బీఆర్ఎస్

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇరిగేషన్ సలహాదారుగా ఏపీలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను నియమించడం వెనుక చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని, ఆయన నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు బాల్కసుమన్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బాల్క సుమన్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేయాలన్నారు.

విభజన చట్టంలోని హామీలు నెరవేర్చండి

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు టీపీసీసీ సూచన

పదేళ్లుగా విభజన చట్టంలో ఉన్న హామీలను బీజేపీ అమలు చేయలేదని, తెలంగాణ బిడ్డలుగా బాధ్యత తీసుకుని ఇకనైనా వాటిని నెరవేర్చాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. కుంటి సాకులు చెప్పడానికి ఈసారి వారికి అవకాశం లేదని ఆయన అన్నారు. పసుపు బోర్డు, సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రమంతటా విస్తరించిన రుతుపవనాలు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు బుధవారం తెలంగాణ మొత్తం, ఛత్తీస్‌గఢ్‌లో పలు ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నాయి. కాగా ఉత్తరాంధ్ర మీదుగా తూర్పు, పడమర మధ్య ద్రోణి సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల బుధవారం వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 13 జూన్ 2024

diksuchi@andhrajyothy.com

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలోని లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎల్ఎన్‌సీపీఈ, తిరువనంతపురం)- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) ఇన్నోవేటివ్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(ఎంపీఈఎస్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, కౌన్సెలింగ్, మెడికల్ టెస్ట్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ టెస్ట్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. యూనివర్సిటీ ఎగ్జామ్స్‌లో మంచి మార్కులు సాధించినవారికి నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.



లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజీలో

ఫిజికల్ ఎడ్యుకేషన్

బీపీఈడీ ఇన్నోవేటివ్

● ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో మొత్తం 70 సీట్లు ఉన్నాయి. వీటిలో 28 సీట్లను మహిళలకు కేటాయించారు. థియరీ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, టీచింగ్ ప్రాక్టీస్, కోచింగ్ ఎబిలిటీ, ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వీటితోపాటు లెక్చర్స్, ప్రాక్టికల్స్, ల్యాబొరేటరీ వర్క్‌లు, ఫీల్డ్ వర్క్‌లు, ఔట్ రీచ్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఒకేషనల్ ట్రెయినింగ్, సెమినార్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రజంటేషన్‌లు కూడా ఉంటాయి.

అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 2024 జూన్ 1 నాటికి 23 ఏళ్లు మించకూడదు. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. వివాహిత మహిళలు ఆరోగ్యం అనుకూలించని పక్షంలో కోర్సు నుంచి వైదొలిగే వీలుంది.

అడ్మిషన్ టెస్ట్: మొదట రాత పరీక్ష ఉంటుంది. దీనికి 50 మార్కులు నిర్దేశించారు. ఇందులో జనరల్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, స్పోర్ట్స్ అండ్ ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ అంశాలనుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. కనీసం 20 మార్కులు సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 30 మార్కులు నిర్దేశించారు. తరవాత స్పోర్ట్స్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. ఇది అభ్యర్థి ఎంచుకొన్న గేమ్/స్పోర్ట్‌కు సంబంధించి ఉంటుంది. దీనికి 10 మార్కులు కేటాయించారు. స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు మరో 10 మార్కులు ప్రత్యేకించారు. దీనికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే మొత్తమ్మీద కనీసం 45 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

● ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ఫిట్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్‌లు, స్పోర్ట్స్ క్లబ్‌లు, స్పోర్ట్స్ అకాడమీల్లో పీఈ టీచర్స్/ట్రెయినర్స్/ఇన్‌స్ట్రక్టర్స్/కోచ్‌లుగా ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

ఎంపీఈఎస్

● ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. 25 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సు, ఎలక్టివ్ కోర్సులు, స్పెషలైజేషన్ సబ్జెక్ట్, స్పెషలైజేషన్ స్పోర్ట్స్, డిజర్టేషన్, కోచింగ్ ఎబిలిటీ సెషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీపీఈఎస్/బీపీఈ/బీపీఈడీ/బీఎస్సీ-పీఈ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు.

అడ్మిషన్ టెస్ట్: రాత పరీక్షకు 100 మార్కులు నిర్దేశించారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్-స్పోర్ట్స్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 20, డిగ్రీ స్థాయిలో థియరిటికల్ నాలెడ్జ్ అంశాల నుంచి 80 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌కు 30 మార్కులు; గేమ్/స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు 20 మార్కులు నిర్దేశించారు.

● గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించే క్రీడలు: బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, స్విమ్మింగ్, టెన్నిస్, రెజ్లింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, జూడో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ట్రాక్ అండ్ ఫీల్డ్, యోగా, క్రికెట్, హ్యాండ్ బాల్, కబడ్డీ, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **అడ్మిషన్ టెస్ట్‌లకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 19
- **ఎంపీఈఎస్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూన్ 24, 25
- **బీపీఈడీ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూన్ 27 నుంచి 29
- **ర్యాంకుల లిస్ట్ విడుదల:** జూలై 8
- **వెబ్‌సైట్:** www.lncpe.ac.in

ఉస్మానియా వర్సిటీలో

లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.


ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం/సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/ సీఎస్ఎన్/సీఎస్‌ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 2
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 7
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 20
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

లిటిల్స్



సీతాఫలం నేర్పిన నీతి

నాగావళీ నదీ తీరంలో ఆనంద మహర్షి అనే ముని ఆశ్రమాన్ని నిర్మించుకుని తన శిష్యులతో కలసి నివసించేవాడు. ఒక రోజు ఆయన శిష్యులు- ఒక వ్యక్తిని మోసుకువచ్చారు. "ఇతను నదిలో కొట్టుకుపోతూ ఉంటే కాపాడాం" అని చెప్పారు. అప్పుడు ఆ ముని- ఆ వ్యక్తిని- "నదిలో ఎలా పడ్డావు?" అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి- "నా జీవితంలో అన్నీ కష్టాలే! అందుకే చనిపోదామనుకున్నా" అన్నాడు. అప్పుడు ఆ ముని తన శిష్యులతో- "ఇతనికి ఒక సీతాఫలం ఇవ్వండి" అని చెప్పాడు. ఆ వ్యక్తి ఆకలితో ఉండటంతో సీతాఫలాన్ని ఆబగా తినేశాడు. అప్పుడు ఆ ముని- "పండు తిన్నావు కదా.. గింజలను ఎందుకు ఉమ్మేశావు" అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి- "గింజలను ఎలా తింటాం స్వామి.. వాటిని బయటే పడేయాలి" అన్నాడు. అప్పుడు ముని- "జీవితం కూడా ఈ సీతాఫలం లాంటిదే! గింజలు మనకు వచ్చే కష్టాలు. వాటిని తొలగించుకొని జీవితాన్ని ఆస్వాదించాలి" అని హితవు చెప్పాడు. ఆ వ్యక్తికి జ్ఞానోదయమయింది.




సరైన నీడ ఏది?




ఎన్ని కుక్కలు ఉన్నాయి?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 331

8						3	4	
5			6					
	1	2					9	7
		5	1	4	8			9
				2				
1			3	9	5	8		
2	5					9	6	
					1			3
	9	7						1

సుడోకు - 330 సమాధానం

6	4	3	7	2	1	5	9	8
2	1	5	4	8	9	6	3	7
7	9	8	5	3	6	2	1	4
8	7	9	1	5	4	3	6	2
1	2	6	3	9	8	7	4	5
3	5	4	2	6	7	9	8	1
5	8	1	6	7	3	4	2	9
9	3	2	8	4	5	1	7	6
4	6	7	9	1	2	8	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సివిల్స్ ప్రిలిమ్స్

GS Mock Questions

నిన్నటి తరువాయి

51. Consider the following statements regarding National Asset Reconstruction company(NARCL):
1. It aims to improve financial system stability by reducing NPAs of banks.
2. It is incorporated under the Banking Regulation Act,1989 with PSBS holding a majority stake.
Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

52. Consider the following statements regarding Urea gold:
1. It is a non-organic slow-release fertilizer.
2. It is prepared by coating preheated urea granules with neem.
3. Urea gold ensures a more gradual release of nitrogen.
Which of the above statements given above are correct?
a. 1 and 2 only b. 2 and 3 only
c. 1 and 3 only d. 1, 2 and 3

53. Consider the following statements regarding Animal Husbandry Infra structure Development Fund (AHIDF)?
1. Dairy processing infrastructure
2. Meat processing and value addition infrastructure
3. Coastal aquaculture tanks
4. Animal feedplant
a. Only two b. Only three
c. Only four d. None

54. Consider the following statements with respect to the National Logistics Policy 2022?
1. Improve the logistics performance Index ranking and be among top 10 countries by 2030.
2. Create data driven decision support mechanism for a logistics system.
3. Reduce cost of logistics in India to global benchmarks by 2030.
Select the correct answer using the code given below:
a. 1 and 2 b. 2 and 3
c. 1 and 3 d. 1, 2 and 3

55. Consider the following statements regarding Zero coupon Zero principal (ZCZP) bonds:
1. ZCZP bonds neither offer interest nor returns the principal.
2. These bonds are issued only by not-for-profit organizations registered on the social stock Exchange.
Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

56. Consider the following statements regarding GDP calculation approaches:
1. The income approach measures the total income earned by the factors of production.
2. The production approach sums the value added at each stage of production.
3. The Expenditure approach measures the total expenditure incurred by all entities in goods and services.
4. India uses all three methods for GDP calculation and the value arrived using each method is always exactly the same.
How many of the statements given above is/are correct?
a. only one b. Only two
c. Only three d. All four

57. Consider the following statements regarding Self Help Groups (SHG):
1. SHGs are voluntary, village-based intermediaries.
2. The area of their influence is only limited to the economic sphere.
3. In India more than 80 percent of the SHGs are well organized.
How many of the statements given above is/are correct?
a. Only one b. Only two
c. Only three d. None

58. Consider the following statements regarding 'Special assistance to states for capital Investment:
1. It provides 20 year interest free loans to states.
2. The scheme instituted by the Ministry of Finance in 2020-21 in the wake of Covid-19 Pandemic.
3. The scheme has seven parts.
4. Among eight parts ,Incentives to states for scrapping of old vehicles is one of the part.
Which of the statements is/are correct?
a. Only two b. Only three
c. All four d. None

59. Consider the following statements regarding Gross domestic product:
1. India uses Income method to calculate GDP.
2. The base year for GDP calculation is 2014-15.
Which of the statements given is/are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

60. Consider the following statements of GDP deflator:
1. It is the ratio of real GDP to nominal GDP.
2. It reveals the increase in GDP that has happened on account of higher prices rather than an increase in output.
Which of the above statements given above is/are Correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

61. Consider the following statements regarding National Multi-dimensional poverty Index (MPI):
1. It is calculated by using Alkier-foster methodology.
2. An individual is considered MPI poor if their deprivation score equals to or exceeds India's national MPI poverty cutoff of 35%.
Which of the statements given above is/are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

62. Consider the following statements regarding Lakpati Didi Scheme:
1. It was launched during a pandemic.
2. It was launched by the ministry of micro, small and medium enterprises.
3. Lakpat Didis are women members of the SHGs with annual earnings of one lakh and more.
How many of the statements given above are correct?
a. Only one b. Only two
c. Only three d. All four

63. Consider the following statements regarding regarding Public debt:
1. General Government Debt was about 60% of GDP as of the end of March 2023.
2. External Debt constituted more than 50% of public debt.
3. High public debt leads to crowding out effect and limits the fiscal resources.
Which of the statements given above are correct?
a. Only 3 b. 1 and 3 only
c. 2 and 3 only d. 1, 2 and 3.

64. Consider the following statements regarding Cash Reserve Ratio (CRR):
1. All scheduled commercial banks have to maintain CRR at 4.5%.
2. CRR are to be maintained in form of liquid cash with the concerned Banks.
3. The banks do not earn any interest on CRR.
4. As per the RBI Act 1934, the cooperative Banks are excluded from maintaining CRR.
Which of the statements given above is correct?
a. 1 and 2 b. 1 and 3
c. 1, 2 and 4 d. 1, 3 and 4

65. Consider the following statements regarding Treasury bills:
1. These are issued by RBI.
2. These are short term debt instruments issued for maturities of less than 91 days.
3. These are zero coupon securities and pay no interest.
Which of the statements given above is/are correct?
a. 1 and 2 b. 2 and 3
c. 3 only d. 1, 2 and 3

66. Lichens, which are capable of initiating ecological succession even on a bare rock, are actually a symbiotic association of
a. Algae and bacteria
b. Algae and fungi
c. Bacteria and fungi
d. Fungi and mosses

67. Which of the following is the correct sequence in ecological from the lowest to the highest?
a. Individual-Population-Community-Ecosystem-Biosphere
b. Population- Individual- Community - Biosphere- Ecosystem
c. Individual-Community-Population-Ecosystem-Biosphere
d. Individual- Population- Community - Biosphere- Ecosystem

68. In Environment context "operation Green Wave"is associated to which of the following countries?
a. Brazil b. Canada
c. India d. Indonesia

69. Which of the following statements ae correct?
1. The Sundarbans mangroves are the largest single block of tidal holophytic mangroves of the world.
2. Indian Sundarban is bound on the east by river Muriganga and on the west by rivers Harinbhahga and Raimangal.
3. The Sunderbans Delta is the only mangrove forest in the world inhabited by tigers.
Select the correct option from the codes given below:
a. Only one b. Only two
c. All three d. None

70. Which of the following is the Dominant producer in lakes?
a. Phytoplankton b. Zoo plankton
c. Macrophytes d. Halophytes

ANSWERS

51. a		61. a	65. b
52. c			66. b
53. b	57. a	61. a	67. a
54. b	58. a	62. a	68. a
55. c	59. a	63. a	69. b
56. c	60. b	64. b	70. a

Prepared by : CSB Academy, Hyderabad